

ఆంధ్రపత్రిక
-చిత్రవారపత్రిక
4 అణాలు
29-10-'52



పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
పూర్వమందొక నగర మందున దుష్టబుద్ధీ, సుబుద్ధీ అను మిత్రులిద్దరు కలిసిమెలిసి వసించేవారు
ధనార్జనపై ఆశ కలిగి ఇద్దరూ బహు దూరదేశం బయలు దేరారు.
మధ్య దారిలో మన సుబుద్ధికి నేలలో దొరికింది బోలెడు పాతరేసిన ధనపు రాసీ!
వెదుకబోయిన ధనము దొరుకగ ఇరువురెంతో సంతసించి సగము సగమూ పంచుకుందామనుచు తలచి సొంత వూరికి తిరిగివచ్చారు
పల్లెటూరి పొలిమేరవద్దను ఇద్దరూ ఆగారు కొంచెం
"ఇంతడబ్బు చేతపట్టుకు-పోవుటెందుకు సుబుద్ధీ!-నీవు వందా నేను వందా-తీసుకొని యీ బిందె నిక్కడ-చెట్టుకిందనే పాతిపెట్టి-ఎప్పుడవసరమైతే అప్పుడు-కాస్తకాస్త తీసుకెడదాము!"
సరేనన్నాడా సుబుద్ధీ. బిందె నక్కడ పాతి పెట్టి ఇంటికెళ్లారు
మాసమైనా గడవకుండా మరలీ వచ్చిన దుష్టబుద్ధీ: "చెరొక వందా తీసుకొందాం; రా, సుబుద్ధీ, పోయివద్దాం!" అనుటలోడ సుబుద్ధి అందుకు సమ్మతించి అట్లె చేశాడు.
మరొకమాసం గడిచిపోగా దుష్టబుద్ధికి మెదడులో దుర్బుద్ధి పుట్టింది: "రా, సుబుద్ధీ! మళ్లీకొంచెం డబ్బులోటొచ్చింది" అని సుబుద్ధిని వెంట బెట్టుకు వెళ్లి చూశాడు
చెట్టు కిందా తవ్వి చూడగ-వట్టి బిందే కంట పడినది.-దుష్టబుద్ధీ ముందుగానే-బిందె తీసుకు నెత్తి కొట్టు-బాదుకొంటూ, రొజుకొంటూ-"అయ్యొ బాబో! నీ పనే యిది-నమ్మినందుకు గొంతుకోశావ్"-అని సుబుద్ధిని తిట్టసాగాడు.
"నీకు మాత్రం జారనీయకు డబ్బు సంగతి నాకు తెలియదు"
"నీకు తెలియక, నాకు తెలియక-పాతిపెట్టిన డబ్బుకాస్తా-దేవుడెత్తుకు పోయినాడా?-దెయ్యమెత్తుకు పోయినాడా?"
మిత్రులిద్దరు వాదులాడుతు-గొల్లుగొల్లున కేకలేస్తూ-న్యాయమూర్తుల సమీపించి-చెప్పుకున్నారు:
"డబ్బు యితడే తీసెననుటకు సాక్ష్యముందా దుష్టబుద్ధీ?"
"ఉంది స్వామీ! రేపు పొద్దున వృక్షదేవత చేత న్యాయముగ సాక్ష్యమిప్పిస్తా!!"
ఈ తమాషా చూడవలెనని న్యాయమూర్తులు సరేనన్నారు.
నాటిరాత్రి దుష్టబుద్ధీ-తండ్రినడిగాడు:-"నేటిరాత్రే నువ్వుపోయి-చెట్టు తొర్రలో దాగి వుండాలి రేపు వుదయం న్యాయమూర్తులు-వచ్చినప్పుడు నువ్వు సరిగా-వృక్షదేవత పలికినట్టే సాక్ష్యమిస్తే మనం గెలుస్తాము."

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

సంపుటము 45
సంచిక 10
29-10-52

Founder : K. NAGESWARA RAO

నందన కార్తిక శుద్ధ ఏకాదశి బుధవారము



పల్లెకారి : ఒక లోహప్రతిమ

విషయానుక్రమణిక

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక.

సంక్రాంతికి ప్రత్యేక సంచిక, కథలపోటీ

రాబోయే సంక్రాంతికి (14-1-1953) ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక ప్రత్యేక సంచికగా వెలువడుతుంది. ఈ సంచికలో ప్రత్యేకాకర్షణగా కథలపోటీని ఏర్పాటు చేయదలచాము. గ్రామీణ వాతావరణం, గ్రామీణ జీవితం, గ్రామీణసమస్యలు ఆధారం చేసుకుని, మా వారపత్రికలో ఆరుపేజీలకు మించకుండా, స్వతంత్రంగా రచించబడిన కథానికలను పోటీకి స్వీకరిస్తాము. మొదటి బహుమతి కథకు 75 రూ॥లు, రెండవ బహుమతి కథకు 50 రూ॥లు ఇవ్వబడుతుంది. పోటీలో యావన్మంది రచయితలు పాల్గొనవచ్చును.

పోటీ కథానికలు డిసెంబరు 1 వ తేదిలోగా మా కార్యాలయానికి చేరాలి.

సంక్రాంతి సంచికకు ఇతర కథానికలు, గేయాలు, పద్యాలు, ఛాయాచిత్రాలు, లిఖితచిత్రాలు పంపగోరేవారు కూడా డిసెంబరు 1 వ తేదీలోగా పంపగలరని ఆశిస్తున్నాము. ముఖ్యంగా ఛాయాచిత్రాలు, లిఖితచిత్రాలు గ్రామీణ వాతావరణం, సంక్రాంతిపండుగ దృశ్యాలు చూపించేవైతే మరీ సంతోషం.

పోటీకి పంపే కథానికలను “సంక్రాంతి సంచిక కథానికల పోటీకి” అనీ, సంక్రాంతి సంచికకు పంపే ఇతర రచనలను లిఖిత చిత్రాలను “సంక్రాంతి సంచికకు” అనీ స్పష్టంగా వ్రాయాలి.

సంక్రాంతి సంచికను సాధ్యమైనంత ఆకర్షకంగా వెలువరించాలని మా ప్రయత్నం. పాఠకులు, రచయితలు, అభిమానులు మా యీ ప్రయత్నానికి సర్వవిధాలా సహకరిస్తారని ఆశిస్తున్నాము.

కాలక్షేపం

"అది మేలైనపురంబు; పూజ్యచరితుం
డా రాజు; రాజ్యాంగమం
బది; పార్శ్వంబున; నా విదగ్ధ సభ; నా
రజ్ఞాన్వయ; లత్యుద్ధతం
బది; రాజన్యక మద్ది; వందినికరం -
బా గాథలున్ సర్వమున్
గదలం జేసిన కాలమూర్తికి నను
స్కారంబు సత్కీర్తికిన్."
(సుభాషితం)

"ఒకప్పుడు ఇక్కడ ఒక మహానగరం ఉండేది. ఇక్కడ పరిపాలన చేస్తూ ఉండిన రాజు చాలా పూజ్యచరిత్రుడు. ఇక్కడనే సామంత రాజమండలం ఉండేది. మహా పండితులు ఇక్కడనే సభ చేస్తూ ఉండేవారు. అక్కడ పద్మముల వంటి ముఖములుగల అందకత్తెలు నివసిస్తూ ఉండేవారు; అది చాలా మహోన్నతమైన భవనంగా ఉండేది. రాజశ్రేష్ఠులు వారు. వందిమాగధులనబడు పరివారజనం ఇక్కడ ఉండి ప్రభువుల బిరుదావళులను విజయప్రతాపములను ప్రకటిస్తూ ఉండేవారు. ఆనాటి పూర్వ విశేషములన్నియు అంతర్ధానమయ్యేటట్లు చేసినటువంటి కాలమూర్తికీన్ని, ఈ కాలగర్భంలో అంతర్ధానం కాకుండా దానికి అతీతమై మిగిలియున్నటువంటి దాటిఆ వైభవ ప్రాభవముల సత్కీర్తికిన్నీ నమస్కారము."

ఇంతకన్నా నిర్గుణమైన ఉపాసన ప్రస్తుతం కన్పించడం లేదు. భగవంతుడు ఆకారం లేనివాడు. నిరాకారుడుమాత్రమే కాదు. ఆ పరమాత్మతత్వం అటువంటిదని గాని ఇటువంటిదని గాని వర్ణించి చెప్పడానికి వీలు లేదు. ఎందుచేతనంటే, దానికి ఏవిధమైన గుణవిశేషాలున్నా లేవన్నారు. ఉదాహరణకు చూడండి. దేవుడు ఆకారం లేనివాడు. గాలికిమాడా ఆకారం లేదు. కాని దేవుడంటే గాలి వంటివాడు కాడు. గాలికి చల్లదనం గాని వెచ్చదనం గాని ఉంటుంది. భగవంతునకు అది కూడా లేదు. ఆకారం లేదుగనుక కంటితో చూడలేము. ఉఱుము మాదిరిగా శబ్దం చేసే వస్తువు కాదు ఆ పరమాత్మ. కనుక దేవుణ్ని చెవితో గ్రహించలేము. ముక్కుతో వాసన చూడలేము. నాలుకతో రుచిచూచి తెలిసికొనలేము. శరీరమునకు తాకినప్పుడు అనోకడంవల్ల అనగా స్పర్శ జ్ఞానంవల్ల పరమాత్మను తెలిసికోలేము. కనుక మన కంటికి, చెవికి, ముక్కుకు, నాలుకకు, స్పర్శకు, యీ అయిదు యింద్రియజ్ఞానములకు అందనటువంటి పరతత్వం ఒకటి ఉంది అంటారు. మన పంచేంద్రియములలో దేనివల్లనైనా ఒక దానివల్లను మనము పరమాత్మను గ్రహింపగల్గినట్లయితే, రూప, శబ్ద, గంధ, రస, స్పర్శ అనబడే టటువంటి అయిదు గుణాలలో ఏదో ఒకదానివల్ల గ్రహింప గల్గుతాము. కాని యీ గుణాలు ఏవిన్నీ లేనటువంటిది ఆ పరతత్వం అన్నారు. గుణాలు లేని నిర్గుణబ్రహ్మం అన్నారు. మన పంచేంద్రియాలమూలంగా గ్రహించగల్గినటువంటిది ఏదైనా ఒక గుణం పరబ్రహ్మకు ఉన్నట్లయితే, అప్పుడు పరబ్రహ్మతత్వం ఏదో ఒక గుణంగల పదార్థం (సగుణతత్వం) అవుతుంది. కాని పరబ్రహ్మతత్వం అనేది సగుణం కాదనిన్నీ, నిర్గుణం అనిన్నీ మహాజ్ఞానులూ, తపస్సంపన్నులూ నిర్ధారణ చేశారు.

కనుక రూపంవల్లగా గుణలక్షణాలు ఏమిన్నీ లేనటువంటి పరమాత్మను ఊహించడంగాని అట్టి పరమాత్మను గూర్చి ధ్యానం చేయడంగాని ఉపాసన చేయడం గాని ఎట్లా? అది ఏమిటో తెలియని "వట్టి హుళక్కి" అనినట్లయితే, అటువంటి విషయాన్ని మనస్సుతో ఊహించడం అసాధ్యం. కాని, సాధ్యమైనంతవరకు దానిని గూర్చి అర్థంచేసికొనడానికి ప్రయత్నంచేయగా చేయగా, యీ "హుళక్కి" ఏమిటో, యీ "మాయ" ఏమిటో, యీ చిదంబర రహస్యం ఏమిటో బోధపడు తుంది అన్నారు.

బుద్ధుడు యిదే విధంగా గయలో బోధి వృక్షం అనబడే ఒక మఱ్ఱి చెట్టు క్రింద కూర్చుండి తపస్సు చేశాడు - కొన్నాళ్లు ధ్యానం చేయగా "హుళక్కి" అనేది ఏమిటో తెలిసికొన్నాడు. మొట్టమొదట రాజవీధిలో ఒకనాడు రథం ఎక్కి నగర వీధులలో వెళ్ళుచుండగా ఒక ముసలిని చూచాడు. మానవ శరీరం యీవిధంగా యౌవనంలో ఉన్న జవసత్త్వములను గోల్పోయి శిథిలమైపోతుంది అని గ్రహించాడు. ఇదే అతనికి నిద్రలో కలగా వచ్చిందని అంటారు. ఏనాటికైనప్పటికీ తన శరీరం కూడా అదేవిధంగా శిథిలమైపోతుందగదా అనే ఆలోచనలో బుద్ధుడు మునిగిపోయినాడు. అయితే శిథిలం అయిపోయేదానిని శిథిలం కాకుండా చేయగలమా? అసలు, శిథిలం అంటే ఏమిటి? శిథిలం కాకుండా ఉండాలని మనం కోరడంమాత్రం ఎందుకు? శిథిలం అయితే మాత్రం ఏం నష్టం? శిథిలం అయ్యేది ఏమిటి? శిథిలం కానిది ఏదైనా ఉన్నదా? పుట్టడమూ, పుట్టిన తర్వాత క్రమేణా రూపు మారిపోతూఉండడమూ జరుగుతోంది. వయస్సు మారినకొద్దీ, కాలం మారినకొద్దీ మార్పు కలుగుతోంది. మార్పు అంటేనే కాలం. కాలం అంటేనే మార్పు.

ఒకప్పుడు శ్రీ కృష్ణదేవరాయలవారు పరిపాలించిన హంపీనగరం యీనాడు చూస్తే పాడుపడిపోయి, జీర్ణించి కృశించి పడియున్న ఒక ముసలి ముసలి యొక్క కళేబరంలాగున ఉంటుంది. ఆ పాడుపడియున్న హంపీశిథిల నిర్మాణములను చూచి, "ఆహా! అది మేలైన పురంబు ఒకప్పుడు" అని యీనాడు దానిని గూర్చిన కథలు చెప్పుకొంటున్నాము. ఆనాటి ప్రభువు చాలా పూజ్యచరితుడు, ఆయన సభలో ఉండిన పండితులు ఉద్దండులు. దిగ్గంతులు. ఆ రాజాంతఃపురము

★ కాలక్షేపం ★

లలో పద్మముఖంటి ముఖంగల అందకత్తెలు చాలామంది ఉండేవారు. ఆనాటి రాజసభలలో వందిమాగధులు రాయలవారి విజయపరంపరలను సభలలో ఉగ్గడిస్తూ అని ప్రకటిస్తూ ఉండేవారని ఒళ్లు గగుర్పొడిచేటట్లుగా కీ॥ శే॥ కొడాలి సుబ్బారావుగారు రచించిన "హంపీక్షేత్రం" అనే కావ్యంలో అద్భుతంగా కీర్తించారు; "కాలమూర్తికి నమస్కారంబు సత్కీర్తికిన్" అన్నారు. "జయమహారాజ నీ విజయ శంఖము మ్రోగె" అని రాయలవారి నిండు సభలోకి వచ్చి సేనానియైనవీరమనీడు మహోత్సాహంతో అన్నాడు. ఈ పూర్వకథా సందర్భం చాలా అద్భుతమైనది. అపూర్వమైనది. దక్షిణదేశంలోని చోళరాజును జయించి రావలసినదిగా కృష్ణదేవరాయలవారు తన సేనానాయకుడైన నాగమనీడును కొంత సేన యిచ్చి పంపించారు. కాని, యీ నాగమనీడు చోళరాజును జయించి, చోళరాజ్యాన్ని పాండ్యరాజ్యాన్ని కూడా ఆక్రమించి ఆరెండు రాజ్యాలకు తానే స్వతంత్ర రాజునని ప్రకటించుకొన్నాడు.

ఈ విధంగా కృష్ణరాయల యెడల నాగమనీడు స్వామిద్రోహం చేశాడు. అప్పుడు ఆ నాగమనీడును జయించి ఖైదీగా పట్టుకొని తీసికొనివచ్చుటకు ఆ నాగమనీడు యొక్క కుమారుడైన వీరమనీడు, సిద్ధమైనాడు. రాజాజ్ఞపొంది తండ్రిమీదకు దండెత్తివెళ్లి, తండ్రిని గెల్చి, ఖైదుచేసి పాండ్యరాజులను, చోళరాజును వీరమనీడు తన వెంటబెట్టుకొని వచ్చి రాయలకు అప్పగించినాడు. కృష్ణరాయలు వీరమనీనియొక్క స్వామిభక్తికి మెచ్చి, తన కృతజ్ఞతకు తార్కాణంగా వీరమనీని తండ్రియగు నాగమనీని క్షమించి తంజావూరునందు వీరమనీడును రాజుగా ప్రతిష్ఠించి పాండ్యులను అతనికి సామంతరాజులుగా చేశాడు. పాండ్య రాజుల రాజధాని మధుర. చోళరాజులది తంజావూరు. అప్పటినుంచి తంజావూరులో ఆంధ్ర ప్రభుత్వము ఆరంభమని అంటారు. ఈవార్తనే ఆనాడు కృష్ణరాయలవారి దర్బారులో వీరమనీడు మహోత్సాహంతో ప్రకటించాడు.

"జయమహారాజ! నీ విజయ
శంఖము మ్రోగిన; దాంధ్రజాతి ది
గ్జయమును పొంది శాశ్వత
యశస్సును గన్నది; చోళపాండ్య రా
జ్జయమున లొంగి దక్షిణము
సర్వము మిమ్ముల చక్రవర్తిగా
నయమున గోరుకొన్నది;
వినమ్రుడ స్వామికి భక్తియుక్తుడన్."

ఆనాటి హంపికి హారతులిచ్చిన ఆ కవి కూడా హారతికర్పూరంవలె హరించినాడు. కాని, ఆకావ్యాన్ని కీర్తిస్తూ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు వ్రాసిన తొలిపలుకు వేదవాక్కువలె తొలిపలుకువలెనే నేటికిన్నీ నిలచి యున్నది. కావ్యాన్ని మిగిల్చి కవిని మాయంచేసిన కాలమూర్తికి నమస్కారంబు సత్కీర్తికిన్ అని మనం తూర్పు తిరిగి నమస్కారం చేయక మరేమి చేయగలం ?

మహమ్మదీయదండయాత్రల మూలంగా "హిందూరాజ్యరమా" (హిందూ రాజ్యలక్ష్మి) నాశనమై శిథిలమై పోతున్నదిగనుక దానిని శిథిలం కాకుండా చేయవలెననే సంకల్పంతో హిందూమత ధర్మరక్షణార్థం బద్ధకంకణుడై హిందూసామ్రాజ్యాన్ని స్థాపించడంకోసం శ్రీకృష్ణదేవరాయలు ఆనాడు "అఖండ హిందూస్థాన్ కీ జై" అని దిగ్విజయ యాత్ర సాగించాడు. ఇతర హిందూ రాజుల నందరినీ ఈ ధర్మదీక్షాతోరమును చేతికి కట్టుకోవలసినదన్నాడు. తాను తలపెట్టిన మహా సంకల్పానికి తోడ్పడవలసినదన్నాడు. మహమ్మదీయుల పక్షం చేరకుండా తన పక్షం చేరి హిందూరాజ్యమును ఉద్ధరించడానికి సిద్ధంకావలెనన్నాడు. తన మాటకు ఎదురు తిరిగిన వారిమీద అదురు బెదరు లేకుండా కత్తి పైకెత్తాడు. అయినా తురుష్క ప్రభువులమూలంగా కలిగిన నష్టం ఏమిటి? వారి మూలంగా హిందూరాజ్య రమకు కలిగిన ఉపద్రవం ఏమిటి? అని యోచించాలి.

వారు హిందూస్త్రీలను చెరబెట్టి అపహరించారు. మహమ్మదీయ మతంలో చేరని వారిని నిర్బంధించి హింసించారు. హిందూ దేవాలయాలను కొల్లగొట్టి నిర్మూలించారు. ఇదే రాక్షసం. ఇదే అధర్మం. హిందూమతం యిటువంటి అధర్మాన్ని సహించదు. హింసను సహించదు. ఎవరి మతవిశ్వాసం ప్రకారంగా వారు భగవంతుణ్ని ఆరాధించుకోవచ్చు. కాని, "భగవంతుణ్ని ఏదో ఒక్క పద్ధతి గానే ఆరాధించాలి" అని హిందూమతం ఎవరినీ నిర్బంధించదు. భగవంతుడు నిర్గుణుడు, నిరాకారుడు. నిర్గుణుడైన భగవంతుణ్ని ధ్యానించలేముగనుక, సగుణంగానే ఏదో ఒక ఆకారంగాని, గుణవిశేషాలు గాని కల్పించి, ఆ గుణవిశేషాల మూలంగా భగవంతుణ్ని స్మరిస్తూ ఉండాలి. అటువంటి సందర్భంలో ఎవరికి వీలైన విధంగా వారు ఆయా రూపకల్పనగాని, గుణవిశేషారోపణగాని భగవంతునకు చేసికోవచ్చు. హిందూమతం బోధించే తత్వం ఇది. అందుకనే అన్నిమతాలవారినీ గౌరవిస్తుంది హిందూమతం. హిందూమత లక్షణం, హిందూ మతధర్మం యిది. అందువల్ల ఎవ్వరినీ నిర్బంధించి హింసించకూడదు. అన్నిమతాలవారినీ సహించి గౌరవించాలి. సర్వమతసహనం అనేది హిందూమతంయొక్క గొప్ప ధర్మం. ఈ హిందూమత ధర్మం చాలా గొప్పదని కృష్ణదేవరాయలవారు గ్రహించారు. ఈ హిందూమత ధర్మమును ఉద్ధరించాలని ఆయన దీక్షవహించారు.

"ధర్మం" అనేదానికి కళంకం రాకూడదు. ధర్మరక్షణ కొరకే "సంభవామి యుగే యుగే" అని శ్రీకృష్ణులవారు అభయహస్తమిచ్చారు. అయినా, ఆయన అభయహస్తం యివ్వకపోతే మాత్రం, "ధర్మం" అనేది దాని అంతట అది తన ప్రభావాన్ని చూపించి తన్నుతాను రక్షించుకోలేదా ? తప్పకుండా రక్షించుకుంటుంది.

అందుకని "ధర్మమేవ జయతే" అన్నారు. మన కాంగ్రెసుప్రభుత్వం "సత్యమేవ జయతే" అన్నారు. "సత్" అనే మాటనే "సత్యం" అన్నారు. "సత్" అనేదానిలో సత్తువ ఉన్నదని మనము అంగీకరించినట్లయితే, "సత్" అనేది నిత్యమైనదిగా ఉండి, ఆత్మవినాశనం లేకుండా ఆత్మరక్షణ చేసుకుంటూ వర్ధిల్లుతూ ఉండక తప్పదు. కనుక హంపీనగరం నాశనం అయిపోతేమాత్రం ఎందుకు విచారం? "ధర్మం" అనేదీ, "సత్యం" అనేదీ నాశనం కాదు గదా -

గడచిన మహా సంగ్రామం ప్రారంభమైన దినాలలో గవర్నరుజనరలు అయిన లిన్‌లిత్గో ప్రభువుతో గాంధిమహాత్ముడు సిమ్లాలోమాట్లాడుతూ, యుద్ధంప్రారంభమైనందుకు కళ్ళనీళ్లు పెట్టుకొన్నాడు. లండను నగరం మీదకు జర్మను విమానాలు వచ్చి అక్కడ ఉండే బ్రిటిష్ పార్లమెంటు భవనాలమీద బాంబులు వేసి, ఆ భవనా

పీడకల

★

జీవిత మొక పీడకలగ! చీదరగా! యాతనగా!
చావుబరువు లాగే శ్రమజీవుల మెడ గుదిబండగ!
ఎవరో! ఇంకెవరో! సృష్టించలేదు! దినం! దినం!
ఇది మీ రొకరొకరే మొలిపించిన అసిపత్రవనం!

దారి తప్పి, ధనం తప్పతాగి, తూలిపడు మనీషీ!
కారుణ్యం కరువై నీ కళ్ల వెలుగు కునికిన దే!
వేరే ఇంకెవరో మరి లే రదిగో! తుత్తునియలు!
నీ రథచక్రాల వాడికోరలలో నిర్భాగ్యులు!

కాదు! వట్టిమాట కాదు! కాదు! బిగించింది! చూడు!
నీ దురాశపాశం నిరుపేదల కురి తాడు! నేడు!
నా కేమని వెళ్లిపోకు! నీకోసం వెంట వెంట
లోకశోకమే గుండెల్లో కొట్టెను! దిగులుగంట!

ఇది మీ ఒకరొక్కరి నెమ్మదిలో విషపరిపాకం!
ఎవరో! వేరెవరో! నిర్మించలేదు! భూనరకం!
దోవ కానరాని పాడుబావిగ! చీకటి చెరగా!
జీవితమే పెనుభీతిగ! చావే తుదివిడుదలగా!

శ్రీ పి. గణపతి శాస్త్రి

లను ధ్వంసం చేసి భస్మం చేయగలవనే విషయం ఆయన తెలుసుకొని అందుకొరకై విచారపడి కళ్ళనీళ్లు పెట్టుకొన్నాడు. నిజం ఆలోచిస్తే, మహాత్ముని అంతవానికి ఇటువంటి విచారంగాని విషాదంగాని కలుగవలసిందికాదు అప్పటికి భారతదేశానికి బ్రిటిష్‌వారు స్వాతంత్ర్యం ఇంకాయివ్వలేదు. సంపూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వడానికి వీలులేదని వాదిస్తున్నారు. స్వాతంత్ర్యం కావాలని ఆందోళనచేస్తూ సత్యాగ్రహం చేస్తున్న కాంగ్రెసు నాయకులను యీ బ్రిటిష్‌వారే జెయిళ్ళలో పెట్టి హింసిస్తున్నారు. గాంధి మహాత్ముణ్ని యీ బ్రిటిష్‌వారే జెయిలులో పెట్టి హింసించారు అటువంటి బ్రిటిష్‌వారియొక్క లండను నగరంగాని అందులోని పార్లమెంటు భవనములుగాని జర్మను విమానదాడుల మూలంగా నాశనమైపోతాయని ఆమహాత్ముడుకంటతడి పెట్టడం ఎందుకు? మానవ శరీరములే శిథిలమైపోకతప్పదు అటువంటి సందర్భంలో యీ పార్లమెంటు భవనాలు శిథిలమైపోకుండా శాశ్వతంగా ఉంటాయా? ఆమాత్రం విషయం గాంధి మహాత్మునకు తెలియదా? ఆయనకు ఆ విషయం తెలుసు. అంతకంటె ఎక్కువగానే తెలుసు. ఆయన హృదయంలో నుంచి పైకి వచ్చిన మహా ఊహామేఘమొకటి చల్లబడి బాష్పవర్షంగా కురిసి ఉంటుంది. బ్రిటిష్ స్వాతంత్ర్యానికే భంగం వస్తుంటే, భారత స్వాతంత్ర్యం ఇంకెక్కడిది?

ప్రపంచ ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు గురుపీఠం అనే ప్రతిష్ఠ పొందిన బ్రిటిష్ పార్లమెంటు భవనాలు, జర్మను నిరంకుశ నియంత యగు హిట్లరు చేత నిర్మూలింపబడితే, ముందు గతి ఏమిటి? లోకంలో ఇక ఆయుధబలమేనా అధికారం చలాయించేది? ఇక సౌమ్యంగా రాజ్యాలకూ రాజ్యాలకూ మధ్య వ్యవహార పరిష్కారాలు అనేవి ఉండవని ఎంచుకోవలసినదేనా? ప్రజాస్వామ్య ధర్మం ఇంతటితో నశించవలసినదేనా? "ఏమీ ఈకాల మహిమ?" అని మహాత్ముని మనస్సులో ఊహాల తుపాను చెలరేగి ఉంటుంది. లోకసంగ్రహార్థం పరితపించిన ఆ గుండెలో నుంచి ఒక మేఘము ఆ సిమ్లాప్రాంత హిమాలయపర్వతాలలో పవిత్రగంగాజలములై ద్రవించి స్రవించింది. హిట్లరు ప్రతాపాగ్ని ఆఖరుకు చల్లబడింది. హిట్లరు ఇంకా జీవిస్తే హిట్లరే జయిస్తే లోకం ఏమయ్యేదో, ఏవిధంగా పరిణమించేదో భారతదేశ స్వాతంత్ర్యోద్యమం ఏవిధంగా ఆహుతి అయ్యేదో ఎవరూహించగలరు? భూత భవిష్యద్వర్తమానాలతో కూడిన కాలస్వరూపములోనున్న ధర్మస్వరూపాన్ని సాక్షాత్కారం పొందినవాడే జవాబు చెప్పగలడు.

ఇంగ్లాండున్నూ అమెరికాయున్నూ సామ్రాజ్యకాంక్షగల రాజ్యాలనియు, జర్మనీయున్నూ జపానున్నూ కూడా అటువంటి సామ్రాజ్యదాహంగల రాజ్యములే అనియు, ఈ సామ్రాజ్య కాంక్షతో తపించెడి దేశాల పక్షమున భారతదేశము చేరకూడదనియు, సామ్రాజ్యవాదప్రతికూలమైన రష్యా పక్షమే గత మహాసంగ్రామ సమయంలో భారతదేశం చేరడం ఉత్తమమనియు, యుద్ధారంభదినములలో పండిత

(49-వ పేజీ చూడండి)

> కాలేజీ చదువు చదువుతున్న కూతురితో తల్లి:
> "చూడు అమ్మా! కూరల ధరకాస్త తగ్గాక వంట నేర్పుకొందువు కానీ, యిప్పటికి మాత్రం నన్నే చెయ్యనీ!"

సంసారమ్ 2.

గంప సంసారమ్

శ్రీ యస్. జి. ఆచార్య

ఏది సంసారం? మూడు అంతస్తుల మేడలో వున్నదేనా లేక పటకుటీరంలో వున్నది కూడా సంసారమేనా?- మరి చెట్టుక్రింద జీవించేవాళ్ళది,—అదీ సంసారమేనా?

ఉన్నదికదా అని అంతరిక్షాన జీవించేదీ—లేమితో బాధపడుతూ చిన్న చుట్టు గుడిశెలో జీవించేదీ- సమాజంలో రెండూ సంసారాలుగానే పరిగణించబడుతూ వుంటాయి. ఐతే ఆ రెంటినీ ఉన్న సంసారమనీ లేని సంసారమనీ అంటారు. తప్పితే రెండూ సంసారాలే!

*   *   *

సాధారణంగా చాలామంది వొక భ్రమలో పడి మాట్లాడుతూ వుంటారు; ఉన్నవాళ్ళ సంసారాలన్నీ సుఖప్రదమై హాయిగా వుంటవనీ, లేనివాళ్లు అందరూ లేమిలోపడి గిజగిజా తన్నుకలాడిపోతూనే వుంటారనీ వీళ్ల సంసారాలలో ఆనందమన్నది వుండనే వుండదనీ అనుకుంటారు.

ఈ అభిప్రాయంలో కొంత నిజం వుంటే వుండవచ్చు కాని యిది పూర్తిగా నిజమని యంటేమాత్రం నేను అంగీకరించను.

*   *   *

"ఆ కొంప చూస్తేనే భయం వేస్తుంది; అందులో యెలా సంసారం చేస్తున్నారో కాని" అని కొందరు విమర్శిస్తారు.

ఆ విమర్శకు ఆధారం తక్కువ. అనేకమంది "విమర్శకాగ్రేసరులు" పుస్తకాలను యెలా తప్పుపద్ధతిలో విమర్శచేస్తారో అదే పద్ధతిలో తప్పుపద్ధతిలో సంసారాలన కూడా విమర్శ చేస్తూవుంటారంటాను. మహా వేదాంతియైనవాడు శృంగార గ్రంథాన్ని పట్టుకుని యిటువంటి పుస్తకాలు వుండరాదని కొట్టిపార వేయడం యెంత సబబో,- ఒక తరహా సంసారాన్ని - దానితో పరిచయంలేని మరొకరు సానుభూతిలేకుండా కూడా విమర్శచేయడం అంతే సబబు!

మనం విమర్శచేసేటప్పుడు, మనకు ఆ సంబంధమైన పరిజ్ఞానం కొంత వుండాలి; సానుభూతీ వుండాలి; దానిలోని విశేషం యేమిటో తెలిసికుందామనే కుతూహలమూ వుండాలి. అంతేగాని మనం యేదో అంతిస్తుమీద కూర్చుని అదే కొలబద్ద అనుకొని యెదుటివారిని విమర్శచేస్తూపోతే అలా చేసేవిమర్శ విమర్శ అనిపించుకోనే అనిపించుకోదు! అసలు ఆరంభంలోనే హంసపాదవేసి మరి గుడ్డియెద్దు చేనిలో పడ్డట్లు పోవడమే అనిపించుకొంటుంది.

*   *   *

సుఖదుఃఖాలన్నవి అన్ని తరహాల సంసారాలలోనూ వుంటవి. సుఖాలన్నీ వొకరివీ, దుఃఖాలన్నీ యింకొకరివీ యన్నట్లు గుత్తగొన్నట్లుగా యెవ్వరూ జీవించరు. ఇవ్వాళ వొక సంసారం తీరని దుఃఖంలో మునిగిపోవచ్చు; అదే సంసారం ఆ తరువాత అనంతమైన ఆనంద పారవశ్యత పొందవచ్చు. కనుక మనం పాఠాలు నేర్చుకోవాలనినా - మానవజీవనానికి సంబంధించిన అనేక సమస్యలను పరిశీలించవలెననినా చిన్న పెద్ద సంసారాలన్నింటినీ పరిశీలించవచ్చు. మనం చేసే ఆ పరిశీలన యేదోవొక విధమైన అంశంతో పరిచయం చేస్తుందే తప్పితే వృధాకాదు. అంచువల్ల విశాలప్రపంచం వొక మహావిద్యాలయంగా, దానిలోని ప్రతీ సంస్థా వొక విజ్ఞానకేంద్రంగా - సుఖదుఃఖాలతో పరిచయంచేయగల వ్యవస్థగా తీసుకుందాము. ఇటువంటి సమాధానంతో చిత్తం పెంపొందించుకోగలిగిన మీరు యిక నాతో యెక్కడ పడితే అక్కడకు రావచ్చు; నేను చూడగలిగే దృశ్యాలను సానుభూతితో మీరూ చూడగలరు. అనేక ఘట్టాలలో అనేకమంది అనుభవించే ఆ యానందాన్ని నేనూ నాతోబాటు మీరూ ఆనందించగలరు.

ఇప్పుడంటే పట్నవాసపు జీవనం అలవాటయిపోయింది కాని బాల్యావస్థ అంతా పల్లెసీమలలోనే—అందులోనూ మన్యపు ప్రాంతాలలోనే గడిచింది. అందువల్ల ఆ చిన్నతనంలో నన్ను మొదటిమారు ఆకర్షించిన సంసారశోభ గురించి చెప్పనీయండి.

బస్తీలలో వేసవి రాకముందే మన్యపు ప్రాంతంలో వేసవి ప్రవేశిస్తుంది. ఇక్కడ హుస్సు బుస్సుమంటూ ఉక్కతో నలిగిపోతూవుంటే, అక్కడ మన్యపు ప్రాంతంలో ఉహుహూ అంటూ వొణికించే చలి ప్రారంభం ఔతుంది.

ఒకవిధమైన 'డొలు యెండ.' ఆ ఎండ కాస్తంత వేడిగానే వున్నట్లు వుంటుంది కాని వెన్ను నానుకుని కొంచం చలి శరీరానికి అదొక తరహాగా గిలిగింతలు పెడుతూ వున్నట్లుగా వుంటుంది. అటువంటి శీతోష్ణస్థితిలో సైకిలు త్రొక్కుతూ వుండడమంటే మహా సరదాగా వుండేది.

నాన్నగారు పనిచూచుకొని వచ్చి భోజనంచేసి విశ్రాంతి తీసుకునే సమయమూ—, నేనూ సైకిలు యెక్కి వొంటరిగా కొండలప్రక్కన పోయే రోడ్లవెంట నెమ్మదిగా సైకిలు షికారు వెళ్ళే సమయమూ వొకటే.

నేను ఆనాడు వెళ్లిగానే సైకిలు త్రొక్కుకుంటూ బయలుదేరినా యెండవల్లనో త్వరలోనే అలసిపోయాను. దానితో మరి మొండిగా ముందుకు వెళ్లి అలసిపోవడంలో ఆనందం లేదనుకుని లింగంపర్తి తిమ్మరాజుచెరువుగట్టునవున్న లేత ముసిడి చెట్టు నీడను కూర్చున్నాను.

తిమ్మరాజుచెరువు ఒక విచిత్రమైన జలాశయం. దానిలోని నీళ్లు నల్లగా వుంటాయి. వాటికి యెప్పుడో కాని చల[illegible] వుండదు. మూడువైపుల కొండలే గట్లుగా గలిగి వొకేప్రక్క పోతగట్టుగల ఆ చెరువు ప్రశాంత వాతావరణానికి ఆటపట్టు.

నేనా గట్టుమీద పరుండి అనేకమారులు అనేక విచిత్ర భావాలకు గురి యౌతూ వచ్చాను. ఒక్కొకమారు ఆ ప్రశాంత వాతావరణమె నన్ను భయపెట్టేది. కొన్ని కొన్ని సమయములలో—యిక్కడ గల నిశ్శబ్దత మరొకచోట అనుభవించడానికి వుంటుందా అని నా మనసులో నేను మెచ్చుకొనేవాడను. గట్లుగావున్న ఆ మూడు కొండలు చూచీ, వాటి ముందు యేదో చిన్న బొమ్మరిల్లు గోడవలె కనిపించేగట్టు చూచీ - యీ గట్టును పొర్లి యీ చెరువు ప్రవహిస్తే యేమి కాదనే భావం కలిగినప్పుడు నిజంగా భయమే వేసేది; ఒకనాడు హటాత్తుగా కొండల మీద కారు మేఘాలు ఆవరించగా యిక

(52-వ పేజీ చూడండి)



తలరాత

అభిమానాన్ని చంపుకుంటూ "వేణూ! ఒకటూ రూపీసుంటే ఇవ్వు...ఉద్యోగం దొరకంగానే నీ డబ్బు నీకు పంపించేస్తా" అని సిగ్గుతో అదోలా మొహం పెట్టి శర్మ అడిగేసరికి దాదాపు గుండె ఆగినంత పనైంది నాకు. ఎలాటివాడికి ఎట్లాటి స్థితొచ్చిపడింది! ఈలాటి 'టూ-రుపీస్ లూ, త్రీ-రుపీస్ లను' శర్మ ఎన్నోమార్లు నాకు యిచ్చాడు. వాటిని ఇమ్మని అతనూ ఎన్నడూ అడుగలేదు - నేనూ ఇవ్వలేదు ఇప్పుడు కూడా శర్మ వాటిని ఇమ్మని అడగటం లేదు అప్పుగా ఇమ్మంటున్నాడు రెండురూపాయలు-అంతే. చివరికి శర్మకే గతి వచ్చిపడింది.

ఆనాడు చిలక్కి చెప్పినట్లుగా నేనెంత చెప్పా! ఒకరిమాట వినే ఘటమైతే గా...

"ఒరేయ్ శర్మా! మీ అమ్మపోయాక మీ నాన్న మళ్ళీ పెళ్ళిచేసుకొని నీ సవతితల్లిమాటలు విని నిన్ను ఇంటినించి తగిమికొట్టేశాడు. ఫోర్తుఫారం చదువుతున్నవాడివి-అలాగే చదువుకు స్వస్తిచెప్పి ఎలాగో ఈ బొంబాయివచ్చి పడ్డావ్. నీ అదృష్టంకొద్ది మీసేట్ దగ్గర ఉద్యోగం దొరికి, కొద్దిరోజుల్లోనే-నీ పని నిపుణత వల్లనో, మంచితనం వల్లనో గొప్ప హోదా పొందావు. ప్రెస్ మేనేజరంటే సామాన్యమా?.. B. A. చదివీ కూడా ఈ కాలంలో ఉద్యోగాలు దొరక్క అవస్థలు పడేవాళ్ళను ఎంతమందిని చూడటం లేదు? రెండువందల యాభైరూపాయలు, నీ ఫోర్తుఫారం చదువుకు ఎవరిస్తారు చెప్పు. ఇంతా ఎందుకు చెప్తున్నానంటే నువ్వు ముందు సంగతి చూసుకోక, మంచినీళ్ళప్రాయంగా డబ్బు ఖర్చుపెట్టేస్తున్నావ్. నీకొక్కడికట్టే నేనింత ఇదిగా చెప్పుకొనొస్తున్నాను-ఆఖరికి మా సొంత తమ్ముడికి కూడా ఇలా చెప్పేవాణ్ణి కాను. కనుక-కొంత డబ్బు, నీది కాదనుకొని ఏ సేవింగ్స్ బేంకులోనో వేస్తూంటూరా...ముందు నీకది ఉపయోగమౌతుంది" అన్నాను.

నామాటను బొత్తిగా తీసివేసేందుకు వీలు లేనందుచేత "అలాగే" అన్నాడే కానీ, ఒక నాలుగురాళ్లను వెనకేసుకు రాలేకపోయాడు జీతండబ్బులు చేతికి అందగానే, పదతారీఖులు తిరగకముందే మాయంచేసేసేవాడు. పైగా ఎక్కడెక్కడో అప్పులుకూడా చేస్తున్నట్లు నాకు తెలియవచ్చింది. అంచేత ఊరికే నోరుపారేసుకోవటమే కానీ - ఇహ చెప్పి లాభం లేదనుకొని, అప్పట్నించీ ఆ ఊసెత్తడమే మానేశా.

ఆ వేళ ఆదివారమనుకుంటాను... మధ్యాహ్నం లాడ్జ్ లో అన్నపానాదులు ముగించుకొని శర్మగదికి బయలుదేరా. గదితలుపులు మూయకుండా అలాగే మంచంమీదపడుకొని నిద్రోతున్నాడు శర్మ. వాడినెందుకు లేపటమనుకొని అక్కడేన్నా ఏదో పత్రికవుంటే దానిని తిరగేస్తుకూర్చున్నా. ఉన్నట్లుండి "ఇందిర ఇందిర...ఇందిర

శ్రీ జి. వి. జి. కృష్ణ

అని ఏదో పలవరించాడు. వెంటనే నేను నిద్రలేపి,"ఏమిట్రా...ఏదో ఇందిర అంటున్నావ్? ఎవరు?" అని అడిగా. ఆ నిద్రమత్తులో ఏ మూడ్సులో ఉన్నాడో ఏమో కుండ పగలగొట్టినట్లు అంతా చెప్పేశాడు— నెల్లూరిలో తన మేనమామ కూతురు ఇందిర వుందనీ, తన తల్లి బ్రతికుండేరోజుల్లో ఇందిరను తనకే ఇచ్చి పెళ్ళిచేయాలని పెద్ద ఎత్తున రాద్ధాంతం జరిగిందనీ, ఇందిరకు తనంటే ఇష్టమేననీ, చిన్నప్పుడు ఎంతో స్నేహంగా ఇద్దరూ ఆడుకొనేవారనీ చెప్పాడు శర్మ.

"నీ పిచ్చిగానీ—ఆ అమ్మాయికి ఇంతవరకూ పెళ్ళయివుండదనుకుంటున్నావా?" అన్నాను...

"లేమూ—అది కాదు కూడాను... గట్టిగా బల్లగుద్ది చెప్పగలను".

"నీ మొహం...నీకెలా తెలుసు, ఇక్కడెక్కడో ఎన్నోవందల మైళ్ళదూరంలో ఉన్నవాడివి. పోనీ...మీ మామకూ నీకూ ఉత్తర ప్రత్యుత్తరాలేమైనా జరుగుతుంటాయా?"

"ఊహూఁ...ఆలాటిదేమీ లేదు. అసలింతకీ నేనిక్కడవున్న సంగతి మా మామకు తెలుసునో లేదో!..."

"మరి?"

"నా చిన్ననాటి మిత్రుడు శంకరం అనే అతను అన్ని సంగతులూ తెలియచేస్తూంటాడు నాకు...నిన్ననే ఒక జాబు వచ్చింది వాడిదగ్గర్నించి..." అంటూ ఒక ఉత్తరం తీసి ఇలా చదివాడు. "ఇక్కడ అంతా క్షేమం......నీ యోగక్షేమాలను వ్రాస్తూండేది......ఊఁ....... అయిందా.. మీ మామగారింట్లో కూడా అంతా క్షేమం. నిన్నకూడా ఇందిరకు ఒక పెళ్ళిమాపు వచ్చిపోయింది. ఇందిర ఒప్పుకున్నట్లు లేదు..." అని తాను చదివింది కాక, ఆ ఉత్తరంలో మిగతా సంగతులు కనపడకుండా వుండేటట్లు మడిచి, ఆ రెండు ముక్కలనూ నాకు చూపించి సంతోషంలో మునిగిపోయాడు.

"ఇలా ఎన్ని సంబంధాలు వస్తూన్నా ఇందిర వాటికిఒప్పుకోకుండా వుందంటే— ఇందిరకు నామీద మనసుందంటావా వేణూ?" అని అడిగాడు నన్ను.

"ఎలా అనుకోమంటావ్ శర్మా! నువ్వే చెప్పు. ఆడవాళ్ల మనసులను అర్థం చేసుకోవటం—నువ్వనుకున్నంత తేలికైన పని కాదు. చిన్నప్పుడు మీరిద్దరూ అమితస్నేహంగా ఉండేవారని అంటున్నావ్. కొందరి విషయాలలో చిన్ననాటి ప్రేమే పెద్దయ్యాక బాగా చిగురించి క్రమేణా ప్రేమగా పరిణమిస్తుంది...కానీ మీ విషయంలో ఎలా పరిణమిస్తుందో చెప్పలేను" "పోనీ, ఇందిరకు నిన్నే చేసుకోవాలని ఇష్టముందనుకుందాం......మీ మేనమామ ఇష్టపడక్కర్లా? ఆయన ఒప్పుకోవాలా?"

"ఎందుకు ఒప్పుకోడూ అంట... నేనేమైనా పరాయివాడ్నా?...నా ఉద్యోగం హోదా, ఏమాత్రం తెలుసున్నా ఆయనే ఇంకొకరికోసం ప్రయత్నం చేసేవాడంటావా?"

"అదిమాత్రం ఎలా అనుకోమంటావ్?.. మీ అమ్మ వుండివుంటే అందులో ఏమాత్రమైనా జరిగివుండేది. ఇప్పుడు ఆమె లేకపోయె. పోనీ మీ నాన్నను మాట్లాడమంటే ఆయన భార్యాలోలుడై నీ సంగతి వదిలేశాడు...నీకిక 'నా' అనే వాళ్లెవ

తలరాత

రైనా ఉన్నారా, ఆస్తి వుందా, విద్య వుందా ???"

"ఆస్తినీ, విద్యనూ కట్టుకొని ఏవరం చేసుకుంటారు వేసూ!...నువ్వు ఇలా మాట్లాడితే ఎలాగ... అంద చందాలూ, గుణగణాలూ, తగిన హోదా లేక ఎంత ఆస్తి వుండీ, ఎంత విద్యవుండీ ఏం ప్రయోజనం చెప్పు?"

"అని నువ్వంటావ్...బాగానే వుంది. కానీ, మీమామ కుండెక్కర్లా ఆ మాత్రం జ్ఞానం?"

"ఇందిర ఎవర్నీ ఒప్పకపోతే, చివరికి నాకు తప్ప ఇంకెవరికిస్తారులే" అనేసి అంతటితో అప్రస్తావన మార్చేశాడు శర్మ.

ఇంకోరోజు శర్మకు మళ్ళీ వాళ్ళ వూరిగాలి సోకినట్టుంది "చిన్నప్పుడు పరికిణీలు కట్టుతూంటేనే ఇందిర మొహానికి ఎంతో ముచ్చటగా వుండేది...ఇప్పటికి పెద్దమనిషైవుండొచ్చు...చీరలు కట్టూంటే ఎలా వుంటుందో చూసి రావాలి...అలానే పాతమిత్రులందర్నీ చూసిరావాలి ఓ పది రోజులు శెలవుతీసుకునివెళ్ళి," అన్నాడు.

"ఇంకా మేనేజర్ హోదా లభించి తీరా ఒక్క నెలన్నా కాలేదు. అప్పుడే నువ్వు లీవ్ తీసుకునిపోతే ఎలాగుంటుందిరా! "అన్నాను నేను.

"ఎలాగుండేదేమిటి ... మూడేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నా ఒక్కరోజయినా శెలవు తీసుకున్నానేమో, నువ్వే వచ్చి మానేజర్ని అడుగు...తెలుస్తుంది...ఇంత ఇదిగా గాడిద చాకిరీ చేస్తుంటే... ఒక్క నెలయినా శెలవు ఇవ్వనంటావా మానేజరు...ఆనెల జీతం ఇవ్వకపోయినా పీడాపోయే" అన్నాడు శర్మ.

(54-వ పేజీ చూడండి)

రాయలసీమ, చిత్తూరు పర్యటన సందర్భంలో పత్రికా ప్రతినిధులతో కలిసి ఫొటో తీయించుకున్న పండిట్ నెహ్రూ.





గౌరీ శంకర్

(శ్రీ వి. భాస్కరరావు గారి రేఖా చిత్రం)


మార్కులవేట

స్కూలుకు వేసంగి శెలవులిచ్చి అప్పుడే పదిహేనురోజులు దాటినా, "సెలవుల్లో ఇన్ ఛార్జి" అంటూ ఒక అధికారంలేని పెత్తనం నెత్తిన బడటంవల్ల నాకు ఊరువిడిచి వెళ్ళే అవకాశం లేకుండాపోయింది. అలవాటు ప్రకారం ఆరోజు సాయంత్రం స్టేషన్ వైపువెళ్ళాను. అప్పుడే రైలుకూడా వచ్చింది. బండి ఇంకా ఆగకముందే ఒక పెద్దమనిషి ఒక పెట్టిలోనుంచి ప్లాట్ ఫారంమీదకు దూకి బోక్కబోర్లపడటం కాస్తలో తప్పించుకుని. పరుగెత్తుకుంటూ గేటువద్ద టిక్కెట్ కలెక్టరును గూడా గమనించకుండా స్టేషన్ లోని ఆవరణలోకి దూసుకువచ్చి ఒక బెంచీమీద కూర్చోటం గమనించాను. ఇతనెవరో రైల్వే జామాత లాగున్నాడని (అంటే టిక్కెట్ లేని ప్రయాణికుడు) అతనికేసి చూద్దునుగదా! ఎవరో కాదు మా మోహనరావే! బాల్యస్నేహం వల్లనైతేనేమి, కలిసి కాలేజీలో చదవటంవల్లనైతేనేమి, ఇద్దరి వృత్తీ ఒకటే కావటం వల్లనైతేనేమి, నాకత్యంత ఆప్తుడైన మోహనరావు! ప్రాణం లేచివచ్చినట్లైంది.

"మోహనరావ్! మోహనరావ్!" అని పిలుస్తూనే దగ్గిరకెళ్ళాను. కాని అతను నాకేక వినిపించుకోలా. అతని దృష్టంతా రైలు వద్దయూగిన ప్రయాణీకుల పైన కేంద్రీకృతమై వున్నట్లు గమనించాను. చమటలు కక్కుతున్న అతని శరీరం, భయావహమైన అతని ముఖం, అబిత్తర చూపులూ చూస్తే - అప్పుడే జైలునుంచి పారిపోయి వచ్చిన దొంగవాలకం లాగున్నది అతని వేషం. అతని విచిత్రప్రవర్తనకు కారణం ఊహించలేక ఒక నిముషంసేపు నిలబడ్డాను. ఇంతలో రైలు కదిలి ప్లాట్ ఫారమ్ దాటి వెళ్ళిపోయింది. "అమ్మయ్యా!" అంటూ నావైపుకు తిరిగాడు మోహనరావు. కుశల ప్రశ్నలతో ఐదు నిముషాలు గడిచింది. ఎండిపోయిన పెదిమలతోనే ఏవో సమాధానా లిచ్చాడు. అత నన్న "అమ్మయ్య"కు కారణ మేమిటని అడిగాను. తన్ను శనిగ్రహం వెంటాడుతోందని చెప్పాడు. అది అప్పుడే తనను వొదిలిపోయిందిట. అందుచేత 'అమ్మయ్యా!' అనుకున్నాడుట! కాస్త స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటే గాని ఆపైన వివరించి చెప్పలేనన్నాడు.

ఆరాత్రి భోజనాలయ్యాక మిత్రులిదరం కాలవగట్టువైపుకు బయలుదేరాము. పిండారబోసినట్లు వెన్నెల. మందంగా మలయమారుతం మైమరపించే హాయి నిస్తున్నది. ఇద్దరం ఒకచోట ఆసీనులయ్యాం. మోహనరావు తన విషాదగాథ వినిపించాడు:


"స్కూలుపంతులు కెప్పుడూ సుఖము కల్ల. అన్న కవిసూక్తి జ్ఞాపకానికొస్తోంది నాకు. బడి వున్నన్నాళ్ళూ అధికారుల తనిఖీలు, స్కూలు ఫైనల్ పరీక్షలకు వాచర్లుగా వెళ్ళటం, ఎలక్షన్ డ్యూటీ మొదలైన వాటితో సతమతమైనాం. ఇహ సెలవలన్నా కాస్త హాయిగా గడుస్తయ్యా



అనుకుంటే, అదీ లేకుండా, పేపర్లు దిద్దే పితలాటకం ఒకటి! త్వరగా వొదిలించుకుందామని (కరెక్షన్) పని కుపక్రమించాను. ఈ సువార్త ఎక్కడెక్కడివారికీ ఎట్లా తెలిసిందో మరి! మరునాటినుంచే ప్రారంభమైంది నామీద మార్కులవేట. ఇంట్లో వున్నంతసేపూ ఇంటాయనో పొరుగింటాయనో, ఎదురింటాయనో తయారు. 'మావాడు మూడవ సంవత్సరం, కాస్త దయవుంచండి' అంటూ ఒకరూ, 'ఒక్క ఇంగ్లీషులోనే మా వాడికి కాస్త అనుమానం, ఎట్లాగైనా మీరు కాస్త పుణ్యంగట్టుకోవాలి' అంటూ మరొకరు. ఇహ ఇంటిపని మనిషి, చాకలి, మంగలి, ఇత్యాదులంతా అమ్మగారి సిఫార్సులతో సహా అర్జీలు! మేనల్లుడనో, బావమరదనో, ఏదో ఒక తాత్కాలికపు చుట్టరికంతో ప్రవేశించేవారు. వీరివల్ల పనిసాగకపోగా తిండితింటానికి కూడా తీరిక చిక్కేది కాదు. ఇహ బజారు కొద్దామా అంటే భయమేసేది! వాకిట్లో అడుగు బెట్టటం ఆలస్యం - అడుగడుగుదండాలవాడా ఆపద మొక్కులవాడా, అన్నట్లయ్యేది నాపని. ఎరిగినవాళ్ళు, ఎరగనివాళ్ళు, చిన్నలూ, పెద్దలూకూడా దణ్ణాలు పెడుతుంటే మనస్సుకు చాలా కష్టమేసేది. కాస్త కాఫీ తీసుకుందామని హోటల్ కెడితే, అక్కడా ఇంతే! ఎన్నడూ లేని ఆదరణ! అడగనివి కూడా తెచ్చిపెట్టటం, ప్రొప్రైటరు గారే ప్రక్కన కూర్చుని, "ఫరవాలేదు ఆరగించండి" అంటూ బలవంతంచేయటం, అనంతరం - చావుకబురు చల్లగా వొదిలినట్లు—'మా అబ్బాయి నంబరు 132, ఏదో కాస్త కనిపెట్టి మూడం" డని చెవులో వూదటం. అటు ఆత్మద్రోహానికిగాని, ఇటు మిత్రద్రోహానికిగాని మనస్కరించక "చూస్తా"నని మాత్రం సమాధానం చెప్పి నేను బైటబడటం. ఇట్లా నాలుగురోజులు సౌమ్యంగా గడిచినై.

కాని ఐదో రోజునుంచి పరిస్థితులు వేరొకరూపం దాల్చినై. ఏమంటే, నాకు తెలియకుండానే అనేక సరుకులు సామాగ్రి ఇంటికి రావటం, అవి నేను పంపినవేమోనని ఇంట్లోవాళ్ళు గ్రహించటం, ఇల్లు చేరగానే నేను తిరిగి వాటిని బైటబెట్టించి, నాకోసం అప్పటిదాకా మాయింటి మొత్తలలో వేచివుండే దాతలకిచ్చి మర్యాదగా పంపించివేయటం. ఆ మామిడిపండ్ల గంపలు, ఆ అరటిగెలలు, నెయ్యి, పెరుగు, కూరగాయలు తిరిగి ఇచ్చేస్తుంటే ఇంట్లోపిల్లలు ఒకటే గొడవ చెయ్యటం, వాళ్లను సముదాయించేసరికి తాతలు దిగిరావటం. షాపులో అడిగితే పంచదార స్టాకు లేదన్న షావుకారు, ఇంటికి నాలుగు వీశెలు మనిషినిచ్చి పంపటం!' పథ్యానికికూడా గోధుమలు దొరకవన్న పెద్దమనిషి, పావుబస్తా గోధుమలు ఇంటికి పంపటం, వాటిని తిరిగి పంపినందుకుగాను నాకు కూలిదండుగ మిగలటం - మహా చిరాకు వేసేది.

ఇట్లావుండగా ఒకనాడు, మా పాలక సంఘసభ్యుడే ఒకాయన మాయింటివద్ద ప్రత్యక్షమయ్యాడు. మామూలుగా ఎవరి దర్శనంకోసం నాబోటివాళ్ళు రోజుల కొద్దీ పడిగాపులు కాయాలో, ఎవరి గుప్పిట్లో మన పంచప్రాణాలూవుంటాయో,



"మీ వెంట ఒక శనిగ్రహం వొస్తోంది. ఆగ్రహం కంటబడ్డారంటే అపాయం" అన్నాడాయన నాతో రహస్యంగా.

ఆ పెద్దమనిషే, తానై మాయింటికి రావటం —నాకొక అగ్నిపరీక్ష అయిపోయింది. వారి వాలకాన్ని బట్టి వారొచ్చినపని మార్కుల వేటని ఇట్టే గ్రహించగలిగాను. వార్ని సుఖాసీనుల్ని చేసి మౌనంగా నిలబడ్డాను. ఆయన తన జేబులోనుంచి ఒక లిస్టుదీసి, నా కందించి, 'ఇవి మాకు కావాల్సిన నంబర్లు. వాటిసంగతి కాస్త చూసి పెట్టండి' అన్నారు అధికారస్వరంతో. అందరికీ చెప్పినట్లు గాకుండా, ఆయనకు కొంచం వినయంగా చెప్పాను. 'చిత్తం, అల్లాగే చూస్తాను' అని కాని అంతటితో ఆయన తృప్తిపడితేనా! తను స్వయంగా వచ్చిందీ, పని పూర్తిచేయించుకుపోవడానికేనట! గట్టి చిక్కే వొచ్చింది. అజ్ఞ శిరసావహించక తప్పదనకున్నాను. కాని ఆత్మగౌరవం పొడుచుకొచ్చింది! వ్యక్తిత్వాన్ని చంపుకుని, ధర్మాన్ని త్యజించటమేనా అని. 'ప్రస్తుతం అది సాధ్యపడదని ధైర్యంగా చెప్పగలిగాను. వారికి కొద్దిగా కోపం వచ్చినట్లుంది—నా కో చిన్న ఉపన్యాస మిచ్చారు—నౌకరీ ఖాయం, ఇంక్రిమెంటు, ప్రమోషన్ ఇత్యాది ఎరలతో ప్రారంభించి, సంజాయిషీ, ట్రాన్స్‌ఫర్, శ్రీముఖం మొదలైన బెదిరింపులతో ముగించారు. అట్టి విషమావస్థకుకూడా లొంగిపోని మనోబలాన్ని ప్రసాదించినందుకు భగవంతునికి హృదయపూర్వకాభివందనా లర్పించుకొన్నాను. కాని ఎన్నాళ్ళిలా ప్రవాహంలో ఎదురీత! దినదిన గండం నూరేండ్లాయుష్షు. ఇంక అక్కడ వుండటం క్షేమకరం కాదనుకుని, సతీసమేతంగా అత్తారింటికి ప్రయాణమయ్యాను. అంతవరకు మామగారు సెలవల్లో బందరు రావలసిందని పంపిన ఆహ్వానా లన్నింటినీ తీరికలేదంటూ తిరగ్గొట్టేశానే అన్న విషయం మనస్సులో బాధిస్తోనేవుంది. కాని విధి! తప్పించటం నాతరమా! రెండవ కంటివాడికి తెలియకుండా తెల్లవారుఝాము బండికి స్టేషన్ చేరుకున్నాము. ఆ బండికి దిగే చుట్టాలకోసం నిరీక్షిస్తున్న మా మేష్టరుగారొకరు కనిపించారు. అవీ యివీ మాట్లాడుకున్నాక, రహస్యంగా అన్నాడాయన నాతో 'మీ వెంట ఒకశనిగ్రహం వొస్తోంది.

★ మన విజ్ఞాన విభూతి ★

మన పూర్వులు అనేక విషయాలలో చాలా అద్భుతమైన జ్ఞానసంపదను సంపాదించారు-ఒక్కొక్క కొండను దేవాలయముగా తొలిచి మలిచినారు. విమానాలమీద తిరిగినారు. అనేక పరమహంసక్రియలను కనిపెట్టి, ఎటువంటి వ్యాధులనైనా కుదిర్చినారు. ముసలి వారిని యౌవనవంతులనుగా చేసే కాయకల్ప చికిత్సలను కనిపెట్టిరి - జ్యోతిశ్శాస్త్రంలో అగ్రపీఠం భారతీయులదే - దివ్యదృష్టి పరకాయ ప్రవేశము మొదలైన యోగమహిమలను సాధించారు. మృత్యువును కూడా జయించగల రససిద్ధులైనారంటే అతిశయోక్తి లేదు - ఇంతటి అద్భుత విజ్ఞానసంపదను రమారమి అయిదు లేక పదివేల ఏండ్ల క్రిందటనే మన పూర్వులు సాధించారు - అప్పటికి అచ్చు గ్రంథాలు లేవు - వారి శాస్త్రరహస్యము లన్నియు తాటియాకులమీదను భూర్జరీ పత్రములమీదను వ్రాసికొని ఆ గ్రంథాలను అతి జాగ్రత్తతో దాచుకొన్నారు - వాటికి ప్రతులు వ్రాయడం సులభమైన పనికాదు-ప్రతులు కావాలంటే ఇతరులవద్ద లభించడం కూడా అసాధ్యం -

అటువంటి పరిస్థితిలో అంత భద్రంగా దాచబడిన మన ప్రాచీన ఆర్యవిజ్ఞాన గ్రంథ సంపద అంతా ఏమైపోయింది? అవి ఏమైనాయో చూడండి.

బుద్ధగయలో తొమ్మిది అంతస్తుల యెత్తయిన దేవాలయం పూర్వం ఉండేది. దానిని మహా గంధోలయ (గ్రంథాలయ) అనేవారు. నాలందాలోని ధర్మగంజ (విద్యాపీఠము) లోని రతన్‌దధి అను తొమ్మిది అంతస్తుల దేవాలయములో మహాయన హీనాయన సంప్రదాయములకు సంబంధించిన అనేక బౌద్ధ గ్రంథాలు ఉండేవి. ఓదంతపురి విహారంలోని దేవాలయం పైరెండింటికంటె ఎత్తయినది - దీనిలో బౌద్ధ మతానికి బ్రాహ్మణమతానికి సంబంధించిన గొప్ప గ్రంథ సముదాయం ఉండేది. దీనిని క్రీ॥ శ॥ 1212 సం॥లో బఖ్త్యారు ఖిల్జీయొక్క సేనాధిపతియైన మహమ్మదు చిన్‌సాము తగులబెట్టించెను. 'సుల్తాన్ అల్లా ఉద్దీన్ ఖిల్జీ' అనే మహా ప్రభువు అన్హా ల్వాడా పాటన్ అనే గ్రంథాలయాన్ని తగులబెట్టించాడు - ఫిరోజిషా తుఘ్లక్ అనే మహానుభావుడు కోహనలో ఉండే గొప్ప సంస్కృత గ్రంథభాండారమును తగులబెట్టించెననే విషయము "తారీఖ్ ఫిరోజ్ షాహి" అనే గ్రంథంలో వ్రాయబడి ఉంది.

"సర్ - ఉర్ - ముతాఖ్ రీన్" అనే గ్రంథంలో యీ క్రిందిరీతిగా వ్రాయబడి ఉంది "సుల్తాను లందరిలోను సికిందరుసుల్తాను (అనగా ఔరంగ జేబు) అత్యధిక దురభిమాన పూరితుడు. ఇతడు హిందూ గ్రంథములను ఎక్కడ దొరికితే అక్కడ ఎప్పుడు దొరికితే అప్పుడు తగులబెట్టించాడు"


ఈవిధంగా మన ప్రాచీన విజ్ఞానం అంతా వారిపుణ్యమా అంటూ భస్మం అయింది - బూడిద అయింది. ఇదే మన విజ్ఞాన విభూతి - విభూతి అంటే ఒకప్పుడు మనసంపద, తర్వాత బూడిద.

మార్కులవేట

ఆ గ్రహం కంటబడ్డారంటే అపాయం! తప్పించుకుంటే అదృష్టవంతులు' అని. అంటే నేను బందరు చేరగానే, నా ఉద్యోగానికి శ్రీముఖం చూపించి నన్ను లొంగదియ్యాలని వీళ్ళవుద్దేశ్యం! సరే ననుకున్నాను. రైలు రాగానే మేమొక పెట్టెలో ఇరుక్కుని కూర్చున్నాము. బండి కదిలింది. ప్రతిస్టేషన్‌లోనూ ఒక వ్యక్తి మాకేసి దగ్గిరకొచ్చి నేనున్నానో లేదో చూసి వెళ్ళటం గమనిస్తూనే వున్నాను. రైలు బెజవాడ చేరే లోపలే ఒకవుపాయం ఆలోచించా. మా వాళ్ళను మాత్రం బందరు పంపించి నేనీవూరు వొచ్చెయ్యాలని నిశ్చయించుకున్నాను. రైలు బెజవాడ చేరింది. మా వాళ్ళకు నా ప్లానంతా చెప్పి, నన్ను వెంటాడుతున్న వ్యక్తి మా పెట్టె చేరకమునుపే, ప్లాట్‌ఫారమ్ లేని వైపునుంచి బండి దిగి, అప్పుడే బయల్దేరబోతున్న ఈ రైలెక్కాను. ఆ గ్రహం ఒకవేళ నా వెంటపడ్డా, నేనిక్కడ దిగటం గమనించకుండా వుంటేం దుకని, రైలు పూర్తిగా ఆగకమునుపే దిగేసి వచ్చి స్టేషన్‌లో కూర్చుని రైలుదిగిన వాళ్ళందరినీ పరీక్షగా చూశాను. ఆ గ్రహం మాత్రం కనబడలేదు. అప్పటికి నామనస్సు కుదుటబడ్డది. ఎట్లాగైతేనేమి శ్రీముఖం తప్పిపోయింది గదా అని 'అమ్మయ్య' అనుకున్నాను. అంతే!" అని ముగించాడు మోహనరావు.

"శ్రీముఖం సంగతెట్లావున్నా, రైలు క్రింద పడకుండా తప్పించుకున్నావు. ధన్యవాదాలు"-అన్నాను.

మరునాడు మోహనరావుకొక ఉత్తరం వొచ్చింది. అది చదువుకొని అతను పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వుతుంటే ఏమిటి విశేషమని అడిగాను. "నిన్న మా వెంటబడ్డది ఆ శనిగ్రహం కాదుట! మా కుటుంబాన్ని తీసుకురమ్మని మామగారు పంపిన మనిషిట!! మేము బయలుదేరినరాత్రే మావూరువొచ్చి, పొద్దుపోయిందని స్టేషన్‌లోనే పడుకున్నాట్ట. తెల్లవారుఝామున మేము రైలెక్కటం చూసి, హడావిడిగా లేచి తనూ రైలెక్కాట్ట!" అన్నాడు మోహనరావు. 'చాలా బాగుం'దన్నాను; మోహనరావు ధైర్యస్థైర్యాలను మెచ్చుకుంటూ. ★




ఈ ఉపఖండమందంతట ప్రతి నలుగురిలో ఒకరు మలేరియా జ్వరపీడితుడైయుండును

ఒకకీల మాలోచించిన, సంఖ్యారూపముగా ప్రతి సంవత్సరము పది కోట్లమంది మలేరియాతో బాధపడుచున్నారని తెలగలరు.

పొరబడకండని హెచ్చరిక—మలేరియా విస్తృత్తవజేయు ఘోరమైన జాడ్యము. ఆరోగ్యమును, బలమును ధ్వంసము చేయును. వైజ్ఞాని కోద్రేకముల మందపరచును.

'పాలుడ్రిన్' లోగల మలేరియా నిరోధించు సుగుణములను నేడే పొందమని మేమింత నొక్కి చెప్పరే మందులకే. 'పాలుడ్రిన్' యొక్క నిరపాయకరత, సులభసేవన వాడుటచేతనే అర్థమైనది. నిన్ను నీవు మలేరియా బారినుండి కాపాడుకొనుటకు వారమున కొక మాత్ర ఒక అరా అద్దుతో సేవించిన చాలును. సేవించు విధానము దిగువున తెలుపబడియున్నది.

మలేరియా రోగకారణమైన దోమ ఒక కాటుతో మలేరియా క్రిములను నీ రక్తములో ప్రవేశపెట్టును. యెప్పుడును యేటవాలుగా మూగు ఆ దోమను నీవు సులభముగా గుర్తింపగలవు. వీటి అభివృద్ధి కాధారమైన నీటి నిలువలు ఇండ్ల పరిసరాలలో వుంచకుండిన మలేరియా బారినుండి తప్పుకోగలరు. నిదురించునపుడు దోమతెరను వాడుడు. దోమలను చంపుటకు 'గమెక్సేన్' క్రిమికీటక సంహారిణిని మీ గృహములయందు చల్లియుంచుడు.



ఈ అపాయకర చిహ్నములను గమనింపుడు:

మొదట చలితో వణికింపును, జ్వరము తగిలి చెమటలు పోయును. దేహమంతట నొప్పులు, తలనొప్పి పుట్టును. యీ సూచనలను అశ్రద్ధ చేయక తక్షణమే వైద్య సలహా తీసుకొనుడు. అప్పుడు నీకు మలేరియా సోకియున్న 'పాలుడ్రిన్' సేవించిన కొద్ది రోజులలో నయముగా నగును. యికముందు రాకుండుటకు, అది ఎట్లు తీసుకొనవలెనో కూడ వైద్యుడు నీకు తెలియపరచును. స్వచ్ఛమైన 'పాలుడ్రిన్' వుల్లిపొర కాగితములలో ఆరోగ్య విధానముగా సీలుచేయబడినవే దొరుకును. మాత్ర ఒకటి ఒకటా మాత్రమే.

'పాలుడ్రిన్'

మలేరియాను తరిమివేయును




సేవించు విధానము

చికిత్సకొరకు: పరివయస్కులవారు, 12 యేండ్లకు మించినవారు ఒక మాత్ర వాడవలెను. 6 నుండి 12 సంవత్సరములలోగల పిల్లలకు అర్థ మాత్ర. 6 సంవత్సరముల వయస్సు మించని పిల్లలకు పావుమాత్ర చొప్పున ప్రతి దినము జ్వరము తగ్గువరకు ఇవ్వవలెను.

రక్షణార్థం: పెద్దలు పై కనబరిచినట్లే కాని వారమునకొకమారు నిర్ణీతమైన దినముననే సేవించుచుండవలెను.

'పాలుడ్రిన్'ను భోజనానంతరం సేవించి అలముకైనను, పొంగైనను దారాళముగా త్రాగవలెననుటకు జ్ఞాపకముంచుకొనవలెను.

ICI



ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ (ఇండియా) లిమిటెడ్

ICP 73

సీరియల్ నవల

రెండు మహా నగరాలు

చార్లెస్ డికెన్స్

39

సంవత్సరం మూడు మాసాలు గడిచిపోయినై. నానాటికి లూసీ ఆత్మధైర్యం సడలిపోతోంది. ఆ సాయంత్రమో, ఆ మర్నాటి ఉదయమో తన భర్త తల గిలొటైన్‌లో తెగిపోవచ్చునని ఏ రోజు కారోజు, ఏ క్షణానికి ఆ క్షణం ఆందోళన పడుతోంది. మరణశిక్ష విధించబడ్డ వాళ్ళను తుగిడీలకు తుగిడీలు నాటు బళ్ళమీద వధ్యశిలలదగ్గిరికి తోలుకుపోతున్నారు. ఆ బళ్ళ నిండా—సౌందర్యవతులైన కన్యలూ, మిసమిసలాడే స్త్రీలూ, వృద్ధమాతలు, బంగారు తలకట్లున్న అందగత్తెలూ, యవ్వన వయః పరిపాకంలో వున్న పడుచువాళ్ళూ, ఆడా, మగా, చిన్నా, పెద్దా, రకరకాలుగా వున్నారు. గిలొటైన్ మహామారి రక్తదాహం తీర్చటానికి ఆ శకటాలు వందలూ వేలూ వీథులవెంట నిర్విరామంగా సాగిపోతున్నయ్.

తన భర్త హఠాత్తుగా ఇలాంటి ప్రమాదావస్థలో చిక్కబడటం, తను ఏమీ చెయ్యలేని అసమర్థస్థితిలో అతని విముక్తి కోసం పరితపించుతూ అహోరాత్రాలూ ఆక్రోశించుతూ వుండటం, కాలచక్రాలు అత్యంత త్వరితగతిని రివ్వురివ్వున తిరిగిపోతూ వుండటం భరించరాని ఆవేదనగావున్నా, లూసీ దాన్నంతా బయటికి చూపటంలేదు.

సైయింటే ఆంటోనీ వీథిలోని అటకమీది గదిలో తొలిసారిగా ఆ ముగ్గు బుట్టతలను హృదయానికి హత్తుకున్న తదాదీ, లూసీ, పితృసేవాదీక్షను ఏమరకుండా సాగించుకు వస్తోంది. ఇంత దీనావస్థలో వుండికూడా తన తండ్రి పట్ల చూపే భక్తి తత్పరతలో ఎలాంటి లోటూ రాకుండా చూసుకుంటోంది.

పారిస్‌లోని ఆ కొత్త యింట్లోకి కాపురం మార్చి, యింటికి తిరిగివచ్చిన మరుక్షణంనుంచీ, ఆఇంటిని ఇంగ్లండులో తానూ భర్తా కలిసి జీవించేనాటిరోజుల్లో మోస్తరుగానే, చక్కదిద్ది వుంచుతోంది. తనతండ్రి తన కార్య కలాపాలలో నిర్విచారంగా తిరగటానికి కావలసిన యేర్పాట్లన్నీ జాగ్రత్తగా చూస్తోంది. కూతురికి అక్షరాలు దిద్దబెట్టి చదువూ సంధ్యా చెబుతోంది. తన భర్త, త్వరలోనే, తిరిగి వస్తాడనే మనోధైర్యంలోనే వున్నట్టు నటించుతూ, అతను రాగానే చేయవలసిన యేర్పాట్లన్నీ ఇప్పటినుంచీ పరిదిద్దుతోంది. అతను చదువుకునే పుస్తకాలూ, అతను కూర్చునే కుర్చీ అన్నీ, గదిలో, కిటికీదగ్గిరగా యేర్పాటుచేసి దుమ్మూ ధుమ్రా పడకుండా దులుపుతోంది.

మనిషికూడా, యేమంతలో చెడిపోలేదు. కాకపోతే ముఖం కొంచెం వివర్ణమైంది. ఎప్పుడైనా మనస్సు పట్టలేక కొంచెం కళవళపడి యేడిస్తే డాక్టరు ధైర్యం చెబుతున్నాడు: ‘నువ్వు అనవసరంగా కంగారు పడుతున్నావ్! నాకు తెలియకుండా అతని వొంటిమీద ఈగల వాలదు. అతన్ని రక్షించి బయటపడేసే భారం నాది!—నువ్వు నిశ్చింతగా వుండు’—అంటున్నాడు.

ఒకనాటిసాయంత్రం డాక్టర్ యింటికి తిరిగొచ్చి కూతురుతో ఇల్లా అన్నాడు:

‘అమ్మాయి ఇటు చూడు! అతనువుంటూన్న జైలుగదికి, పైవైపుగా ఒక కిటికీవుంది. అతను సాయంత్రం మూడుగంటల వేళ ఆ కిటికీ దగ్గిరికి ఎక్కి నిల్చోటానికి కాసేపు అవకాశం వుంటుంది. రోజూ అలా అవకాశం వుంటుందనటానికి కూడా వీల్లేదులే; సాధారణంగా వుంటుంది. జైలుముందున్న వీథిలో నువ్వు గనక ఒకచోట నిల్చుంటే, నువ్వు అతనికి కనుపించే వీలుంది—ఆ ప్రదేశం నేను చూపిస్తాలే—నీకు మాత్రం అతను కనుపించే సావకాశం లేదు తల్లీ!’—

‘చెప్పు నాన్నా చెప్పు!—ఆ ప్రదేశ మెక్కడో చూపించు; నేను రోజూ వెళ్లి అక్కడ నిల్చుంటాను.’

ఆ వేళనుంచీ, లూసీ ఆ వీథిలో దాదాపు రెండుగంటలసేపు పడివుంటోంది. వానయినా వంగుడయినా వెరవటంలేదు. సరీగా రెండుకొట్టే సరికల్లా ఆ ప్రదేశంలో నిల్చునుంటుంది; మళ్లా నాలుగింటికల్లా కాళ్లీడ్చుకుంటూ యింటికి తిరిగొస్తుంది. ఒక్కొకనాడు ఆటే చలీ యీదురూ లేకుండా వుంటే బిడ్డను కూడా చంకను ఎత్తుకు వెళ్లేది. ఏది యేమైనా తప్పకుండా రోజూ వెళ్లి తీరేది.

లూసీ నిల్చునే ప్రదేశం, వీథి మలుపుతిరిగేచోట చీకటిగా వుండే ఒక యిరుకుమూల వుంది. ఆ ప్రక్కనేవున్న చిన్ని పాకలో ఒకడు కట్టెలు కొడుతూ వుంటాడు.

లూసీ అక్కడ నిల్చోవటం మొదలుబెట్టిన మూడోనాడు, ఆ కట్టెలుగొట్టేవాడు—లూసీని పలకరించాడు.

‘మళ్లా యీ వేళ కూడా యిక్కడకొచ్చి నిల్చున్నావా?’—

‘హాఁ.’

ఆ ముసలివాడు వేళ్లు ముఖానికి అడ్డంపెట్టుకొని, జైలు పై అంతస్థు కిటికీవంక పరకాయించి చూశాడు.

‘సరే యేదో గొడవ నాకెందుకు’ అనుకుని మళ్లా తనపని తను చూసుకుంటున్నాడు. ఆ కట్టెలు కొట్టేవాడు పూర్వం రోడ్లు మరమ్మతు చేసే కూలీగా పనిచేస్తూ వుండేవాడు.

ఆ మర్నాడు వాడు, లూసీ వస్తుందని యెదురుచూస్తూనే వున్నాడు. లూసీ కంటబడగానే ‘ఆ వచ్చావూ?—పాపాయి కూడా వచ్చిందే’—పాపాయిని పలకరించాడు: ‘మీ అమ్మ పాపా!’—

బిడ్డ లూసీ మొహంలోకి చూసింది: ‘అవునని చెప్పనా అమ్మా’ అని రహస్యంగా తల్లి చెవులో నోరుబెట్టి అడిగింది.

‘చెప్పమ్మా’—

‘అవును మా అమ్మే’—

అనువాదం: తెన్నేటి సూరి

★ రెండు మహానగరాలు ★

'అహా! సరే—అయినా నా కనవసరం—నా పనేదో నేను చూసుకోవాలి. గొడ్డలి మంచి పదునుగా తెగుతోంది—ఇలా లైన్‌తో తలగొట్టేసినట్టే—సఫా—సఫా—సఫా'—దెబ్బకొక ముక్క చొప్పున కొయ్యముక్కలు తెగి అవతల పడుతున్నయ్.

అలా కొయ్యముక్కలు సఫా—సఫా—నరికి బుట్టలో వేస్తుంటే లూసీకి ఎందుకో భయమేసింది. అతను ఎప్పుడూ అక్కడే వుంటాడు. రోజూ వచ్చి తను అక్కడ నిల్చోవాలి. అక్కడ నిల్చుని అతనికి కనుపించకుండా వుండటం అసంభవ కార్యం. అందుచేత నెమ్మదిగా అతన్ని పలకరించి పరిచయం చేసుకుంది. అప్పుడప్పుడు అతని చేతిలో చిల్లరడబ్బులు పడేసేది వాడు ఆ డబ్బులు గుప్పిట్లో చూసుకుని ఆనందంతో పొంగిపోయేవాడు.

కాని వాడు సామాన్యం మనిషి కాదు. ప్రతి విషయాన్నీ చాలా జాగ్రత్తగా పరిశీలించుతూ వుంటాడు. ఒకొకనాడు వొళ్ళు మరచిపోయి, లూసీ ఆ జైలు కిటికీవంక దిగాలుపడి చూస్తూ, తన హృదయంతో ఆ కిటికీ చువ్వలమీదపోయి వాలటానికి ప్రయత్నించుతో వుండే సమయంలో, వాడు, పనిగడుతున్నట్టు ఆవిడ వంక చూస్తూ వుండేవాడు. చేతిలో వున్న గొడ్డలి అలాగే కర్రలో దిగేసి పని ఆపివేసి చూస్తూ నిల్చునేవాడు. మళ్ళా లూసీ స్పృహలోకివచ్చి అతని వంక చూసేసరికి, ఏమీ తెలియనట్టు గబగబా సర్దుకుని తన పని తాను మొదలెట్టేవాడు: 'ఇవన్నీ నా కెందుకు?' అని గొణుక్కుంటూ.

ఇలా డిశంబరు నెల వచ్చేసింది. ఆవేళ కొద్దిగా మంచు కురుస్తోంది త్రోవపొడుగునా ఇళ్లన్నీ త్రివర్ణపతాకలతో అలంకరించి వున్నయ్. 'స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం' అనే అక్షరాలతో వీధి వీధినీ జండాలు ఎగురుతున్నయ్. మామూలు ప్రకారం లూసీవచ్చి ఆ సందు మొగిని నిల్చుని వుంది. వున్నట్టుండి లూసీకి యేదో పెద్ద అలజడి వినిపించింది. జైలు గోడ మలుపుతిరిగి ఒక పెద్ద జనప్రవాహం ఆ వీధిలోకి ప్రవహించింది. ఆడా, మగా, అంతా అయిదారువందలమంది దాకా వున్నారు. ఆ తండా మధ్యలో కట్టెలుకొట్టేవాడు ప్రతీకారిణితో చెట్టాపట్టాలు పట్టుకుని నాట్యం చేస్తున్నాడు.

ఆ అయిగువందలమందీ కూడా అయిదువేల బ్రహ్మరాక్షసుల్లా ఒళ్లు తెలియని వీరావేశంతో తందనాలాడుతున్నారు. విప్లవగీతం పాడుతూ, ఆడా మగా కలిసి చిందులు త్రొకుతున్నారు అలా తందనాలాడుతూ వచ్చి లూసీచుట్టూ మూగారు. ఒకళ్ళ చేతులు ఒకళ్లు పట్టుకుని భీభత్సంగా విప్లవగీతాన్ని అరుస్తూ లూసీ చుట్టూ వలయాలు తిరుగుతున్నారు. మానవజాతిలో వున్న మృగ స్వభావం ఒక్కసారి విజృంభించిపోయినట్టనిపించింది లూసీకి. ఆ దృశ్యాన్ని చూసి కంగారెత్తిపోయి లూసీ రెండు చేతులతోనూ ముఖం కప్పుకుంది. ఇలా ఒక అయిదారు నిమిషాలు గంగళివాలాడి, ఆ జనం లూసీని అక్కడ వదిలేసి ముందుకు తూగిపోయారు.

లూసీకి వొళ్లుతెలిసి కళ్ళువిప్పి చూసేసరికి తండ్రి కట్టెదుట కనిపించాడు.

'నాన్నా!'—అని కంగారుగా కేక పెట్టింది—'భీభత్సం' అన్నది.

'అవునమ్మా!—మరేం ఫరవాలేదు—భయపడకు—వాళ్లు నీకేమీ హాని చెయ్యరు' అంటూ, ఆయన కూతుర్ని అనునయించాడు.

'నాకు భయమేస్తున్నది నాకోసం కాదు నాన్నా!—ఈ వొళ్లు తెలియని పైశాచికావేశంలో, వీళ్లు నాభర్తని యేమి చేస్తారో!'—

మరేం ఫరవాలేదు తల్లీ!—అతన్ని వాళ్ళ వీరావేశాలకు అందేస్థితిలో వుంచాననుకున్నావా?—డార్నేను ఆ కిటికీ దగ్గరికి ఎక్కి నిల్చోమని చెప్పివచ్చాను. అతను యిప్పుడు నీవంక చూస్తున్నాడు. అరచెయ్యి ముద్దు బెట్టుకుని కిటికీవైపు చూడు. అతనికి నువ్వు ముద్దు బెట్టుకున్న ఆనందం కలిగి మనసు టెంగతీరుతుంది.'

'అలాగా నాన్నా—ఎంత సుదినం'—

'దురదృష్టవంతురాలివి తల్లీ—అతను నీకు కనుపించే సావకాశం లేకుండా వుంది.'

'కళ్ళనీళ్ళు కారుస్తూ లూసీ తన అరచేతిని ముద్దుబెట్టుకుని, ఆ ముద్దును జైలు కిటికీ వేపు విసిరేసింది.

ఇంతలో అడుగుల చప్పుడు వినిపిచ్చింది. మాడెమ్ డిఫార్జి ఆదారి నటువచ్చింది. డాక్టర్ మానెట్ పలకరించాడు. డాక్టర్‌కు ప్రత్యభివాదం చేస్తూనే మాడమ్ డిఫార్జ్ క్రీనీడలా మలుపుతిరిగి అదృశ్యమైపోయింది.

'ఇక పోదాంరా తల్లీ—సంతోషంగావుండు—అల్లుణ్ని రేపు విచారించి విడుదలచేస్తారు'—

'ఆఁ! రేపు విచారించుతారా?'—

'అవును—ఇప్పుడు కాలయాపన చెయ్యటానికి వీల్లేదు—అన్నీ సిద్ధపడే వున్నాననుకో—అయినా మరికొన్ని విషయాలు జాగ్రత్తపడాల్సివుంది. చార్లెస్‌కు యింకా సమన్లు అందలేదు. నాకు కొంచెం ముందుగా తెలిసిందిలే. మరేం భయపడకు నేనున్నాగా'—

లూసీకి నోటివెంట మాట పెగల్లేదు—'ఆఁ!—అంతా నువ్వే!' అని గొణిగింది.

'ఇక నీ కష్టాలు తీరిపోయినట్టే తల్లీ!—కొద్ది గంటల్లో అంతా తేలిపోతుంది. అతన్ని విడుదలచేసేస్తారు కావలసిన వ్యవహారమంతా సక్రమంగా యేర్పాటుచేశాను. నే నిప్పుడు లారీగారిని కలుసుకోవాలి.'

లారీగారు యింకా ఆకాతా పుస్తకాల్లో పడి సదమదమాతూనే వున్నాడు. బ్యాంకు కాతాదారుల ఆస్తిపాస్తులు జాతీయంచేసి పారేసినవాటిని దుద్దుబెడుతూ, మిగతా వాటిని తిరిగి తమ కాతాదారులకు వప్పగింత పెట్టే మార్గాలేవిఁటా అని తల పగుల గొట్టుకుంటున్నాడు.

లూసీని వెంటబెట్టుకుని డాక్టర్ టెల్సన్సు బ్యాంకువున్న మేడమీదికి వచ్చేసరికి కప్పెడు కప్పెడు చీకటిపడ్డది. వీళ్ళిద్దరూ మేడమీది ముందుహాలులోకి అడుగుబెట్టగానే, లారీ లోపలి గది లోనుంచి హడావిడిగా బయటికి వచ్చాడు. అంతవరకూ, ఆయన ఆ గదిలో యెవరితోనో మాట్లాడుతున్నాడు. లారీని చూడగానే లూసీ: 'ఆ యన్ను రేపు విచారించుతారట!' అన్నది. ఆమాటలను లోపలున్న మనిషికి చెబుతున్నట్టు లారీ గదిద్వారం వంక చూస్తూ: 'రేపు విచారిస్తారు' అన్నాడు. నల్లటి పొడాటికోటు తొడుక్కుని ఆ వ్యక్తి లోపలే కుర్చీలో కూర్చున్నాడు; బయటికి రాలేదు. ఎవరో ఆవ్యక్తి?—ఆ బయటపడగూడని వ్యక్తి? ★

జీవితరేఖ

శ్రీ అంగర
పాండురంగారావు

విశ్వనాథశాస్త్రి పరుగు పరుగున స్టేషన్ చేరుకొని ఇంకా మెయిలు రాలేదని తెలిసికొన్నాక తాపీగా టిక్కెట్టు కొని క్రిక్కిరిసి ఉన్న ప్లాట్‌ఫారమ్ చేరుకున్నాడు. శాస్త్రి నలభై ఏండ్ల వాడైనా ముఖం ముడతలు పడింది. ముక్కు మీదకు వాలే కళ్ళజోడాతనిని మరింత ముసలి వాణ్ణి చేసింది. అతనికి చిన్నప్పటినుండి హస్తసాముద్రిక మంటే చాలా ప్రీతి. దాని మీద చాలా పుస్తకాలు చదివేడు. కొందరి వద్ద శిష్యరికం చేశాడు. ఎలాగయితేనేం, ఇప్పుడు చాలా నమ్మకముగా చెప్పేవాడని పేరు పొందాడు. శాస్త్రి తన హస్తము చూసుకొని తన జీవితరేఖ చాలా పొడవుగా వున్నందుకు చాలా ఆనందించేవాడు.

అంతకు ముందురోజునే శేట్ గారివద్ద నుండి కబురు రాగా అతనింటికి వళ్ళాడు. శేట్ గారు తోటలో కూర్చుని ఉన్నారు. శాస్త్రి అతని ప్రక్కనే కూర్చుని శేట్ అరచేయి పరిశీలనగా చూసి "మీరు చిన్నతనంలో రెండుసార్లు జబ్బుపడ్డారు" అన్నాడు.

"అవును. నిజమే!" నన్నట్లు శేట్ తల వూపేడు. శాస్త్రి మరింత పరిశీలనగా చూస్తూ "మీరిప్పుడు సుఖంగానే జీవిస్తున్నారు" అన్నాడు. శేట్ చిరునవ్వు నవ్వుతూ తలవూపేడు. "కొద్దికాలంలోనే మీరు ప్రయాణం చేస్తారు" అన్నాడు శాస్త్రి. శేట్ శాస్త్రి ప్రతిభ కాశ్చర్యపోతూ తాను కలకత్తా వెళ్తున్నానని చెప్పాడు. అతని చేతినే చూస్తున్న శాస్త్రి కొంచెము గాభరాతో "మీ వయస్సెంత?" అని అడిగాడు.

"నిన్నటితో ఏభై నిండాయి" అన్నాడు శేట్.

శాస్త్రి కొంచెము తమాయించుకొని మాట మార్చేశాడు.

టిక్కెట్టు బొడ్డున పెట్టుకొని రైలు రాకకై ఎదురుచూస్తున్న శాస్త్రికి నిన్నటి ఈ ప్రసంగం మనస్సులో మెదుల్తోంది.

రైలువచ్చి ఆగింది. ముందు కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉండవచ్చునని శాస్త్రి ముందుకు వెళ్లాడు. ఇంజన్‌కు తర్వాత బోగీలో ఒకఫస్టుక్లాసు కంపార్ట్‌మెంటు, రెండు ఇంటర్ క్లాసులు, ఒక మూడవ తరగతి కంపార్టుమెంటు ఉన్నాయి. ఫస్టుక్లాసు కంపార్ట్‌మెంట్లో శేట్ గారి నౌకరు బెర్త్ మీద బెడ్ పరుస్తున్నాడు. శేట్ గారు పెట్టె తీస్తున్నాడు. శాస్త్రి వారి నొక క్షణంపాటు చూసి మూడవతరగతి పెట్లోకి వెళ్లి కూర్చున్నాడు. అదికూడా క్రిక్కిరిసి ఉంది. "8 జనులు కూర్చుండేది" అని వ్రాసిఉన్నదాన్లో 12 మంది ఉన్నారు. నేలమీదనున్న పెట్టెమీద స్థూలకాయురాలైన ఒకామె కూర్చునిఉంది. ఆమె ప్రక్కనే శాస్త్రి కూర్చున్నాడు. ఒక మూలొక వృద్ధుడు ముడుచుకొని కూర్చున్నాడు. అతని ప్రక్క శాస్త్రికి చేరువగా ఒక విద్యార్థి కళ్ళజోడు పెట్టుకొని ఏదో చదువుకొంటున్నాడు. రెండవ బల్లమీద ఒక గడ్డంతాత కూర్చున్నాడు. మిగిలిన వారిని లావాటి స్త్రీవీపు మూసివేసింది. బయట చాల వేడిగా నున్నప్పటికి చెమట పట్టి ఉన్న మూలాన రైలు కదలికకు గాలి తగిలి చల్లగా ఉంది. గాలితోబాటు బొగ్గు కణాలు, పొగా పెట్లోకి ప్రవేశించాయి. శేట్ గారి విషయం జ్ఞప్తికి వచ్చింది శాస్త్రికి. తన ప్రక్క పెట్లో గిరగిర తిరిగే పంకా క్రింద హాయిగా పడుకొనిఉంటాడు. ఈ చిన్న పెట్లో 18 గురు క్రిక్కిరిసి కూర్చుంటే, అంతపెద్ద పెట్లో అతనొక్కడు పడుకొని ఉంటాడు! శాస్త్రి తన అరచేయి చూసుకొని సంతృప్తిపడ్డాడు. తన జీవితరేఖ సుదీర్ఘంగా ఉంది. అయితే నిన్న చూసిన శేట్ గారి జీవితరేఖ సుమారు 50 ఏళ్ళు జీవిస్తాడని సూచిస్తుంది! కాని శేట్ తనకు ఏభైనిండాయంటున్నాడు. కాబట్టి శేట్‌కు ఇవాళో, రేపో మృత్యువు తప్పదన్నమాట! అది విధివిహితము, జరిగి తీరవలసిందే. అందుచేతనే శాస్త్రి అతని ఆయుర్దాయం నిండిందని చెప్పలేదు. అది నిజంగా చెప్పివుంటే అతడు మెచ్చుకొని వుండడు, యితరులకు చెపితే వారు తన్ను దూషిస్తారు. అతనికి చెప్పకపోవడమే మంచిదయినదని శాస్త్రి నిర్ధారించుకొన్నాడు.

కొంతసేపు శాస్త్రి కునికిపాట్లు పడ్డాడు. రైలొక స్టేషన్‌లో ఆగడంతో తూలి మెలకువ వచ్చింది. తన కళ్ళ యెదుట ఒక లేత హస్తముయొక్క అరచేయి తెరచిఉంది! లావాటిస్త్రీ ఒడిలో నిద్రబోతున్న చిన్న పిల్లవాడి చెయ్యి అది. శాస్త్రి ఆ చేతిలోని జీవితరేఖ చూసి ఆశ్చర్యపోయేడు. అది ప్రారంభమయి, ఆగిపోయింది. అంటే చిన్నవయస్సులోనే ఆ బాలుని ఆయుర్దాయం పూర్తవుతుందన్నమాట. తర్వాత స్టేషన్‌లో విద్యార్థిప్రక్క ఒకడు దిగిపోవడంతో శాస్త్రి అక్కడికి వెళ్లి కూర్చున్నాడు. చిన్నపిల్లవాడి చేయి శాస్త్రి దీక్షగా చూడడం గమనించిన ఆ విద్యార్థి శాస్త్రిని తన చేయి చూడమని అందించాడు. "మీ జీవితరేఖ పొడవుగానే వుంది. ప్రస్తుతం మీ వయస్సు పద్దెనిమిది సంవత్సరాలుండవచ్చు" అన్నాడు శాస్త్రి.

విద్యార్థి నవ్వు మొహంతో "మీరు సరిగ్గా చెప్పారు. నిన్నటితో నాకు పద్దెనిమిది పూర్తయాయి" అన్నాడు. దాంతర్వాత వారిద్దరు హస్తసాముద్రికం గురించి గట్టిగా మాట్లాడ్డంతో ఎదురుగానున్నాయన తన చేయి చూడమన్నాడు. శాస్త్రి అతని చేయి చూశాడు. అతని జీవితరేఖ అతని ప్రస్తుత వయస్సుతోనే ఆఖరయింది! అతని ప్రక్కనున్న మరి యిద్దరి చేతులు చూశాడు. అవీ అంతే! వారి జీవితరేఖలు ఆ రోజుతో ఆఖరు. ఆ కంపార్ట్‌మెంట్లో 18 గురున్నారు. శాస్త్రి అందరి చేతులూ చూసేడు. 12ఏళ్ళ ఒక కుర్రవాడి జీవితరేఖ తప్ప మిగిలిన వారందరి జీవితరేఖలు ఆ రోజుతో ఆగిపోతాయి. అయితే శాస్త్రి ఈవిషయం ఎవరితోనూ చెప్పలేదు. ఆ కుర్రవాడు హాల్వార్ వరకు వెళ్తున్నాడని శాస్త్రి అతనిని అడిగి తెల్సుకొన్నాడు. అయితే కళ్ళజోడు పెట్టుకొన్న విద్యార్థి



"కొద్దికాలంలోనే మీరు ప్రయాణంచేస్తారు" అన్నాడు శాస్త్రి.

జీవితరేఖ చాల పొడవుగా వుంది. అతన్నడిగి శాస్త్రి అతని పేరు రాజగోపాలరావని తెల్సుకొన్నాడు.

కొంతసేపటికి మసకమసకగా చీకటి ఆవరించింది. ఎవరి ధోరణిలో వారున్నారు. గడ్డంతాత తూర్పుయాసతో ప్రక్కనున్న వానితో మాట్లాడుతున్నాడు. లావాటిస్త్రీ ఒళ్లో ఇద్దరు పిల్లల్ని పెట్టుకొని జోగుతోంది. రాజగోపాలరావు శాస్త్రివంక తిరిగి "నా జీవితరేఖ పొడవుగా ఉందన్నారు. నేను చాలాకాలం బ్రతుకుతానన్నమాట" అన్నాడు. "అవునంతే. 70, 80 ఏళ్లు బ్రతుకుతావు" అన్నాడు శాస్త్రి. "నాకు బ్రతకాలని లేదండి" అన్నాడు రావు నిరాశాపూరితమైన నవ్వుతో. శాస్త్రి నవ్వుకొన్నాడు. "నీవు కావాలంటే చావగలవా? నీకు బ్రహ్మ ఎంత రాసిపెడితే అంతే" అని మనసులో అనుకొన్నాడు.

శాస్త్రి ఆలోచనలో పడ్డాడు. ఆ పెట్టెలోనున్న పదముగ్గురిలోను రావు, హాల్వార్ వెళుతున్న కుర్రవాడు, తాను తప్పితే మిగిలినవారెవ్వరు ముసలితనంవరకు బ్రతకరు. మిగిలిన పదిమంది జీవితరేఖలు శేట్ రేఖలాగే హఠాత్తుగా తెగిపోయాయి. అన్నట్టు శేట్ గూడా ఆ రైలులోనే ప్రయాణం చేస్తున్నాడు. శాస్త్రి ఆ విషయమే మర్చిపోయాడు. శాస్త్రి గుండెల్లో రాయిపడినట్లయింది. ఆ రైలులో వీరిలాగే వందలకొలది జనుల జీవితరేఖలు ఆరోజుతో ఆఖరయి వుండవచ్చు! శేట్ కలకత్తా వెళ్ళుతున్నాడు. శాస్త్రి, రావుకూడా అక్కడికే. పొడుగైన జీవితరేఖగల కుర్రవాడు హాల్వార్ వెళ్ళుతున్నాడు. తల్లి ఒడిలో కూర్చున్న పిల్లలు, తల్లి గుల్బర్గ వెళ్ళుతున్నారు. మిగిలిన వారందరూ కలకత్తాకే. చీకటిపడింది. తర్వాత స్టేషన్ హాల్వార్. అక్కడ ఆ కుర్రవాడు దిగి క్షేమంగా ఇంటికి పోతాడు. అందుచేత హాల్వార్ దాటినతర్వాత రైలుప్రమాదము జరుగుతుందన్నమాట! తల్లి, పిల్లలు గుల్బర్గ వెళ్ళుతున్నారు కాబట్టి గుల్బర్గ చేరకముందే ప్రమాదం సంభవించాలి. అందుచేత హాల్వార్, గుల్బర్గలమధ్య ఏక్సిడెంట్ సంభవిస్తుందన్నమాట!

శాస్త్రి మనస్సు స్వాధీన పర్చుకొన్నాడు. హాల్వార్ చేరడానికింకా పదిహేను నిమిషాల వ్యవధిఉంది కాబట్టి అక్కడివరకూ అందరు క్షేమంగా ఉంటారు. రైలుప్రమాదం జరుగుతుందనే భయంకంటె తనకుముందే తెలుసునన్న భయం ఎక్కువయింది శాస్త్రికి. తన జీవితానికే ప్రమాదమూ లేదని శాస్త్రి సంతృప్తి పడ్డాడు. ఎదురుగా రాజగోపాలరావు జోగుతున్నాడు. ఎదురుగా పెద్దప్రమాదము సంభవించుతుంటే నిశ్చింతిగా నిద్రపోతాడేమో అనిపించింది శాస్త్రికి. అయినా ప్రమాదం జరుగుతుందని అతనికి తెలియ

జీవితరేఖ

దుగా! శాస్త్రికి మరొక భయం పట్టు కొంది. ప్రమాదంలో చనిపోవక పోవచ్చు గాని గాయపడవచ్చుగదా. రైలుప్రమా దాల్లో చాలా మంది కాళ్లు విరిగి, చేతులు విరిగి శరీరమంతా గాయాలు తగుల్తాయి గాని మరణించరు. తన గతీ అంతే నేమో నని శాస్త్రి లవరపడ్డాడు.

శాస్త్రి చెమటపట్టిన నుదుటిని తుడుచు కొన్నాడు. హాల్వార్‌లో దిగి పోదామా అనుకొన్నాడు. తన జీవితరేఖ పొడవుగా నుండడమేగాక ఎక్కడా ప్రమాదం సంభ విస్తుందన్న సూచన లేదు. రాజగోపాల రావు రేఖకూడా అలాగే ఉంది. శాస్త్రి ఆలోచనలో పడి కొట్టుకుంటుండగానె రైలు వేగము తగ్గించి లైట్లతో నిండి ఉన్న హాల్వార్ ప్లాట్‌ఫారమ్ చేరింది. ఊపుతో రైలు ఆగేసరికి హాల్వార్ దిగిపోతానన్న కుర్రవాడు సంచి భుజాన వేసికొని దిగిపోయాడు. శాస్త్రి కూడా యాదాలాపంగా రైలు దిగాడు. మళ్ళీ రైలు ఎక్కడమా, వద్దా అన్న సంది గ్ధావస్థలో పడ్డాడు శాస్త్రి. భయం అతన్ని రైలు ఎక్కనివ్వడం లేదు. బుద్ధి మాత్రం "నీకేం ప్రమాదం లేదు. ఎక్కు" మంటుంది. కాని శాస్త్రి ఎక్కడానికి సంకోచిస్తున్నాడు. ఒళ్లంతా చెమట పట్టే సింది. ప్లాట్‌ఫారమ్ మీదే చతికిలబడ్డాడు. గార్డు ఈలవూదాడు శాస్త్రి కంగారుగా లేచాడు. పచ్చదీపం అటూ ఇటూ (శాస్త్రి మనస్సులాగే) ఊగుతూంది. రైలు కదులుతుండగా గుమ్మంవద్ద నున్న ఇనుప చువ్వ పట్టుకొని రెండడుగులు వేశాడు కాని వదిలేసి ప్లాట్‌ఫారమ్‌మీదే కూలి పోయేడు. మృత్యుదేవతకి అప్పగించ డానికి తనతోటి ప్రయాణీకులను చేతు లారా సాగనంపాడు. ఎవరో వచ్చి తన్ను తట్టిలేపేవరకు లేవలేదు. ఒక కప్పుటీ త్రాగి స్టేషన్‌లోనే ఒక బెంచీమీద పడు కున్నాడు. తెమురాత్రి పద కొండుగంట లయింది. ఇంకొక గంటలో ఘోరమైన వార్త వింటాడు. శాస్త్రి ఆలోచనలో ఉండగానే మరొక రైలు వచ్చింది. ప్రయాణీకులంతా సందడిగా ప్లాట్‌ఫారం మీద తిరిగారు. రైలువెళ్లిపోయింది. ప్లాట్ ఫారమ్‌మీద సందడి తగ్గింది.

బాగా తెల్లవారిన తర్వాతగాని శాస్త్రికి మెలకువ రాలేదు. స్టేషన్ మాష్టరు ఆఫీసు వద్ద చాలాసందడిగా ఉంది. శాస్త్రి అక్క డికి వెళ్ళాడు. గదంతా జనంతో నిండి పోయింది. ఒక యువకుడు స్టేషన్‌మాష్టరు దగ్గరికెళ్లి "మూడు నిమిషాలంటే మూడు నిమిషాలు ఫోన్‌లో మాట్లాడ నివ్వండి. నేను జర్నలిస్టును" అని బతిమాలుకొంటు న్నాడు. స్టేషన్ మాస్టరు అనుమతిమీద అతడు ఫోన్‌దగ్గరకు వెళ్లాడు. శాస్త్రి ఫోన్ దగ్గరికి వెళ్లి అతనేమి వ్రాసుకుంటు న్నాడో చూస్తూనుంచున్నాడు.

"అప్‌గూడ్సుతో గుద్దుకొంది. రెండు ఇంజనులు తిరగబడి పోయినవి. మొదటి రెండుబోగీలు తుక్కుతుక్కయి పోయాయి. మూడవది, నాల్గవది పట్టాలు

హర! హర! మహదేవ్!

పోకాకు అనే ఆంగ్లేయ పండితుడు యీ క్రింది విధంగా *Theogony of the Hindus* (హిందువుల దేవతా గణము) అనే గ్రంథంలో యిలా వ్రాశారు.

'శర్మ' శబ్దము "జర్మ" గాను, "జర్మ" శబ్దము "జర్మన్" గాను మారి పోయింది,

"మను" లేక "మనువు" అనువాడు ఆర్యులకు ఆది పురుషుడైనట్లే, అయిరోపా లోని ట్యూటను జాతికి "మనుస్" అను వాడు మూల పురుషుడని జర్మను పురాణ గాథ లంగీకరించు చున్నవి. "మాన్" అనే ఇంగ్లీషు మాట, "మోనుష్" అనే జర్మను మాట, సంస్కృతం లోని "మనుష్య" శబ్దం అన్నీ ఒక్కటే పోలికగా ఉన్నాయి. అర్థం కూడా ఒక్కటే.

ఆంగ్లేయులు, ఎవరికైనా ఉత్సాహం కలిగే టట్లు కేకలు వేయవలె నంటే, "హూరా! హూరా" (*Hurrah! Hurrah!*) అని కేకలు వేస్తారు. హిందువులలో రాజ పుత్రులు యుద్ధరంగము లందు శత్రువు మీదకు సేనలను ఉరికించు నప్పుడు "హర హరా!" అని అరచేవారు- లేదా "హర! హర! మహ దేవ్!" అని శివుణ్ని స్మరిస్తూ కేకలు వేసేవారు. రాజ పుత్రులు చాలా కాలము బ్రిటనులో కాపుర ముండిరి.

ఇంగ్లాండు లోనికి క్రయిస్తవమతము రాక పూర్వము అచటి బ్రిటను జాతివారికి "డ్రూయిడ్‌లు" అనే వారు కులపతులు గాను, నాయకులు గాను పురోహితులు గాను ఉండేవారు. జీవునకు మరొక జన్మ కలదని యీ డ్రూయిడ్‌లు నమ్మి యుండిరి. మరణానంతరం యీ ఆత్మ అనంతాకాశంలో లీనమై పోతుందని వారు నమ్మిరి. కనుక డ్రూయిడ్‌లు బౌద్ధ బ్రాహ్మణులై యుండ గలరని తోచు చున్నది. రాజపుత్రులు కొంతకాలం బ్రిటన్ లో కాపుర ముండిరని చెప్ప వచ్చును.

తప్పినవి." అని ఫోన్‌లో గొంతు మాట్లాడింది.

"ఎంతమంది చనిపోయారు" అని జర్నలిస్టు అడిగాడు. జవాబు :

"మరణించినవారు 38, గాయపడ్డవారు 86, మృత కళేబరాలను ఇంకా బయటికి తీస్తున్నారు. చనిపోయిన వారిలో మూడవ తరగతి ప్రయాణీకులెక్కువమంది. మొదటి బోగీలో వారందరు చనిపోయారు" అని ఫోన్‌లో గొంతుమాట్లాడింది.

జర్నలిష్టు థాంక్స్ చెప్పి ఫోన్ బల్ల మీద పెట్టగానే శాస్త్రి అతని దగ్గరికెళ్లి "క్షమించండి ఈ సమాచారము పూర్తిగా నిజం కాదు కొంతమాత్రమే సత్యం." అన్నాడు. జర్నలిష్టు అతనని తేరి పారజూశాడు. "మొదటి బోగీలో వాళ్లందరూ చనిపోలేదు. ఒకడు మాత్రం బ్రతికాడు. అతని పేరు రాజగోపాలరావు" అన్నాడు శాస్త్రి

జర్నలిష్టు వీడెవడో పిచ్చివాడనుకొని తనకు వచ్చిన ఇన్ఫర్మేషన్‌తో పరుగెత్తాడు. శాస్త్రి ఈ సంఘటనగురించి ఆలోచిస్తూ ప్రమాదాన్ని గురించి అందరనుకునే మాటల్ని వింటూ మధ్యాహ్నం వరకూ గడిపాడు. అతనికి తనతో గూడా ప్రయాణంచేసిన తల్లి, పిల్లలూ, గెడ్డంతాత, రాజగోపాలరావు జ్ఞాపకం వచ్చారు. ప్రమాదం జరుగుతుందని తనకు ముందే తెలిసి వుండికూడా ఏమీ చేయలేక పోయానే అని విచారించాడు. అయినా తాను మాత్రం ఏమిచేయగలడు ? ప్రమాదం జరుగుతుందని హాల్యార్ స్టేషన్ మాష్టరుతో చెప్పితే నమ్మతాడా ? వాళ్లు తన మాటలు లెక్క చేస్తారా ? విధి ఎలాగుంటే అలాగ జరిగి తీరుతుందని శాస్త్రి నిర్ధారించుకొని ఆకలి తీర్చుకోడం కోసం హిందూ రెస్టారెంట్‌కు బయలుదేరాడు. దారిలో ఒక దినపత్రిక కొన్నాడు. దాని మీద పెద్ద పెద్ద అక్షరాలతో ప్రమాద వివరాలన్నీ ఉన్నాయి. హాల్యార్, గుల్బర్గ లమధ్యనే ప్రమాదం జరిగింది. పత్రికను మడిచిపెడుతుండగా జర్నలిస్టు అతనివద్దకు త్వరత్వరగా వచ్చాడు. "మీరు చెప్పింది నిజమే, రాజగోపాలరావనే విద్యార్థి మొదటి బోగీలో ప్రయాణిస్తూ ప్రమాదం తప్పించుకొన్నాడు. అది మీ కెలా తెలిసింది ?" అన్నాడు జర్నలిష్టు.

"నాకు ముందే తెలుసు." అన్నాడు శాస్త్రి గర్వంగా.

"అయితే మీ పేరు చెప్పండి. మీ జోస్య ప్రభావము, ఈ సంఘటనంతా మా పేపర్‌లో వేస్తాము. మీకు దేశమంతటా పేరువస్తుంది. లక్షలు, లక్షలు గడించవచ్చు." అన్నాడు జర్నలిస్టు.

శాస్త్రి ఆలోచించాడు. ఈ ఘోర ప్రమాదము జరుగుతుందని తనకు ముందే తెలుసు. తాను ఎవరితో చెప్పినప్పటికీ ఈ ఏక్సిడెంట్ జరిగి తీరవలసినదే కాని ప్రజలు నమ్మతారా ? పత్రికలన్నీ తన్ను విమర్శిస్తాయి. ప్రమాదములో మరణించిన వారి బంధువులు, స్నేహితులు తాను ముందే ప్రయాణీకులను హెచ్చరించలేదని, అందుచేత అందరి చావులకు తానే కారణమని ఉత్తరాలు వ్రాస్తారు. నిజానికి తానీ ప్రమాదాన్ని తప్పించగలిగే సమర్థుడు కాడు. భగవంతుడు ఎలా విధిస్తే అలా జరిగి తీరవలసిందే.

శాస్త్రి జర్నలిష్టుతో "నా పేరు పేపరులో వేయ నక్కరలేదు. సెలవు" అని పలికి వెనుతిరిగి జనసమూహంలో కలిసి పోయాడు. ★



శ్రీమతి యన్. సింగమ్మాళ్, ఎం. ఏ.

నాగపూర్ స్త్రీల కళాశాలలో ప్రొఫెసరు, బళ్లారి వాస్తవ్యులు కీ. శే. యం. ఏ. నారాయణ అయ్యంగార్ గారి కుమార్తె. ఉన్నత విద్యాభ్యాసముకై ఈమె ఇప్పుడు అమెరికా వెళ్లియున్నది. ఇటీవల శాన్ ఫ్రాన్సిస్కోలోని హాలీవుడ్‌ను ఇతర ప్రదేశములను సందర్శించి యున్నది.

అద్దె యిల్లు

శ్రీ సుసర్ల అప్పన్న శాస్త్రి

(రామ్మూర్తి: అద్దెయిల్లుకోసం వస్తాడు. సుందరమ్మ యింటి యజమానురాలు.)

రా: ఈ ఒక్క గదికీ యిరవైరూపాయలా?

సుం: నయం. యింకా ఈమాత్రం యిల్లు అద్దెకు దొరుకుతున్నందుకు సంతోషించు. ఈ యిల్లు గదిలా కనపడుతున్నదా? సగం యిల్లుఅంతా అద్దెకి ఇచ్చేస్తుంటే. ఈ గదికి ముందు వసారా, హాయిగా ఆఫీసుపని చేసుకోవచ్చు. వెనుక పంచపాళీ వంటిల్లుగా వాడుకోవచ్చు.

రా: పదిహేను రూపాయలు చేసుకోండి. యిరవై రూపాయలు యిచ్చుకోలేను. 80 రూపాయల జీతంలో నే సంసారం అంతా వెలగబెట్టుకోవాలి. పెద్దవారు మీకు తెలియనిదేముంది? మాకు మరో పెద్ద దిక్కు లేదు. కొత్తగా సంసారం.

సుం: పోనీలేనాయినా! ఎప్పుడు దిగడమేమిటి? ఒకనెలఅద్దె అడ్వాన్సు యివ్వాలి. తెల్సునుకదూ?

రా: జీతం అందగానే మీడబ్బు మీకు పువ్వుల్లో పెట్టి యిచ్చేస్తాను. గుమస్తాగాళ్ళకి ఈరోజుల్లో నెలమధ్యలో డబ్బెక్కడ్నించివస్తుంది చెప్పండి?

సుం: అయ్యో! నా తెలివిమండ! అడగడమే మర్చిపోయాను. ఏ ఆఫీసులో పనిచేస్తున్నావు నాయినా?

రా: "టి. ఎస్. ఒ." ఆఫీసులోనండి. మొన్ననే బదలీఅయింది.

సుం: ఊఁ. అలాచెప్పు. నిన్ను చూడగానే అనుకున్నాను. ఆ సిల్కు బట్టలూ అవీ చూసి ఏ రెవనింగు ఆఫీసరువనో?

రా: సరి శలవు. తాళం యిప్పించండి. ఎల్లుండి మంచిదట. మా ఊరువెళ్ళి మా ఆవిడను తీసుకొచ్చేస్తాను.

సుం: తప్పకుండాను. అద్దెఅంతా కాకపోయినా ఓపది రూపాయలేనా అడ్వాన్సు యిప్పించు.

(రామ్మూర్తి పది రూపాయలు యిచ్చి తాళం పుచ్చుకొని వెళ్ళిపోతాడు)

* * *

(రామ్మూర్తి భార్య కమలమ్మ, రామ్మూర్తి అద్దెయింట్లో దిగిన తర్వాత)

క: యిదేమిటండీ? పంచపాళీ, వసారా, పెద్దగదిఅన్నారు. ఈ అగ్గిపెట్టెంత గదిలో ఏం సంసారం చాలుతుందండీ?

రా: ఓసి వెర్రిదానా! ఈ గదిలో మనం కాలక్షేపం జేసుకోలేం? మరి మాకిచ్చే జీతాలు మనకి సరిపోతున్నాయా? ఆట్టే కేకలేయకు. ఈ జాగాకూడా ఉండదు. యిరవై అన్నది 15 రూపాయలకు మనకు యిచ్చినందుకే యిల్లంతా ఉత్తినే వ్రాసి యిచ్చేసినట్టు ఆవిడ అనుకుంటున్నది.

క: చాలాబావుంది. ఎలా మసలటం చెప్పండి. మంచంవాలుస్తే పడకగది, మంచంఎత్తి పొయ్యిరాజేస్తే వంటయిల్లు, పొయ్యి అలికి చాపవేస్తే వరండా. అన్నిటికీ ఈ చదరంతగది.

రా: ఉష్! సుందరమ్మగారు వస్తున్నట్టున్నారు.

(సుందరమ్మ ప్రవేశం)

సుం: చూడు నాయనా! మీ గదిలో సామాన్లుకొంచెం సర్దుకుపెట్టుకోండి.

రా: తప్పకుండాను. మాకమల యింకా సర్ద లేదులెండి. మీరు వసారా, వెనకనున్న పంచపాళీయిస్తే ఏకంగా సర్దుకుందామని ఊరుకుంది.

సుం: దానిగురించే చెప్తున్నా. వీధి వరండాలో కంసాలికి దుకాణం పెట్టుకునేందుకు అద్దెకిచ్చాను. అతడి సామాన్లు మీ గదిలో సాయంత్రంవేళ ఉంచుకుందుకి కొంచెం జాగా ఈయాలి.

రా: మా వేపుకన్న మీ భాగంలో వసారా వాడికి యిచ్చెయ్యవల్సింది. అయినావాడికి యిందులో ఒకభాగంయిస్తే వాళ్లు పని చేసుకుంటున్నప్పుడు మనకి ఎలా తోస్తుందండీ?

సుం: మాభాగంలో టైలరు దిగాడు. పదిరూపాయలు ఆ కంసాలి యిస్తున్నాడు. నువ్వు 20 రూపాయలు యిచ్చుకోలేనన్నావని అతడ్ని దింపాను.

రా: అదేమిటండీ? ముందూ లేదు. వెనకాలేదు. ఒక్కగాని ఒక్క గది. అందులో యింకా మరో అద్దెలవాళ్ళు,

(42-వ పేజీ చూడండి)



విజ్ఞానవీధులు

"డాక్టర్"



55. అద్దంకళాయీ గిన్నెల కళాయీ ఒకటేనా?

కళాయి అనే పేరు వాడుతోన్నప్పటికీ అద్దానికి వేసే కళాయికి, గిన్నెలకి పూసేకళాయికీ నామసామ్యంతప్ప మరే పోలికా లేదు.

నేడు సామాన్యంగా రసాయనిక విధానాలవల్ల వెండిని గాజుపలకమీద నిక్షేపించి కళాయి వేస్తున్నారు. ఆ విధానాలన్నింటిలోనూ మూలసూత్రం ఒకటే. రజతలవణధావణాలకి ఆక్సీహారణ పదార్థాల్ని కలిపినపుడు అణుప్రమాణ కణరూపంలో వెండి ఏర్పడుతుంది. అదే గాజుపలకమీద నిక్షిప్తమవుతుంది. ఈ విధానాలన్నింటిలోనూ రజతలవణద్రావణమూ, ఆక్సీహారణ ద్రావణమూ అవశ్యము. లోకంలో ఎన్నో ఆక్సీహారణ పదార్థాలున్నాయి. అందుచేత అద్దాలకి కళాయి వేసే పద్ధతులుకూడా ఎన్నో ఉన్నాయి. వాటిలో ఒక విధానాన్ని మాత్రం తెలుసుకుందాము.

మొదటి ద్రావణాన్ని తయారు చేసేటందుకు రెండున్నర పాళ్ళ సిల్వర్ నైట్రేటుని నూరుపాళ్ళ నీటితో కలపాలి. అందులో నాలుగోవంతు ద్రావణాన్ని వేరేవుంచి మిగిలిన దానికి చుక్కచుక్కలుగా అమ్మోనియా ద్రావణాన్ని కలపాలి. అప్పుడు నల్లటి అవక్షేపం దిగుతుంది. క్రమంగా మనం కలిపిన అమ్మోనియా హెచ్చగానే ఈ నల్లటి అవక్షేపం కరగిపోయి, రంగులేని ద్రావణం లభిస్తుంది. మనం ఎంత జాగ్రత్తగా అమ్మోనియా కలిపినా అది కొంచెం ఎక్కువ కాకమానదు. అందుచేత మనం మొదట వేరే ఉంచిన ద్రావణాన్ని దీనికి కలిపి బాగా కలియబెట్టి వడబోసి రెండురెట్లు నీళ్ళు కలిపి, తేనెరంగు సీసాలోనో, నీలిరంగు సీసాలోనో భద్రపరుచుకోవాలి.

ఇంక రెండవ ద్రవణాన్ని తయారుచేసే విధానం తెలుసుకుందాము. ఒక అరపాలు సిల్వరు నైట్రేటు లవణాన్ని 250 పాళ్ళ సలసలా కాగే నీటికి కలపాలి. తర్వాత దానికి ఒక అరపాలు రోషెల్ లవణాన్ని కలిపి మరికొంచెంసేపు సలసలా కాచినప్పుడు బూడిదరంగు అవక్షేపం లభిస్తుంది దాన్ని వేడిగాఉండగానే వడబోసి సీసాలోపోసి జాగ్రత్తపెట్టాలి. ఈ రెండు ద్రావణపు సీసాల్నీ చీకటిగదిలో జాగ్రత్తపెట్టడం అవసరం. లేకపోతే సూర్యకాంతివల్ల రజత లవణాల్లో రసాయనిక మార్పులు కలుగుతాయి. అవి మనం ఈ సందర్భంలో కోరుకోతగినవి కావు.

ఇక అద్దానికి కళాయి వేసేముందు జిడ్డుపోయేటందుకు బాగా యాసిడ్‌తోటీ నీటితోటీ కడగాలి. అలా చేసినతర్వాత గీతలేమీ పడకుండా, చేయి అద్దానికి తగలకుండా దూదిపింజతోనో, మెత్తని టర్కీషు తువాలుతోనో పొడిగా తుడవాలి. నాలుగు అంచుల్నీ సన్నగా రేఖాప్రాయంగా మైనపు పూతపూయాలి. ఇది మనం తర్వాత దానిమీద పోయబోయే ద్రావణాలు జారిపోకుండా నిలిచేటట్టు చేస్తుంది. తర్వాత చీకటిగదిలో ఒక ఫోటోగ్రాఫిక్ పింగాణీ తొట్టిలో దాన్ని ఉంచాలి. ఒకమూల రెండు సీసాల్లోని ద్రావణాన్నీ ఏకధారగా మెల్లగా సుళ్లు తిరగకుండా పోయాలి. తర్వాత ఏడెనిమిది గంటలపాటు మరి దానికేసి చూడకూడదు. రోషెల్ లవణము సిల్వర్ నైట్రేటుని ఆక్సీహారించడంవల్ల వెండి తయారవుతుంది. అది గాజుపలక అంతటా సన్నటి పూతిగా ఏర్పడుతుంది.

ఈలా వెండి కళాయి పూత ఏర్పడిన తర్వాత గాజుపలకని సన్నని నీటిధారతో మెల్లగా కడిగి ఆరబెట్టి అది రాలిపోకుండా దానిపైని లక్కవార్నీషు పూసి ఎండనియ్యాలి. 5 పాళ్లు గట్టాపర్చానీ, 20 పాళ్ల డమ్మర్ గుగ్గిలాన్నీ, 75 పాళ్ల బెంజీన్ ద్రవంలో కరగించి తయారుచేసే ద్రావణం అతిశ్రేష్టమైన వార్నీషు అని అనుభవజ్ఞులు చెపుతున్నారు.

ఈఅదపు కళాయి విధానంలో లోపాలు లేకపోలేదు. వెండిపూత కొంచెం మకమకలాడుతుంది. ఒకొక్కప్పుడు అంతటా ఏకరీతిగా పడదు. ఈ విధానాల వర్ణన చదివి, అర్థం చేసుకోడంవల్ల కౌశల్యం లభిస్తుందనడానికి వీల్లేదు. అనుభవ విజ్ఞానానికి మించింది లేదు.

రాగీ, ఇత్తడి పాత్రల్లో ఉప్పూ చింతపండూ వాడినప్పుడు చిలుము ఎక్కకుండా కళాయి వేయిస్తాము. కళాయి వేసేముందు కూడా పాత్రల్ని కాచి శుభ్రం చేస్తారు. అంతేకాకుండా సామాన్యంగా హైడ్రోక్లోరిక్ ఆసిడ్‌తోనో, జింక్ క్లోరైడ్ తోనో ముంచిన గుడ్డతో తుడిచి, కొంచెం గుగ్గిలం వేసి అంతటా తుడిచి మరింత శుభ్రం చేస్తారు. సామాన్యంగా రాగి పాత్రల్ని శుభ్రం చేసేటందుకు నవాసారాన్ని కూడా వాడుతారు. దీనినుంచి సులభంగా రసాయనిక వియోగంవల్ల కొంచెం ఆసిడు లభిస్తుంది. ఇలా శుభ్రంచేసిన తర్వాత తగరమూ సీసమూ కలిసిన బిళ్ళల్నీ, కొంచెం నవారసాన్నో గుగ్గిలాన్నో కూడా వేసి అవి పొగలు చిమ్ముతోంటే పాత గుడ్డ ముక్కతో అంతటా నొక్కి తుడుస్తారు. అప్పుడు అతి సులువుగా కరిగిన సీస తగరపు మిశ్రమపూత పలచగా అంతటా ఏర్పడుతుంది. అతిత్వరగా తుడిచి ఇంకా కరగి ద్రవరూపంలో మిగిలిఉన్న సీస తగరపు మిశ్రమాన్ని ఒలకబోస్తారు. అది గాలిలో చల్లారి గట్టిపడి తిరిగీ ఇతర పాత్రలకి కళాయి చెయ్యడానికి ఉపయోగిస్తుంది. ఇదే అనాదిగా, నేటికీ వాడుకలో ఉన్న పాత్రలకి కళాయి పూసే విధానం. అందుచేత పాత్రలకు పూసే కళాయి పలచటి సీస తగరపు మిశ్రమపూత మాత్రమే అనాలి.

('హరి')

★ విజ్ఞాన వీథులు ★

56. ఘనపదార్థముకన్న బరువైన వాయువు

వాయువులలోని అణువులు - గుంపులోని తేనెటీగలవలెనే - విచ్చలవిడిగా కదిలిపోతూ వుంటాయి. ఒక అణువు ఇంకొక అణువుతో ఢీకొనడమువల్ల వెనక్కి తిరగవలసివస్తుంది. అంతే. ఇంతకు మించిన నిరోధమేదీ లేకపోవడమువల్ల వాయువుల అణువులు ఎంత పెద్ద పాత్రలో వుంచినా ఆ పాత్రలో ఎక్కడో అణుగున మాత్రమే వుండిపోక పాత్రలోని అవకాశము వంతటినీ ఆక్రమిస్తాయి.

ద్రవాల అణువులకు పరస్పరాకర్షణ ఉన్నది. అందువల్ల వాయువులలోని అణువులకంటె ద్రవాలలోని అణువులు దగ్గర దగ్గరగా వుంటాయి. ద్రవంలోని ప్రతి అణువూ ఇటూ అటూ తిరుగుతూ కదులుతూ వున్నా, మొత్తపుగుంపుని – అనగా ఆద్రవపు పరిమాణాన్ని దాటి పారిపోదు. కాబట్టి ద్రవములోని అణువులు వాయువులోని అణువులకంటె గుత్తంగా, సాంద్రంగా వుంటాయి కనక సరికి సరా తీసుకుంటే వాయువుకంటె ద్రవము బరువుగా ఉంటుంది.

ఘనపదార్థాలలోని అణువులు - గుంజలకి కట్టిన పశువులవలె - ఎక్కడుంటే ఆ చుట్టుపట్ల కొంచెపు మేరలోనే గాని, ద్రవాణువులవలె ఉన్న పరిమాణములోనంతటా తిరగలేవు. అంటే ఈ అణువుల కున్న స్వాతంత్ర్యము ఇంకా తక్కువన్నమాట. ఈ కారణముచేత సాధారణముగా ద్రవాలకన్న ఆద్రవాలు గడ్డకట్టిన ఘనపదార్థాలు బరువుగా వుంటాయి.

ఈ గుణాల్ని పరిశీలించిన వైజ్ఞానికులు వాయువుని చల్లబరిచీ, నొక్కి, ద్రవరూపానికి తెచ్చారూ; ద్రవాల్ని చల్లబరిచి ఘనరూపానికి తెచ్చారు. కాని ఈ స్థితిభేదము జరగడానికి ఒక నియమము ఉంది. వాయుపదార్థాల్ని చల్లబరచకుండా కేవలము నొక్కివేయడమువల్లనే ద్రవరూపానికి తేవడము సాధ్యము కాదు. 'ఎంతవరకూ చల్లార్చవలెనూ?' అన్నది ఆ వాయువునుబట్టి వుంటుంది.

సూర్యబింబంలో వాయువులే ఉన్నాయి. ద్రవము ఉన్నా, ఘనపదార్థము ఉన్నా సూర్యబింబపుటంచు (ఫొటో తీస్తే కనపడేటంత) మసక మసకగా ఉండడానికి వీలులేదు. అయితే ఈ వాయువులు ఒత్తిడివల్ల బాగా, అతిగా, నొక్కివేయబడి వుంటాయి. వాటి ఉష్ణోగ్రత చాలా హెచ్చుగా—6000 డిగ్రీలు దాటి ఉండడమువల్ల ఒత్తిడి ఉన్నా అవి ద్రవాలుగా తయారుకావడానికి వీలులేదు. కాని అణువులు గుత్తంగా నొక్కివేయబడడమువల్ల ఈ సూర్యగోళాంతరవాయువులు మన ఘనపదార్థాలకంటె బరువుగా తయారౌతాయి. వీటి తేడామాత్రము అలాగే ఉండిపోతుంది. ఈ వాయువుని గుప్పెడు పరిమాణాన్ని భూగోళముమీదికి తెస్తే, అక్కడి ఒత్తిడి తక్కువగా ఉండడమువల్ల ఇది ఎన్నిరెట్లో పెరిగిపోతుంది. ఈ పరిస్థితుల్లో ఘనపదార్థమైతే పెరిగిపోదు. గుప్పెడే వుంటుంది.

—రావు.

57. నీటిబిందువుల చప్పుడు

నీటిబిందువులు గట్టి బల్లమీదగాని, నేలమీదగాని పడినప్పుడు 'చిట్ చిట్' మనే శబ్దము పుట్టుతుంది. ఇది బల్లలో పుట్టే కంపనాలవల్లగాని, బిందువు చిట్లిపోవడంవల్ల గాలికి తగిలిన ఘాతవల్లగాని కలగవచ్చును. బిందువు చుట్టూ ఉన్న నీటిపొర ఫుట్‌బాల్ బ్లాడరు గాలిని లాగే నీటిని పట్టి వుంచుతుంది. కింద పడగానే ఈ పొర తెగిపోయి నీరు చుట్టూ చెదురుతుంది. అందువల్ల గాలికి తగిలిన దెబ్బ శబ్దముగా చుట్టూ వ్యాపిస్తుంది.

అయితే నీటిమీద నీటిబిందువులు పడినప్పుడు కూడా బుడుక్కుమని చప్పుడౌతుంది. రామన్ మహాశయులు ఈ చప్పుడు దగ్గిర దగ్గిరనుంచి బిందువులు పడితే కలగదని చూపించారు. జోన్సు ఈ దూరాన్ని క్రమక్రమంగా పెంచి చిత్రచిత్రమైన సంగతులు కనుక్కొన్నాడు. మొదటలో నిశ్శబ్దంగా పడే బిందువులు కొంత ఎత్తునుంచి పడేసరికి చప్పుడు చేస్తాయిట. ఈ ఎత్తు ఎక్కువచేస్తూపోతే, చప్పుడూ, నిశ్శబ్దమూ చప్పుడూ నిశ్శబ్దమూ వరసగా వస్తాయిట! 12 నుంచి 0 సెంటీమీటర్లవరకూ బిందువులు చప్పుడు చెయ్యవట. తరవాత పడే దూరము హెచ్చేనకొద్దీ చప్పుడు క్రమంగా హెచ్చౌతుందట.

ఈ చప్పుడు, బిందువు పడ్డప్పుడు బయల్దేరే గాలిబుడగలు నీటినుంచి బయటికి వచ్చేటప్పుడు చేయగలిగిన చప్పుడు కాదు. ఏమంటే, నీటి అడుగుకి ఒక సన్నని గొట్టము పెట్టి బుడగ[illegible]నట్లయితే బుడగ గొట్టాన్ని వదలినప్పుడు చిన్న చప్పుడు వస్తుందికాని, నీటిని వదలి గాలిలోకి వచ్చినప్పుడు శబ్దము వచ్చినట్లే వుండదు. గాలిలోకి వచ్చేముందు రెండు మూడు బుడగలు కలిసిపోతేమాత్రము అలా కలుస్తున్నప్పుడు చిన్న శబ్దము కలుగుతుంది.

ఈ చిత్రము నింకా శోధించవలసి వుంది. బిందువు సైజూ, ద్రవాలూ, వాటి ఉష్ణోగ్రతా, ద్రావణత్వపు ప్రభావమూ, చీకటి వెలుగులలో తేడా, ప్రయోగాలు చేసి కనుక్కోవలసి ఉన్నది.

చిట్టిప్రశ్నల జవాబులు

— మోటారుముందు దీపాల వెలుగు ఆనిన కళ్లకు దారిలో ఉన్న రాయీ రప్పా కనబడనివిధంగానే వెన్నెల వెలుగు ఉన్న రాత్రులలో నక్షత్రాలు చక్కగా కనబడవు. చీకటిరాత్రులలో వేరే వెలుగేదీ వియత్పథములో ఉండదుకనక నక్షత్రాలు చక్కగా కనబడతాయి. గాలిలో వున్న నీటి ఆవిరి మంచుబిందువులుగా దిగిపోయే శీతకాలపు వేకువజాములలో నక్షత్రాలు ఇంకా బాగా కనబడతాయి.

—నీరు మరుగుతూన్నప్పుడు వచ్చే బుడగలు నీటిలో కరిగివుండిన గాలి బుడగలు.

—సృష్టిలో ఏ రెండు జీవములూ సరిగ్గా ఒక్కరీతిగా ఉండవు. పువ్వులూ, పశువులూ, మృగాలూ, కీటకాలూ, అన్నిటికీ వాటిల్లో వాటికి సామరస్యము మాత్రమేగాని సమానత్వము ఉండదు. ఇంతేకాదు. సృష్టిలోని ప్రతీజీవీ అనుక్షణమూ మారుతూవుంటుంది. "అనుక్షణమూ మారుతూన్నా అలాగే కనపడేది ఏది?" అని ప్రశ్న వేసుకుంటే 'ప్రకృతి' అనే జవాబు చెప్పాలి.

—మా వూళ్ళోని నక్కలు ఎన్నిసార్లు గుడ్డలు ముళ్లువేసినా అరవడము మానలేదండీ. మీ రన్నమాట ఎలాగ నమ్మమన్నారు చెప్పండీ. ★

బొమ్మరిల్లు

"కొశ్చన్ మార్క్"

"గోపి"

వసంతకాలపు ఉదయపు ప్రకృతి హాయ్ హాయ్ అనిపిస్తూంది.

రామాచారీ, రహీమ్‌తుల్లా బయలుదేరి నాలొకపూరు పోతూపోతూ చెరువు వొడ్డునా తటస్థపడ్డారొక చోట మాటా, మంతీ; పూసూ, కబురూ మార్గాయాసం బాపింది.

కతిపయ దూరంపోయినాక ఒక తులసిమొక్క కనిపించింది.

భక్తి ప్రపత్తులు ఇనుమడింపగా రామాచారీ మొక్కాడు

"హిహిహీ, హిహిహీ, క్యారేచారీ, నీకీ దిమాగ్ ఖరాబ్ హై?"

తుల్‌షీ మొక్కా, చూషీ, నీకీ మతీ గితీ గయారే క్యా?"

అంటూ రహీమ్ తులసి మొక్కనీ కూకటి వ్రేళ్లతో పెరికాడు.

రాహీమ్‌తుల్లా పిచ్చి చేష్టకీ రామాచారీ వగచాడు ఏమిటిచెప్మా తగిన ఉపాయం దీనికి అంటూ కుందాడు దిగ మ్రింగిన పటు దుఃఖంతోనే అడుగులు ముందుకి వేశాడు

అల్లన మెల్లన అడుగులువేస్తూ, రహీమ్ కూడా నడిచాడు

పోగా పోగా రామాచారికి దూలగొండి కనిపించింది.

దూలగొండి కనబడ్డంతోనే సాగిలబడి ప్రణమిల్లేడు లేచి, దులుపుకొని, రెండు చెంపలూ మృదంగ వాద్యం చేశాడు.

రహీమ్‌తుల్లా కోపప్రవాహం కట్టలు తెగి పరుగెత్తిందీ పళ్ళు కొరుకుతూ, ఒక్క అంగలో దూలగొండి కడకేగాడు

దూర్వాసుడిలా దూలగొండినీ లుంగబట్టి లాగేశాడు కాళ్ళ్రవేళ్ళా కసితీరేలా నలిపి నలిపి వదిలేశాడు

దురదలు, దురదలు, దురదలు, దురదలు రహీమ్‌తుల్లా వొళ్ళంతా!

బరికి. బరికి వొదిలిన వొళ్ళంతా రక్త ప్రవాహం అయ్యిందీ,

రహీమ్‌తుల్లా వదన మండలం ప్రశ్నమార్కులాగయ్యిందీ



"అక్కయ్యోయ్' ఉత్తరం!... ఉత్తరం వచ్చిందేవ్" అంటూ పరుగున వెళ్లి అక్కయ్య చేతిలో పెట్టాడు ఆ వుత్తరాన్ని రామం. ఆ అక్కయ్యకు ఎక్కడలేని సంతోషం వచ్చింది. ఉత్తరం సాంతం చదవకుండానే "మీ బావ వొస్తున్నార్రోయి; రామం! మీ బావ..." అంటూ రామాన్ని అక్కడే వదిలేసి పెరట్లో తులిసి కోటకి సున్నపు బొట్లు పెట్టుతున్న అమ్మ మీద కెళ్ళి పడిపోయింది. రామానికి ఇదేమీ అర్థం కాలేదు. తనకు జ్ఞానమొచ్చిన తరువాత అక్క ముఖంలో ఇంత సరదా ఎప్పుడూ చూడలేదు.

తను రోజూ అక్కదగ్గిరే పడుకుంటాడు. అక్క లేకపోతే రామాన్కి నిద్ర రాదు అక్కే అన్నం తినిపించాలి, అక్కే పడుకోబెట్టాలి, అక్కే బట్టలు తో ుగల త , క్కా! ఐదు నిమిషాలు అక్క కనిపించక పోతే, వాడికి గుండె చిక్కబట్టి నట్లు అయ్యేది నాడు అక్కలో అనుకోకుండా వచ్చిన ఆ మార్పుకు కారణమేమిటో, వాడికేమీ అర్థం కాలేదు. తన అక్కనావిధంగా, ఒక ఉత్తరం ముక్కతో ఒక్క నిమషంలో మార్చివేసిన ఆ బావని గురించి రామాన్కి ఆదుర్దా ఎక్కువయింది.

"అదేవిటె మొద్దా! మడిగట్టుకుని వుంటే మీదపడతావేంటి" అని కసిరింది, వాళ్లఅమ్మ.

"అదికాదే అమ్మా! చూడలేదులేవే...వుత్తరం వచ్చిందే. ."

"ఏం వుత్తరమే? ఎక్కణ్ణుంచీ?"

"అక్కడినుంచే నే! మీ...మీ ...మీఅల్లుడిగారి దగ్గర నుంచేనే..! వుత్తరం వచ్చింది. ఆయన వస్తున్నారట!" ఆమాట చెప్పటానికి అంత ఆత్రపడ్డ జానకి, ఆమాట చెప్పీ చెప్పకముందే ఎగిరి గంతేసి గదిలోకి పోయి, మొఖానికి చేతులు అడ్డంగా పెట్టుకొని కిలకిలా నవ్వింది.

ఏ బావగారి రాక కోసం అక్క అంత మురిసి పోతోందో ఆ బావ గారు రానే వచ్చాడు సూటు, బూటు – అంతా పెద్ద దొరలాగ వచ్చేడు బస్తీనుంచి. తనకి యింత బాగా జ్ఞానం వచ్చాక బావగారిని చూడడం ఇదే మొదటిసారి.

ఆవేళ ఇంట్లో అంతా ఎంత హడావడో చెప్పడాన్కి వీల్లేదు. ఎంత ఎడ్చినా కొత్త బట్టలు తొడగవ్వని తల్లి, ఆవేళ తనే కొత్త బట్టలు పెట్టెలో నుంచి తీసి తొడిగింది. వాళ్లనాన్న ఆవేళ అరటిపండ్లు, ద్రాక్షపండ్లు, ఏపిల్సు తెప్పించాడు.

బావగారికి ప్రత్యేకం అమ్మ, నేతి పెసరట్లు చేసింది. అవి పెనంమీద చుయ్, చుయ్ మనటం మొదలైనప్పటినుంచీ తెగ నోరువూరిపోతూ వుంటే, తనకి దక్కనీయకుండా అక్క ఎగరేసుకు పోయింది, గదిలోకి. తాను ఎంత మారాము చేసినా నేతి పెసరట్టు ముక్క అయినా రుచి చూపించకుండా, ఆపాటు నూని పెసరట్లు ఇవ్వడం రామాన్కి కోపంగా వుంది. పైగా వాళ్ల బావ, ఎంత వద్దటున్నా, అమ్మా నాన్న "తినవోయి" "తినవోయి" అని తెగ బతిమాలి తినిపిస్తున్నారు ఆయనగారిచేత. అయిదేళ్ల జీవితంలో తన్ను ఒక్కసారి కూడా వాళ్లడగలేదు అల్లాగ! ద్రాక్షపండ్లు, ఏపిల్సుకూడా ఆవకే నైవేద్యం పెట్టారు అందరూ కలిసి. తాను ఎంత ఏడ్చినా తనకు దక్కలేదు. ఆఖర్కి ఆ బావ అనే ఆమనిషే తనను పిలచి యిచ్చేడు ఒక్కముక్క.

వాడెవడో ఈవేళ యిక్కడికి కొత్తగావచ్చి, నాకే పందుపెట్ట వస్తున్నాడేమిటి అని పౌరుషం వచ్చేసింది రామానికి.

అసలు ఆరోజు రోజంతా కోపంగానుండి అన్నం కూడ ముట్టనే లేదు. ఎప్పుడూ తనకు అన్నం తినిపించికాని తను తినని అక్క, ఈవేళ అదేమిటో కాని - తను బ్రతికి వున్నాడో లేడో అనేనా చూడకుండా, అస్తమానం ఆకొత్తగా వచ్చిన దొరగారితోనే వుండడం రామాన్కి మరింత కోపం తెచ్చి పెట్టింది. ఆ వుక్రోషంలో వాణ్ణి-అంటే ఆ బావగాణ్ణి, చంపేద్దామని పించింది. కాని-ఎలాగు?

ఏం చెయ్యాలేక ఏడుస్తో కూర్చున్నాడు. ఏడిస్తేనైనా తన సంగతి అక్క పట్టించుకొంటుందనుకొంటే, ఎంతకీ అక్క యీదిక్కైనా చూడలేదు.

రామానికి వచ్చిన కోపం యిక మితి మీరిపోయింది. అక్క సంగతి తేల్చుకోవాలని బయలుదేరాడు. తలుపు తోసుకొని గబుక్కుని అక్కవున్న గదిలోన్కి వెళ్లబోయాడు. తలుపు తెరచేసరికి ఒకదృశ్యం అతనికంటపడింది. దాంతో - అక్కను కొట్టేదామని వచ్చిన వాడల్లా ముందుగా ఆ బావగాడి సంగతెదో తేల్చేద్దామనుకొన్నాడు. "ఏయ్! మా అక్కజడ ఎందుకు గుంజుతున్నావ్" అంటూ పెద్ద గావు కేక వేశాడు. అక్కడితో ఆగక "అమ్మోయి! అక్కను ఈ బావగాడు జడ పట్టుకు గుంజుతున్నాడేవ్! చస్తానరా" అని తల్లిని కేకేసి - ఆవిడను పిలుచుకు రావటానికి కాబోలు - పరుగెత్తాడు. అక్క నాలిక కరుచుకొని గభుక్కుని లేచి, తమ్ముణ్ణి పట్టుకు నేందుకు బయలుదేరింది. ఆ సందడిలో పమిట కిందికి జారి, కాళ్లకు తగుల్కుని పడిపోయింది.

ఈలోగా రామం తిన్నగా తల్లివద్దకు పోయి వార్త నందించేడు. అది విన్న వాళ్లమ్మ "ఛీ వెధవా - అటువేపు వెళ్లావంటే చంపెస్తా!" అని గుడ్లురుమింది. మంచికిపోతే చీవాట్లు తగిలాయి. ఇన్నిటికీ కారణమైన ఆ బావమీద బలే కోపం వచ్చేసింది.-కాని, ఏం చేస్తాడు?

రాత్రి భోజనాలయ్యాయి. అతి బ్రహ్మాండం మీద పోరుబెట్టి అక్క దగ్గరే తిన్నాడు. "అక్క దగ్గరే పడుక్కుంటానే లేకపోతే నీ జడ పట్టుకు గుంజుతాడు ఈ బావ-శ్రకూడా దగ్గిర పెట్టుకుంటాలే! నిన్నేమన్నా చేస్తే తన్నేస్తా" అంటూ జానకిని కొంగుపట్టుకు వదలేడు కాడు రామం.

రాత్రి పదకొండయి పోతోంది. అయినా ఈ రాము జానకిని వదలడే! ఆఖరికి వాళ్ల అమ్మే "ఏడిస్తే ఏడిచాడులేవే, వెధవ" అంటూ బలవంతంగా జబ్బ పట్టుకు లాక్కెళ్లిపోయింది. ఏకధాటిగా గంటసేపు ఏడిచాడు. అందరూ పడుకున్నారు. ఒక్కరూ సముదాయించనైనా లేదు.

రామాన్కి నిద్ర పట్టలేదు. అటు ఇటు దొర్లాడు. ఎంత దొర్లినా ఆ వేదన మాత్రం తగ్గ

హఠాత్తుగా డాక్టరు గారింట్లో టెలిఫోను మోగింది. డాక్టరు గారు "హలో" అని పలికారు.

"డాక్టర్! మా చిన్న బ్బాయి నా ఫౌంటెన్ పెన్ మింగేశాడు," అని అవతలి చివర నుండి ఒక పెద్దమనిషి అన్నాడు.

"అరె! చాలా ప్రమాదమైన విషయమే. నే నిప్పుడే బయల్దేరి వస్తున్నాను. నేను వచ్చేలోగా ఏం చేస్తారు?"

"ఫరవాలేదు. పెన్సిలుతో రాసుకుంటాను లెండి."

కంగారుపడిన రామం

౦. పక్క మీద నుంచి లేచాడు. ...య్య గది వద్దకు, కర్ర పట్టు ... వెళ్లి తలుపు తోశాడు. ఎంత ...నా ఆతలుపు రాలేదు. విసు ...దాకా తలుపు తోసి, తోసి, ...కు ఎప్పటికో నిద్ర వచ్చేస్తే, ...మ్మం వద్దనే అడ్డంగా పడుకొని ...డు.

వాళ్ల అమ్మ తెల్లార గట్టలేచి ...సుకునే సరికి కొడుకు ...లో లేడు. కంగారు పడ్డది. ...మం! రామం!" అని పిలుస్తూ ... గదివద్దకు వచ్చి చూస్తే ...డే గుమ్మంమీద తలపెట్టు ... చేతితో కర్ర పట్టుకొని ...బోతున్నాడు. ఈ లోపుగా జానకికి మెళుకువ వచ్చి, తలుపు తీసింది. గుమ్మానికి అడ్డంగా ఎవరా పడుక్కున్నది అని చూస్తే - రామం! జానకి కంగారు పడిపోయి "రామం రామం" అంటూ లేపింది. రామానికి మెళుకువ వచ్చింది. వచ్చీ రావడంతోనే కర్రను మరింత గట్టిగా పట్టుకొని "వాడు నీ జడ పట్టుకు మళ్లీ గుంజాడా?- చెప్పు! ఈ కర్రతో బాదేస్తాను!" అంటూ జానకి మొఖంలోకి చూశాడు. "ఆరి పిడుగా!" అంటూ ముక్కుమీద వేలేసుకుంది వాళ్ల అమ్మ.

"నా బంగురు తండ్రే- నేనంటే ఎంత ప్రేమరా!" అంటూ జానకి రామాన్ని ఎత్తుకుని హృదయాన్కి హత్తుకుంది.

"నీకు జడ లేదు గానీ - వుంటే నీ జడ కూడా పట్టుకు గుంజేవాణ్ణే" అంటూ ముసి ముసి నవ్వులు నవ్వు కొంటూ గదిలో నుంచి వూడి పడ్డాడు ఆఘునుడు (బావగారు) ★



బొమ్మరిల్లు సీరియల్

డాన్ క్విక్ సెట్

పూర్వ కథ

లామంచా అనే గ్రామానికి చెందిన డాన్ క్విక్ సెట్ అనే వెర్రివెంగళప్ప తానో వీరుడుగా చెలామణీ కావాలనుకొని, శాంకో పాంజా అనే చదువురానివాణ్ణి తన బంటుగా చేసుకొని వీరవిహారాలకు బయలుదేరాడు. ఎవరో ఒక ఆడామెను చూచి ఆమెకు డల్ సీనియా రాకుమారిఅనే బిరుదాన్ని తనమనస్సులోనే యిచ్చేసి, ఆవిడను మెప్పించటంకోసమే తానీ ధర్మరక్షణమనే కఠోరదీక్షను స్వీకరించానని నమ్మాడు. లోగడ డాన్ క్విక్ సెట్ గారు తాను జయించబోయే దీవుల్లో ఒకదానికి శాంకో పాంజాను గవర్నరుగా చేస్తానన్నాడు. వాడా మాట నమ్మి ఆరోజుకోసం ఎదురు చూస్తున్నాడు. ఇలా వుండగా ఒకరోజు వీళ్ళకు ఒక డ్యూక్ దంపతులు తారసిల్లారు. వారికి కొల్లి ద్దరినీ వేళాకోళం చేయాలనే బుద్ధి పుట్టింది. ఆ స్వామినీ, బంటునీ తమ దేవిడీకి తీసుకుపోయి, తిండి అదీ పెట్టి బాగా ఆదరించారు. డాన్ క్విక్ సెట్ గా రిచ్చిన మాటప్రకారం తానే శాంకోపాంజాను బార్ టారియా అనే పట్టణానికి గవర్నరుగా నియమించాడు. ఆడ్యూక్ గారు చేసిన ఏర్పాట్ల ప్రకారం, శాంకో పాంజాగారు గవర్నరు అయిన ఎనిమిదో నాటి రాత్రి, గవర్నరు భవనంమీద పెద్ద దండువచ్చి పడ్డది. ఆగలభాలో శాంకో పాంజాగారికి వున్న ధైర్యం సడలిపోయి, గవర్నరు పదవికి రాజీనామా యిచ్చి తన యజమాని డాన్ క్విక్ సెట్ గారిని కలుసుకొనేటందుకు బార్ టారియా పట్టణం నుంచి బయలు దేరాడు.

20

గవర్నరు పదవిని త్యజించి తన స్వామిని వెదుకొంటూ బయలుదేరిన శాంకో పాంజా, ప్రొద్దుక్రుంకే వేళకు యింకా మార్గమధ్యంలో వున్నాడు కన్ను పొడుచుకొన్నా కానరాని కటిక చీకటిలో, ఆగకుండా ప్రయాణం చేయవలసిన తొందర ఏమీ లేదు కాబట్టి, ఆరాత్రికి అక్కడే ఎక్కడన్నా నడుము వాలుద్దామని అనుకొన్నవాడై, రాజబాటను వదిలి, గాడిదను ప్రక్కనవున్న డొంకల్లోకి మళ్లించాడు. ఆ డొంకల్లో ఆట్టేదూరం పోకముందే శాంకో పాంజా, 'డాపుల్' కూడా బలవంతంగా చావవలసి నంత పని అయింది.



చీకటీ అంత దట్టంగా వున్నందువల్లా, ఆ బాటలు ఆయనకు అంతకుముందు పరిచితమైనవి కాక పోయినందు వల్లా, ఆయన గాడిదతో పాటుగా ఒక పెద్ద అగాధంలో పడిపోయాడు. అది బాగా ఐదు, ఆరు నిలువల లోతు వున్నది. అంతలోతు అగాధంలోనూ పడిపోతూ కూడా, శాంకో పాంజా, డాపుల్ మీది నుంచి తనుమాత్రం పడిపోకుండా చూసకొన్నాడు. ఇంతకీ ఆగాడిద లేచిన వేళా విశేషం మంచిది కాబట్టి, అంతతోనే సరిపోయింది. అంత పాటు పడ్డాక కూడా ఆగాడిద అడ్డదిడ్డంగా పడి, తన

మూలం: సెర్వాన్‌టిజ్ ★ అనువాదం: శ్రీ విశ్వాత్ముల నరసింహమూర్తి

★ డాన్ కిక్ సెట్ ★

వొళ్లంతా గాయాలు చేసుకోకుండా, నాలుగు కాళ్లూ సరిగ్గా నేలకు ఆనించి నిలబడి పోయింది. ఆగాడిద తీసుకొన్న ఆ జాగ్రత్త మూలంగా, దానివీపు మీద కరిచిపెట్టుకు కూర్చొన్న శాంకో పాంజా గారికి కూడా గోరంత గాయమైనా తగలలేదు.

అగాధం అడుగు భాగానికి సురక్షితంగా చేరామన్న విషయం బాగా రూఢిఅయిన అరగంటకు, శాంకో పాంజా మూసిన కళ్లను తెరిచి, చుట్టూ కలయ చూశాడు. యీ చీకటి కోణంలో నుంచి బయటకు పోయేందుకు ఏమూలనైనా మార్గం వున్నదేమోనని, ఆ చీకటిలోనే చుట్టుపట్లవున్న ప్రదేశాన్నంతటినీ చేతులతో తడిమి చూశాడు. ఎక్కడా ఏమీ మార్గం వున్నట్లు తోచలేదు. మనిషి నీరు గారిపోయి వుసూరు మంటూ ఒకమూల జేరగిల బడిపోయాడు.

అంతపాటు పడ్డప్పుడు పోయిన స్ఫురణ ఆ 'డాపుల్'కు యిప్పటికి కానీ వచ్చినట్లు లేదు-ఆపాటు వల్ల పైకి కనపడని గాయాలు దానికి ఎన్ని తగిలాయో యేమోకానీ—అది ఒకటే గోడుగా ఓండ్ర పెట్టటం మొదలు పెట్టింది. అది ఆవిధంగా ఓండ్రపెట్టి నప్పుడల్లా, శాంకో పాంజాకు గుండెలో గాలం వేసి తిప్పినంత బాధ పుట్టుకొచ్చింది.

ఆగాడిదను చూసి తాను ఎంత జాలిపడి, ఎంతగా కుమిలి కుమిలి ఏడిస్తే మాత్రం, యీ అర్ధ రాత్రివేళ, ఈ చీకటి కోణంలో దాని బాధను తను ఎలా తగ్గించగలడు? ఇక రాత్రిలో మిగిలిన భాగ మంతా ఓపికగా యిక్కడే గడపటంకంటె గత్యంతరం లేదు. సూర్యోదయమైతేనైనా, ఆ వెలుగును బట్టీ బయటకు పోయేమార్గం ఎక్కడ వున్నదీ తెలుసుకోవచ్చు.

అంతవరకు యిక్కడే పడివుండటం కంటే చేసేదేమీ లేదని తెలుసుకుని బరువుగా నిట్టూర్చాడు.

అలా నిట్టూర్పులతోనే రాత్రి అంతా గడిపాడు. తెల్లవారింది. తెల్లవారటమైతే తెల్లవారింది కానీ, అందువల్ల యీయనకు ఒరిగిపడ్డ మేలు ఏదీ జరుగలేదు. కాకపోగా యీ ఆగాధంలో నుంచీ బయట పడట మన్నది ఎప్పటికైనా ఎవరైనా భూమి మీద తిరిగే మనుష్యులు తనను గమనించి, కనికరించి, పైకి లాగితేనే సాధ్యం అవుతుంది కానీ, తాను మాత్రం ఎంత ప్రయత్నించినా ఈ అగాధాన్ని ఎగ్రబాకి పోలేడని తేలిపోయింది.

ఎటువంటి స్థితిలోనూ మనిషి అన్న వాడికి ఆశ అన్నది లేకుండా పోదుగా! రెండు చేతులను దొప్పలాగ మడిచి నోటిమీద పెట్టుకొని, వూపిరి తిత్తులు చిరిగి పోయేటంత బిగ్గరగా కేకలు పెట్టటం మొదలు పెట్టాడు. ఆపని అయినా ఎంతసేపని చేయగలడు? తాను పూర్తిగా అలసిపోవటమే తప్ప అందువల్ల పీసమెత్తు ప్రయోజనం లేకపోయింది. మనిషి అన్న వాడెవ్వడూ యిటు తొంగి అయినా చూడలేదు.

ఇప్పట్లో బయట పడగలనన్న ఆశ నిరాశకాగా అతని దృష్టి 'డాపుల్' వైపుకు మళ్లింది. పాపం-దానికి ఎంత బాధగా వున్నదో ఏమో, తనంతట తను లేచి సరిగ్గా నాలుగు కాళ్లమీదా నిలబడలేక పోతున్నది. ఆస్థితి చూసేసరికి శాంకో పాంజాగారికి మళ్లీ కళ్లనీళ్ల పర్యంతం అయింది. తానే పోయి, ఎలాగో తంటాలుపడి తనశక్తి సామర్థ్యా లన్నింటినీ వుపయోగించి, దానిని లేవదీసి నిల్చోబెట్టాడు.

'డాపుల్' కోసమని బారటారియా ప్రజలు యిచ్చిన వులవలు నిన్నటితోనే అయిపోయాయి. ఇప్పుడు దానికింత తినటానికి పెడదామన్నా పెట్టితే నైనా కాస్త కోలుకొంటుందేమో అనుకొంటే, ఆ వులవలూ లేవాయె. మళ్లా ఎప్పటికి అవి దొరుకుతాయో, తాను మళ్లీ ఎప్పటికి ఆగాడిదకు ఆప్యాయంగా తిండి పెట్టగలడో తెలియని అయోమయ పరిస్థితి. ఏమి చెయ్యటానికీ అతనికి తోచలేదు. ఆలోచించాడు. తెగ ఆలోచించాడు.

చివరకు ఒక ఆలోచన తట్టింది. తను తినటం కోసం అక్కడ ఆబారటారియా నగరంలో కొంత రొట్టెముక్కను అడిగి పుచ్చుకొన్నాడు కదా! అందులో యింకా కొంత మిగిలివుంది. దానిని తానూ యింత పీక్కు-తిని, ఆచేత్తోనే ఆగాడిదకు కూడా చిన్న చిన్న తుంపులుగా తుంచి పెట్టాడు. అలా దాని నోటికి రొట్టెముక్కలు అందిస్తూనే "ఏపాటు తప్పినా సాపాటు తప్పదన్నారు. అదీ కాకుండా మనసు కలత పడి నప్పుడు కడుపుకు యింత పడవెయ్యమని కూడా పెద్దలు అన్నారు. తినదగినది యిది అయినా ఒకటి దగ్గిరవున్నది కనుక తిను" అంటూ ఆ గాడిదను బుజ్జగించాడు. మరి ఆగాడిదకు వీడు ఆడిన ఈమాటలు ఏమైనా అర్థమైనాయో, ఏమో, - ఎంతసేపటి నుంచో మాటి మాటికీ మూలుతున్నదల్లా మానేసింది!

కడుపులో కాస్తంత తిండి పడేటప్పటికి శాంకో పాంజా మనస్సును ఆవరించిన మేఘాలు కొద్దిగా సర్దుకొన్నాయి. ఈ బిలంలో నుంచి బయట పడేందుకు మార్గం ఎక్కడైనా లేకపోతుందా అన్న ఆశతో దీక్షగా మళ్లీ వెదకటం ప్రారంభించాడు. అలా వెదుకగా వెదుకగా, ఒకమూలను ఓమాదిరి పెద్ద రంధ్రమొకటి వున్నట్లు తోచింది. శాంకో పాంజా తానొక్కడూ ముందుగా ఆ రంధ్రం గుండా పోయి చూతామని ప్రయత్నించాడు. ఆసందు అంతకంతకూ యిరుకై, వొంగుని నడవటానికి కూడా కష్టమై పోయింది. చేతులుకూడా నేలకు ఆనించి, నాలుగు కాళ్ల జంతువులా ముందుకు పాకి పోయాడు. అలా పోగా పోగా కొంతసేపటికి ఒక విశాలమైన ఆవరణలో తేలాడు. దానికిపైగా ఒక రంధ్రం వున్నట్లున్నది: అందులో నుంచి సూర్యరశ్మి పెద్ద దూలంలా వచ్చి నేలమీద పడుతున్నది. దానిని చూసేసరికి శాంకో పాంజా ప్రాణం లేచి వచ్చింది. గబగబా పరుగెత్తుకొంటూ పోయి తలపైకెత్తి చూశాడు. నిర్మలమైన ఆకాశం కంట పండేసరికి మనిషి వుప్పొంగిపోయాడు. మళ్ళీ వెనక్కి ఆ రంధ్ర గుండా పాకుతూపోయి, తనూ తన గాడిద వచ్చేటందుకు వీలుగా, ఆ రంధ్రాన్ని పెద్దరాతి మొనతో తొలిచి వెడల్పు చేయటానికి పూనుకొన్నాడు. ఈపని గంట, గంటన్నర పట్టింది. ఎట్టకేలకు గాడిద కళ్లేన్ని పట్టుకొని, తను వంగి నడుస్తూ ఆ రంధ్రంలో నుంచి యివతలకు వచ్చి పడ్డాడు.

★ డాన్ క్విక్ సెట్ ★

ఇలాగే, మరొక దారి కనుపించక పోతుందా, అందులో నుంచి బయటకు వెళ్లి ఈ సజీవ సమాధి తప్పించుకోలేక పోతామా, అన్న ఆశ ఒకటి ఆతని మనస్సులో పాతుకుపోయింది.

దారులు వెదికే ప్రయత్నంలో శాంకో పాంజాగారు క్రింద మీద పడుతూ వుండగా, అక్కడ వీరకేసరి డాన్ క్విక్ సెట్ గారి విషయం ఏమైందో కొంచెం చూద్దాం.

సరిగ్గా ఆరోజు వుదయాన్నే వీరకేసరి గారికి 'ఒకింత వీర విహారము సల్పి రావలెనన్న' కోరిక కలిగింది. ఆమాట 'డ్యూక్' గారితో చెప్పి, ఆయన అనుమతి మీదనే, భవనం వదలి బయలుదేరాడు-తన ముద్దుల ముసలి గుర్రం 'రోజి నాన్‌టే'ని ఎక్కి. కోడి కూతతో బయలుదేరిన వాడు. అప్పటినుంచీ మొదలుకొని బాగా ఎండ ఎక్కేదాకా, అడ్డమైన చోట్లా తిరిగి, ఏవేవో భూతాలు ప్రేతాలు రాక్షసులు తన మీదకు విరుచుకు వచ్చినట్లు, తాను వాళ్లనందరినీ ఒక్క కత్తి వేటుతో పడగొట్టినట్లు వూహించుకొని, కులుకుతూ డ్యూక్ భవనం వైపుకు వెళ్తూ, ఆ వుత్సాహంలో తన గుర్రాన్ని ఒక అగాధంమీదికి తోలాడు. సమయానికి గనుక తను మేలుకోక పోతే, తాను తన గుర్రమూ కూడా-ఆ శాంకో పాంజా, వాడి గాడిదా పడ్డట్టే – గోతులో పడేవాళ్ళే. అన్నట్లు - శాంకో పాంజా పడివున్న గొయ్యి కూడా అదే. త్రుటి మాత్రంలో జరుగవలసిన ప్రమాదం వెంట్రుకవాసిలో తప్పిపోయిందని తెలిశాక, డాన్ క్విక్ సెట్ గారి గుండె ఒకసారి ఆగిపోయి, మళ్లా మహా వేగంగా కొట్టుకోవటం మొదలు పెట్టింది: ముచ్చెమటలు పోసేశాయి.

గుర్రం దిగి ఆగొయ్యి ఎంతలోతు వున్నదో, అందులో గనక తనూ తన గుర్రమూ పడివుంటే ఎంతలావు ప్రమాదం జరిగేదో చూడ వచ్చాడు. తీరా గొయ్యి దగ్గిరకు వస్తే, అందులో నుంచి ఏవేవో మనుష్యుల మాటలు 'గుంయి' 'గుంయి' మంటూ వినిపించాయి. డాన్ క్విక్ సెట్ గారు చాలా ఆశ్చర్యపోయాడు. ఈగోతిలో ఏదో భయంకర రాక్షసి దాక్కొని వున్నదనీ, దానిని యిప్పుడు బయటకు లాగి బుద్ధిచెప్పే అవకాశం తనకుయిలా వాళ్లో వచ్చి పడుతున్నదనీ అప్పుడే వూహించుకొన్నాడు.

"పైన ఎవరైనా మానవ మాత్రులు వున్నారా! ఈ చీకటి కోణంలోపడి సజీవ సమాధి అయిపోతున్న మాజీ గవర్నరుపై కనికరించి పైకి తీయగల కరుణామయులెవరు లేరా ?" అంటూ శాంకో పాంజా భూమి అడుగునుంచీ తెగ గగ్గోలుగా అరుస్తున్నాడు. ఆ అరుపుల మధ్యను ఎక్కిళ్లు కూడా వినవస్తున్నాయి.

ఆమాటల తీరు, ఆ గొంతూ అదీ వింటూ వుంటే డాన్ క్విక్ సెట్ గారికి అది శాంకో పాంజా గొంతేమో నన్న అనుమానం తగిలింది. అనుమానం తగిలీ తగలటం తోటే, మనిషి కంగారెత్తి పోయాడు. ఆ అగాధంలోకి వంగి "ఎవరు వారు ? సహాయ మర్థించు ఆకంఠ మెవ్వరిది?" అని బిగ్గరగా అడిగాడు.

"ఇంకెవరండీ. దౌర్భాగ్యుడు శాంకో పాంజాకు తప్పితే యింతటి దుర్గతి మరెవ్వరికైనా పట్టుతుందా! లామంచా వీరుడు డాన్ క్విక్ సెట్ గారి బంటుగా బ్రతుకుతూ, లేనిపోని ఆశలకు పోయి 'బారటూరియా' దీవికి గవర్నరు గిరీ వెలిగించి నందుకు, యింతటి శిక్ష అనుభవించటం శాంకో పాంజాగాడి కొక్కడికే తగు" నంటూ తనపై తనకే పుట్టుకొచ్చిన రోతను కూడా వెళ్ల గ్రక్కుతూ బదులు పలికాడు.

ఈమాటలు వినేసరికి డాన్ క్విక్ సెట్ గారి ఆశ్చర్యం రెండింతలైంది. ఆ పలుకుతున్న మనిషి నిజంగానే శాంకో పాంజా అవునా ?- అధవా, శాంకో పాంజాయే అయితే, గవర్నరుగా వెళ్లినవాడు భూమి అడుగుకి ఎల్లా వచ్చాడా అనీ, ఆయన తికమక పడ్డాడు. ఇందులో ఏదో నిగూఢమైన రహస్యం యిమిడి వుంటుందని తోచినమీదట, "నీవు నిజముగా ఎవరో, యిందు ఎట్లు ప్రవేశించితివో, యిప్పుడు నీ వితరుల వల్ల నపేక్షించు సహాయ మెట్టిదో, వేగమె వివరింపుము" అంటూ గద్దించి అడిగాడు శాంకో పాంజా.

భూమి అడుగున వున్న శాంకో పాంజాకు

యిప్పటికి అనుమానం తగిలినట్లుంది - "అరె! గొంతు, భాషలనుబట్టీ చూస్తే, తాము వీరకేసరి డాన్ క్విక్ సెట్ గారేననిపిస్తుంది. నిజంగా నాస్వామి డాన్ క్విక్ సెట్ గారేనా అక్కడ వున్నది?" అంటూ తన ఆశ్చర్యాన్నంతటినీ వెళ్ళగ్రక్కే విధంగా అడిగాడు.

ఇంతదూరం వచ్చాక కూడా సొరంగంలో యిరుక్కుపోయిన వ్యక్తి, నిజంగానే శాంకో పాంజా అయివుంటాడన్న నమ్మకం డాన్ క్విక్ సెట్ గారికి కుదరలేదు. "ఔను! ఏను వీరకేసరి డాన్ క్విక్ సెట్ గారినే! కానీ - నీవు నిజముగా ఎవరివో, నాకు బోధపడక యున్నది. కాన యిప్పటికైనను నీ నిజనామము నెరుకపరచి, నీ వపేక్షించు చుండు సహాయమును నాచే పొందుము." అన్నాడు.

దీంతో శాంకో పాంజాకు తల తిరిగి పోయింది. ఈ సజీవ సమాధిలో నుంచి బయటపడే అదృష్టం యిక లేదని నిరాశ చేసుకొని, మనుష్యమాత్రుడు ఎవరైనా యీ దిక్కు రావటమే అసంభవమేమో అని అనుకొంటూ వుండగా, సాక్షాత్తు తన స్వామి డాన్ క్విక్ సెట్ గారే తారసిల్లినందుకు వాడు సంతోషిస్తూ వుండగా, అట్టి డాన్ క్విక్ సెట్ గారే 'నీవు శాంకో పాంజావు అవునో కాదో ముందుగా చెప్పుమ'ని ఎన్నిసార్లు చెప్పినా వేధిస్తూ వుంటే—పాపం—ఆ శాంకో పాంజాకు తల తిరిగిందంటే ఆశ్చర్యం ఏముంది! ఎలాగైనా సరే, తను శాంకో పాంజాయేనని ఆయనకు నమ్మకం కలిగేటట్లు చెయ్యగలిగితే అంతేచాలు ననిపించి "దైవ సాక్షిగా నేను శాంకో పాంజానే నండీ, మహాశయా! నిన్న - అంటే —నిన్ననే ఆ దిక్కుమాలిన గవర్నరు గిరీకి రాజీనామా యిచ్చేసి తమరిని కలుసుకొందామనే యిటు తగలడ్డాను. చీకటిలో ప్రయాణం చేయటం ఎందుకులెమ్మని నాగాడిదను ప్రక్కదారికి పట్టించి వస్తూండగా యీ చీకటి కోణంలో నేనూ, నాగాడిదా యిద్దరమూ అమాంతం పడిపోయాం. ఇదుగో చూడండి! నా గాడిద కూడా యిక్కడే వుంది. ఎంతో ఆశతో మీ గొంతు వినవచ్చే దిక్కే చూస్తోంది." అన్నాడు.

శాంకో పాంజా అంటున్న యీ మాటలు ఆగాడిదకు అర్థమైనాయేమో నన్నట్లుగా, అది పెద్ద ఆక్రందనాలు మొదలు పెట్టింది. ఇంత సేపటి నుంచీ శాంకో పాంజా అంత గోలపెట్టి చెప్పుతున్నా, వాడు నిజంగానే శాంకో పాంజాయేనన్న నమ్మకం కుదరని డాన్ క్విక్ సెట్ గారికి, ఆగాడిద అరుపులు వినేసరికి, తక్కున నమ్మకం కుదిరి పోయింది. గాడిద అరుపును బట్టే ఆయన పోల్చుకొన్నాడు-ఆగాడిదను అంట పెట్టుకొని వుండే ప్రాణి శాంకో పాంజా తప్ప వేరెవ్వరూ కాలేరని.

"అట్లయిన నీ వొకింత దనుక యిందే వుండుము. నేనిదే పోయి, డ్యూక్ గారి నడిగి, కొంత మందిని మనుష్యులను వెంట బెట్టుకొని వచ్చెదను" అంటూనే పరిగెత్తుకొంటూ పోయి, ఎగిరి గుర్రంమీద ఎక్కి కూర్చొని, హుటాహుటిని డ్యూక్ భవనం చేరాడు. అక్కడ పదిమంది మనుష్యులను కూడ గలుపుకొని కొన్ని మోకులు, తాళ్లు, కర్రలు, గిలకలు పట్టించుకొని, యీ గుంట వద్దకు వచ్చాడు. వచ్చీ రావటమే తడవుగా, ఆ మోకులు అవీ దింపించి, నానా యాతనలు పడి, చివరకు ఎల్లాగైతే నేం శాంకో పాంజాను, ఆతని గాడిదనూ పైకి లాగించాడు. పగటివెలుగు కంటబడి, పైరు పొలాల మీదినుంచి వచ్చేగాలి తగిలేసరికి, శాంకో పాంజాకు సొమ్మసిల్లినంత పని అయింది.

ఈలోగా ఆ గుంట దగ్గర పెద్ద గుంపు జేరి పోయింది. బావిలో పడ్డమనిషిని పైకి తీసినంత యిదిగా వాళ్ళందరూ ఆవేడుకను చూస్తూ వుండిపోయారు. శాంకో పాంజా కోలుకొన్నాక, తాను ఎటువంటి పరిస్థితులలో గవర్నరు గిరీని వదిలేశాడో అదంతా డ్యూక్ గారికి నచ్చచెప్పటానికి గాను భవనానికి పోదామన్నాడు. ఇద్దరూ వాహనాలు ఎక్కి బయలుదేరారు. జనం కూడా వీళ్ల వెనకాలే డ్యూక్ భవనం దాకా వచ్చారు.

తీరా భవనాన్ని సమీపించి సింహద్వారం మీద కాలు పెట్టేసరికి, శాంకో పాంజా వెంటనే డ్యూక్ సమక్షంలోకి పోవటానికి ఒప్పుకోలేదు. తనతో పాటు ఆ అగాధంలో పడిపోయిన ఆ డాపుల్ విషయం ముందుగా చూడవలసిన బాధ్యత తనపై

బొమ్మరిల్లు కొత్తసీరియల్

డాన్‌క్విక్సెట్ సమాప్తికాగానే రచించిన అను చిన్న నవల అనువాదం బొమ్మరిల్లులో సీరియల్‌గా ప్రచురించబడుతుంది. టామ్‌సాయర్, రాజూ పేదా, హకల్‌బెరీ ఫిన్ సీరియల్ నవలల్ని చదివిన పాఠకులు మార్క్‌ట్వేన్ రచనావిధానాన్ని, హృద్యమైన వ్యక్తి చిత్రణాన్ని మరిచిపోజాలరు. మార్క్‌ట్వేన్ రచించిన మరొక చక్కని నవలను మా పాఠకులకు అందచెయ్యగలుగుతున్నందుకు ఆనందిస్తున్నాము. ఈ నవలకూడా పిన్నలను పెద్దలను రంజింప చెయ్యగలదని మా దృఢవిశ్వాసము.

★ డాన్ క్విక్‌సెట్ ★

వున్నదని చెప్పి, అక్కడవున్న కొందరు నౌకర్లను బ్రతిమాలి, ఆగాడిదకు యింత మంచిరకం గడ్డి పెట్టించి, మంచినీళ్లు తాగించి, చల్లని చోట కట్టేసి, దాని వెన్ను కాసేపు నవిరించి మరీ వచ్చాడు.

అప్పటి కప్పుడే డ్యూక్ దంపతులకు శాంకో పాంజా గవర్నరుగిరీకి రాజీనామాను యిచ్చిన విషయమూ, వస్తూ వస్తూ ఆగుంటలో పడిపోయిన విషయమూ, డాన్ క్విక్‌సెట్‌గారు వాణ్ణి వుద్ధరించిన వైనమూ అన్నీ, వారి నౌకరులవల్ల తెలిసి పోయాయి. ఐనప్పటికీ శాంకో పాంజా తన యజమానితో బాటుగా వచ్చి, తాను డ్యూక్ భవనం వదిలి వెళ్లినది మొదలు యీక్షణం వరకు జరిగిన అన్ని విషయాలూ, ఎక్కడా దాపరికం లేకుండా పూస గుచ్చినట్లు చెప్పకుపోతూ వుంటే, వాళ్లు ఆ విషయా లన్నిటిని అదే ప్రథమ పర్యాయం వింటున్నప్పుడు ఎంత శ్రద్ధగా వింటారో, అంత యిదిగానూ విన్నారు.

శాంకో పాంజా అంత నిష్కల్మషమైన హృదయంతో, ప్రతి చిన్న విషయమూ జరిగింది జరిగినట్లు చెప్పకు పోతుంటే, డ్యూక్‌గారి మనస్సు కరిగి పోయింది. ఈషన్మాత్రమైనా కపట మెరుగని యీ శాంకో పాంజాకు యింకేదైనా మంచి వుపకారం చేయాలనిపించింది ఆ డ్యూక్ గారికి. శాంకో పాంజా తన దీనగాథను చెప్పటం ముగించే సరికి, డ్యూక్‌గారు వున్నచోటినుంచి అమాంతం లేచిపోయి, ఆతణ్ణి గట్టిగా కౌగలించుకొని, గవర్నరుగిరీని ఆతడు అంత త్వరలోనే త్యజించి నందుకు తన విచారాన్ని వెల్లడిస్తూనే, తన యిలాకాలో ఆ గవర్నరుగిరీ కంటె కష్టం తక్కువైనదీ, లబ్ధి ఎక్కువ వచ్చేదీ అయిన నౌకరీ వేరేదైనా త్వరలో ఏర్పాటు చేస్తానని మాట యిచ్చాడు. డ్యూక్ భార్యగారికి కూడా శాంకో పాంజాను ఆస్థితిలో చూస్తే చాలా జాలి పుట్టుకొచ్చింది. వంట మనుషులను, ఆస్థాన వైద్యులను ప్రత్యేకం పిలిపించి, శాంకో పాంజాగారికి యిష్టమైన పిండి వంటలన్నీ వండి పెట్టమనీ ఆవంట వాళ్లకూ, ఆయనకు తగిలిన దెబ్బలకు మంచి మందులు వేసి చప్పున నయం చేయమని ఆస్థాన వైద్యులకూ హుకుములు వేసింది.

శాంకో పాంజాకు ఆ వైభోగమైనా అట్టే కాలం అబ్బలేదు. ఏ నమ్మిన బంటు శాంకో, పాంజా గాడి కోసమైతే తాను యింతకాలమూ కలవరిస్తూ, ఆవియోగ భారాన్ని భరించలేక కుమిలిపోతూ

(41-వ పేజీ చూడండి)

వక్కపొడి

అవి మేము S. S. L. C. చదివే రోజులు. మా వూళ్లో హైస్కూలు లేదు. దగ్గర్లోనే-అంటే రెండుమైళ్ల దూరంలో వుండే వెలంపాడు హైస్కూలుకి మావూరి పిల్లలంతా, మొత్తము నూటపాతిక మంది, రోజూ పోయి వస్తూవుండే వాళ్లం. అందులో పెద్దకారు, చిన్నకారు అని రెండు చీలికలు. రెండు చీలికలలో మళ్ళీ జట్లు జట్లుగా చీలేవాళ్లం. మాజట్టు ఆరుగురం.

నాకు ఒక దురలవాటు వుంది లెండి. అప్పటికి, యిప్పటికి, ఎప్పటికి కూడా అది పోవటం కష్టమే! ఆ దురలవాటు - అదేనండి వక్కపొడి తెగ నమిలేస్తాను. ఈవిషయం చివరకు మా లెక్కల మాస్టారికి కూడా తెలిసిపోయింది. మా లెక్కల మాస్టారు చాల మంచివారు. కొట్టకుండా తిట్టకుండా ఏమనిషిదురలవాటునైనా యిట్టే మాటలతో మార్చేస్తారు. అట్లాగే నన్ను ఆయన క్లాసులో వక్క నమలకుండ చేశాడు. నాకు వక్క నోట్లో లేకపోతే అదేమిటో పిచ్చెక్కినట్లుంటుంది. అందుకని ఆయనక్లాసులో నిద్ర పోవటం మొదలుపెట్టా. అదీ మానిపించారు. ఇక యిది గాదురా పని అని నాకు నిద్దుర వచ్చినప్పుడల్లా క్లాసునంతా అయిదు నిమిషాలు నవ్వేటట్లు చేసేవాడ్ని. చెప్పబోయే కథ అటువంటి ఘట్టాల్లో ఒకటి.

ఆరోజు బుధవారం. లెక్కలు రెండోపీరిడు. మొదటి పీరిడు అయిపోగానే అర్ధణా యిచ్చి వక్కపొడిపొట్లాం తెచ్చి వేసుకొని నములుతున్నా. మాస్టారు వచ్చారు.

"ఏమోయి! కృష్ణయ్యా నువ్వు తినే గడ్డి ఏమిటి?" అన్నారు.


"ఏమి లేదండి" అంటూనే బయట తుపక్కున వుమ్మేశా. (మనం కూచునేదీ వెనక బెంచీయే లెండి) వుమ్మేశాను కదా అని నావంక చూచి నవ్వుతూ 'జాగ్రత్త' అన్నట్టుగా చెయ్యి వూపారు. నేను మాట్లాడకుండా వూరుకున్నాను.

ఆ క్రిందటి రోజున "ఘనము" మీద లెక్కలు చెప్పి (లెక్కలు చెప్పటంలో యీయన ధణుతు లెండి)-యింటికి కొన్ని లెక్కలు యిచ్చారు. నేను హోంవర్కు చెయ్యలేదనుకునేరు! మానాన్న వాళ్ళో వున్నారూ అంటే, నేను హోంవర్కు చేసికొచ్చానని వేరే చెప్పక్కర్లేదు. దగ్గర కూర్చొని లెక్కలన్నీ చేస్తేగాని వదలరు మా నాన్న, యింటిదగ్గర.

మాస్టారు బోర్డుమీద లెక్క వేస్తున్నారు. నిన్నటి లెక్కలు బోధపడనివాళ్ళకు చెపుతున్నారన్నమాట. ఆ లెక్కలో పెద్ద దిమ్మ, చిన్నదిమ్మ ఘనములు కట్టాల్సి వచ్చింది. నాపక్కనవున్న రామారావు బోర్డువంక చూస్తూ పుస్తకంమీద ఎక్కించేస్తుండగా నాకు ఒక హుషారైన ఆలోచన తట్టింది. అతను ఎన్నిచోట్లయితే 'పెద్ద డిమ్మ' 'చిన్నదిమ్మ' అని వ్రాశాడో, అన్ని చోట్లా 'ది' అనే అక్షరం కనపడకుండా కొట్టేయటం మొదలుపెట్టా. మేష్టారు బోర్డువంక తిరిగి వ్రాస్తున్నారు. రామారావు కూడా బోర్డువంకే చూస్తూ మాస్టారి సీమసున్నంలోంచి వూడిపడుతున్న అంకెలు, అక్షరాలు అన్నీ గ్రక్కున ఎక్కించేస్తున్నాడు. మాస్టారు బోర్డుమీద లెక్క పూర్తిచేసేటప్పటికి మనవాడు కూడా లెక్కపూర్తిచేశాడు. నేను 'ది' లు కొట్టివెయ్యటమూ

మేష్టారు క్రికెట్ పోటీమీద కాంపోజిషన్ రాయమని క్లాసులో కుర్రాళ్లతో చెప్పారు. అందరూ ఎవరికి తోచింది వాళ్లు రాయసాగారు. ఒక కుర్రాడు మాత్రం ఏమీ తోచనందున రాయకుండా కూర్చున్నాడు. గంట పూర్తికావస్తోంది. రాయకుండా కూర్చున్న కుర్రాడికి బుర్రలో మెరుపు మెరిసింది. వెంటనే ఇలారాసి ఇచ్చాడు: "కుంభవర్షం కురిసింది. క్రికెట్ పోటి వాయిదా పడింది."

★ వక్కపొడి ★



పూర్తిచేశా. వాడది చూసుకోనే లేదు.

పిల్లలను లెక్క ఎక్కించుకో మన్నారు మాష్టారు. నేను ఖాళీగా కూచోటం చూసి నన్నడిగారు. నేను యింటిదగ్గరే చేసుకొచ్చానని చెప్పా. నా పుస్తకము చూశారు. లెక్క బాగానే వుంది. నాప్రక్కనే వున్న రామారావుని పుస్తకం పట్టుకు రమ్మన్నారు. వాడు పెద్ద ఠీవిగా లేచి పుస్తకం తీసికెళ్లి మాష్టారి కిచ్చాడు. ఆ పుస్తకం చూసీ చూడటంతోటే ఆయనకు అదేపనిగా నవ్వు వచ్చింది; నవ్వేశారు. ఆయన ఎందుకు నవ్వుతున్నారో నాకు తెలుసు గనక నేనూ నవ్వేశాను. రామారావు తెల్లముఖము వేశాడు. మాష్టారికి తెలుసు-అటువంటి పనులు మనము తప్ప క్లాసులో యింక ఎవ్వరు చెయ్యరని.

"ఏమిటయ్యా ! కృష్ణయ్యా! యీపని" అని నన్నడిగారు.

నేను ఆయనఎదుట యింత మటుకు అబద్ధం ఆడలేదు; ఆడలేను కూడా. ఏమీ సమాధానం చెప్పకుండా తలకాయ వొంచుకొని ఓరగా రామారావు వంక చూశాను. వాడు నావంక కొర కొరా చూస్తున్నాడు. నాకు మళ్ళీ నవ్వొచ్చి నవ్వేశాను. మళ్ళీ మాష్టారూ నవ్వారు. ఆ పుస్తకంలో వున్నది వున్నట్లు పైకి చదివారు. 'పెద్దమ్మఘనము' 'చిన్నమ్మఘనము' అని వుంది. క్లాసుపిల్లలంతా, యిప్పుడు మీరు నవ్వుతున్నట్టే, నవ్వేశారు. పాపం! రామారావు అంతమందిలో అవమానం పొందాడు. ఆక్లాసులో మళ్ళా నాకు నిద్దర రాలేదు. తరువాత తరువాత కూడా క్లాసు జరుగుతున్నప్పుడూ, లెక్కల మాష్టార్ని చూసినప్పుడూ నాకు యీ సంగతి జ్ఞాపకంవచ్చి పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వు వస్తూంటుంది.

ఇంత జరిగినా నా వక్కపొడి అలవాటు పోలేదు. మా ఇంట్లో చిన్నపొట్లం (-అంటే అర్ధశేరు నవటాకులెండి-) తెస్తే సరిగ్గా మూడు రోజులు అయినా రాదు. నిజం చెప్పద్దూ-నన్నుగురించి మా నాన్నారు, అత్తయ్యగారు వాళ్లు వక్కపొడి వేసుకోవటం మానుకున్నారు గాని నేను మటుకు మానలేదు సుమండీ!

★

జంతుకోటిలో మానవలక్షణాలు



అమ్మ కజ్జికాయలు చేసి అందకుండా వుట్టిమీద పెట్టిందనుకోండి. అయితే ఏం? - అప్పటికప్పుడే కాకపోయినా, అవకాశం వచ్చిన వెంటనే మాత్రం, పిల్లవాడు ఏకాఎకిని ఆ వుట్టి వద్దకే వెళ్లి, ఎన్ని అవస్థలైనా పడి ఆ కజ్జికాయలను తన్నుకుపోతాడు. జంతువులు కూడా అంతే!

వెనుక ఒకసారి ఒక చింపాంజీ వున్న బోనుకు ఎదురుగుండా చిన్న గొయ్యిని తవ్వి, అందులో దానికి కావలసిన మంచి పండు ఒకటి దాచి పెట్టారుట. ఆ తరువాత $1\frac{1}{2}$ గంటల కాలం గడిచాక చింపాజీని బోనులో నుంచీ విడిచిపెట్టి చూస్తే, అది చేసిన మొట్టమొదటి పని, ఆగొయ్యి వద్దకు వెళ్లి పైమట్టినంతటిని కుళ్లగించేసి, పండును పైకి తీయటమట!

అలాగే ఒక ఎలుకను కూడా పరీక్షచేసి చూస్తే, కొద్ది క్షణాల క్రితం జరిగినపని అయితేనే దానికి గమనంలో వుండటానికి వీలు అని తేలిందట.

ఇంకొక రకమైన పరీక్షలో ఏం చేశారట అంటే - ఒక పెద్ద పెట్టెను తీసుకొన్నారు. ఆపెట్టెలో కుడివైపుకు కొన్ని ఎడమవైపుకి కొన్ని గదులు గదులుగా కట్టి వుంచారు. మొట్టమొదట కుడి వైపున వున్న గదిలో అన్నపు ముద్ద పెట్టితే, మళ్లీ ఎడమవైపు గదిలోనే రెండో అన్నం ముద్దను పెట్టారు అలాగు ఒకముద్ద కుడివైపున పెట్టితే రెండో ముద్ద ఎడమ వైపున పెట్టి, జంతువులను అందులో వదిలిపెట్టి చూశారు. ఒకసారి కుడి వైపు గదిలో అన్నం ముద్ద వుంటే రెండోసారి ఎడమవైపు గదిలో రెండో ముద్ద వుంటుందనే ఈ చిన్న సూత్రాన్ని ఏ జంతువు చప్పున గమనించగలదో పరీక్ష చేయటానికి అన్ని రకాల జంతువులను ఆమాదిరి పెట్టెల్లో విడిచి పెట్టి చూశారట. అలా చేసి చూస్తే-ఒక్క కోతిజాతి తప్ప మిగిలిన ఏ జంతువూ యీ సూత్రాన్ని పసిగట్ట లేకపోయింది.

మనకు జీవితంలో ఎంతకీ విడిపోని సమస్యలు వస్తాయనుకోండి. ఎటు చూసినా కష్ట పరంపరలే తోస్తూ వుంటాయనుకోండి. అటువంటి గడ్డు పరీక్షలు ఎదుర్కోవలసి వచ్చినప్పుడు వీలైనంత మటుకు వాటిని సహిస్తాము. కాని సహనానికి కూడా ఒక హద్దు వుంటుంది గదా! ఆహద్దు దాటితే ఏముందీ! పిచ్చి ఎక్కుతుంది. అలాటి అభాగ్యులు ఎందరు లేరు!

స్తన్యం యిచ్చి శిశువులను పెంచుకొనే గుణం గల జంతువులలో, ఈ మాదిరిగా కొరుకుడు పడని పరిస్థితి వచ్చినప్పుడు, పాంతం పిచ్చి ఎక్కకపోయినా, పిచ్చి ఎక్కేటంత పరిస్థితి అయినా వస్తుందా, లేదా అని కొందరు మానసిక తత్వ శాస్త్రవేత్తలు కొన్ని పరిశోధనలు జరుపుతున్నారు. వీరు జరుపుతున్న ఈ పరిశోధనల మూలంగా జంతువులకు ఏమాత్రంగా ప్రయోజనం వున్నా లేకపోయినా,

జంతుకోటిలో మానవలక్షణాలు

మనుష్యుల మనస్సులకు వచ్చే వికారాలకు కారణాలు, నివారణ సాధనాలు తెలుసుకొని తదను గుణ్యంగా నడుచుకోవటానికి చాలా బాగా వుపయోగపడుతాయని మాత్రం అనుకోవచ్చు.

ఇందుకు ఒక వుదాహరణ: ఒక కోడి గుడ్డుని పట్టుకుపోయి వేరే ఏ పక్షితోనూ జతకూడడానికి వీలు లేని వాతావరణంలో దానిని కృతక పద్ధతులద్వారా పొదిగించి పెంచి చూస్తే, కొద్ది నెలలు గడిచేసరికి ఆకోడి పిల్లకు వుడుకుమోతుతనమూ, కోపిష్ఠి గుణమూ వచ్చేశాయట.

మిచిగన్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ మెయిర్ అనే ఒక ఆయన ఒక ఎలుకతో వింత పరిశోధన ఒకటి చేశాడు. దానికి అంత ఎత్తు దిమ్మమీద నుంచీ ఒక అట్ట మీదికి దూకే అలవాటు చేశాడు. అయితే అక్కడ ఒకటికాక, రెండు అట్టలు పెట్టాడు. అందులో ఒక అట్ట మీద తెల్లనిరంగుతో చుట్టిన సున్నా గుర్తుగా వుంటుంది, ఎలుక గనుక దీనిమీదికి దూకిందంటే, అది ఓ పక్కకు వాలిపోయి, ఎలుకను సరాసరి అన్నం పెట్టిన గిన్నెలో పడవేస్తుంది. తెల్లసున్నా కాక, నల్ల సున్నా వుండే రెండో అట్టమీదకు గనుక దూకిదంటే, అది వాలిపోకుండా అలాగే వుండిపోతుంది. అందుచేత తిండికోసం ఆశపడ్డ యీ ఎలుకకు ముక్కు దూలం బద్దలయ్యేటంత దెబ్బ తగులుతుంది. అంతే కాదు - ఆపాటుకి ఆ ఎలుక వచ్చి యివతలవున్న ఒక వలలో పడిపోతుంది. ఒకటి రెండు సార్లు ఏమైనా పొరపాటు పడిందేమో కానీ, ఆ తరువాత మాత్రం యీ ఎలుక, తెల్ల సున్నానే గుర్తు పెట్టుకొని, ఎన్ని సార్లైనా ఆ అట్టమీదికే దూకటం నేర్చుకొంది. దీని కీవిషయం తెలిసిపోయిందని ప్రొఫెసర్ గుర్తించాడు. అడుగునుంచీ ఒకమీట నొక్కి, తెల్లసున్నా అట్ట క్రింద వున్న అన్నపు గిన్నెను అక్కడ నుంచీ తీసేసి, నల్లసున్నా అట్ట కిందికి మార్చేశాడు. ఈ విషయం-పాపం-ఆ ఎలుకకు తెలియదుగా! అలవాటు చొప్పున ఎన్నిసార్లైనా ఆ తెల్లసున్నా అట్టమీదికే దూకి, ముక్కు బద్దలు కొట్టుకొందే కానీ, ఆనల్లసున్నా అట్టమీదికి దూకి చూస్తే ఏమైనా తిండి కనుపిస్తుందేమో నన్న అనుమానం దానికి తోచనేలేదు. ఇలా ఎన్నో సార్లు విడవకుండా తెల్ల సున్నా అట్ట మీదికే దూకి, దూకి, ముక్కు దూలం విరగ కొట్టుకొని, యిక అసలు దూకటమే మానేసింది. పరిస్థితి కనిపెట్టిన ప్రొఫెసర్ ఒక రబ్బరు గొట్టంలో నుంచీ గట్టిగా గాలిని దాని వెనుకభాగం మీదికి వూదాడు. దానికి మళ్ళీ దూకటం తప్పలేదు. మళ్లీ ముక్కు బెదిరిపోవటమూ తప్పలేదు. ఇలా బలవంతంచేసి యిరుకులో పెట్టి చికాకు పరిచేసరికి, ఆ ఎలుక

★ జంతుకోటిలో మానవలక్షణాలు ★

పిచ్చెక్కిన దానిలా తయారైంది. ఇః అప్పటినుంచీ, ఏ అట్టమీద ఏరంగు వున్నదన్న విషయం గమనించటం మానేసి, మంచిరానీ, చెడురానీ అని ఎప్పుడూ ఎడమ వైపుకే దూకటం మొదలు పెట్టింది.

ఈవిధంగా చేస్తున్న పరీక్షలతో బెదరగొట్టేసి, దానికి సహజంగా వుండే ఆకొద్దిపాటి విచక్షణా జ్ఞానాన్ని పాడు చేసే నరికి, యిక ఆ వుత్తరక్షణం నుంచీ ఎన్ని ఆశలు చూపించినా, ఎన్ని రకాలుగా భయపెట్టినా ఆయన ఆ ఎలుక చేత తను కోరుకొన్న పని ఏదీ చేయించలేక పోయాడు. ఆ ఎలుక బుర్ర ఎంత పాడైపోయిందంటే-అన్నపు గిన్నెకు అడ్డంగా వున్న అట్టముక్కను తీసేసి ఆగిన్నె దాని కళ్లకు శుభ్రంగా కనిపించేలా చేసినా కూడా, ఎడమ వైపుకు-అంటే; ముక్కు దూలం బద్దలు కొట్టే ఆ రెండో అట్టమీదికే-దూకే అలవాటును అది మార్చుకోలేక పోయింది.

మనుష్యులు కూడా తలకు మించిన పరిస్థితులు ఎదుర్కోవలసి వచ్చినప్పుడు యిలాగే. వెర్రిగా ప్రవర్తిస్తుంటారని అంటూ ఆప్రొఫెసర్ మరొక మాట అన్నారు: ప్రపంచ రాజ్యాలలో కొన్ని యితర దేశాలతో ఏదో రకమైన పేచీలు పెట్టుకొంటూ వుంటాయ్. అలాటి రాజ్యాల నాయకులు ఆయితర దేశాల వారితో తమకేవో యిదమిద్ధమని తేల్చి చెప్పగల అభిప్రాయ భేదాలు వున్నందువల్ల కాక, ఆ నాయకులు, ఆదేశ ప్రజలు తమకు తామే ఏర్పరచుకొన్న నైరాశ్య వాతావరణం వల్లనే ఆపేచీలు పెంచుకొంటూ వుంటారని యీాయన అన్నాడు. ఈమాట ఎంతవరకు యథార్థమనే విషయాన్ని గురించి ఐక్యరాజ్య సమితివారే ఎప్పుడైనా నిష్పాక్షికంగా చర్చించి తేల్చవలసిందే కానీ, యితర మార్గాల దానిని ఋజువు చేయటం కష్టం.

(ఇంకా వుంది)

★ డాన్ క్విక్ సెట్ ★

(36-వ పేజీ తరువాయి)

గడుపుతూ వున్నాడో, అట్టి శాంకో పాంజా, గవర్నరుగిరీని కాలదన్ని, మళ్ళీ తనవద్దకు ఎప్పుడైతే వచ్చాడో, అప్పుడే, వీరకేసరి డాన్ క్విక్ సెట్ గారికి వీర విహారాల వైపుకు గుబులు తిరిగింది. అదీకాక, యిప్పటి కప్పుడే వారం పదిరోజులుగా యీ డ్యూక్ గారి భవనంలో చేరి, భోగాభాగ్యాలతో గడిపివేసి వున్నమీాదట, యిక ఒక క్షణమైనా యింతటి సోమరిపోతు బ్రతుకు బ్రతకటం తనవంటి వీరుని లక్షణం కాదనిపించి, డాన్ క్విక్ సెట్ గారు ఒకనాడు డ్యూక్ దంపతుల వద్దకు వెళ్లి తామిక శెలవు పుచ్చుకొంటున్నామని చెప్పాడు.

వారు వుభయులూ కూడా వీరకేసరి గారు యింత త్వరలో వెళ్ళిపోతా నన్నందుకు మనస్సులు కష్టపెట్టుకొన్నారు. ఏమైతే నేం - వారెంత బ్రతిమాలినా డాన్ క్విక్ సెట్ గారు వెళ్లి తీరవలసిందే నన్నాడు. చివరకు వాళ్లకు ఎంత అయిష్టంగా వున్నా వీరకేసరి గారి నిర్గమనానికి వారు అనుమతించక తప్పలేదు.

మరునాటి వుదయం డాన్ క్విక్ సెట్ గారు, తన ముద్దుల ముసలి గుర్రం రోజినాన్‌టీని ఎక్కి, డాపుల్ నెక్కిన బంటు శాంకో పాంజా వెన్నంటిరాగా, డ్యూక్ భవనం నుంచి బయలు దేరి, బార్‌సిలోనియా పట్టణం వైపుకు ప్రయాణించాడు. వీరకేసరి గారు బయలుదేరిన ముహూర్తాన డ్యూక్ దంపతులు వీధి గుమ్మం దాకా వచ్చి, అశ్రు పూరిత నయనాలతో వీరికి వీడ్కోలు యిచ్చారు. ఆయన ఎక్కిన గుర్రం కాలు కదిపి బయలుదేరే సరికి, కోటమీాదనుంచి కాపలా వాళ్లు కొందరు, విచార సూచకంగా బాకాలూదారు.

(ఇంకావుంది)

అద్దెయిల్లు

(24-వ పేజీ తరువాయి)

సామాన్లు అయితే ఎలా కాలక్షేపం చేయడమండీ?

సుం: నయం. ఇంకా మేడకావాలన్నావు కాదు. స్కూళ్లకి శెలవలని మీకు యిచ్చాను గాని లేకపోతే స్కూలు కుర్రాళ్ళకి యిస్తే సునాయాసంగా నలభై రూపాయలు అద్దెవచ్చును. మొగుడూ, పెళ్లాం ఆమాత్రం కాలక్షేపం చేసుకోలేకపోతే ఎలాగా?

రా: అసలే మాకు చాలదు. అందులో మూగదిలో కూడా వాడి సామాన్లు లాభం లేదు. క్షమించండి మీమాట మన్నించలేనందుకు.

సుం: పోనివాళ్ళే సర్దుకుంటారు. నీవల్ల నిష్కారణంగా రెండురూపాయలు తగ్గిపోయింది. (వెళ్లిపోతుంది.)

* * * *

(రెండురోజుల తరవాత)

క: ఏమండీ! ఈ నరకంలో ఎలా ఉండడం? ఇవతల కంసాలి సుత్తిచప్పుడు అవతల మిషను గరగర. అబ్బ! తలనొప్పి! మరో యిల్లు చూద్దురూ.

రా: అన్నియిళ్లూ ఇంతేనే. అయినా యిల్లు దొరకడం సామాన్యం అనుకున్నావా? కొత్తగా మరోటి దొరికేవరకైనా కాలక్షేపం చేయాలా?

క: ఏమయినా చెప్పండి. ఈయింట్లో వుండలేమండీ. ఎంతవేగం మనం యింకో చోటికిపోతే అంతమంచిది. మధ్యాహ్నం సుందరమ్మగారు వచ్చి రెండు శేర్లుబియ్యం 'బదులు' అని తీసుకువెళ్లింది.

రా: పోనీ. సంసారుల యిళ్ళల్లో ఆమాత్రం బదుళ్లనీ, సదుళ్ళనీ ఉండకపోతే ఎలా?

క: మంచి బదుళ్లే! ఆవిడ వాలకం చూస్తే తిరిగి యిచ్చేబదుళ్ళు కావు. అద్దెకి రెండురెట్లు ఈ బదుళ్ళే అయ్యేట్టుంది. మధ్యాహ్నం వండుతూండగా వచ్చి రవ నూక చూచి "చాలా బుద్ధిమంతురాలివి. క్రొత్తసంసారం అని అన్నీ జాగ్రత చేసుకు వచ్చావు" అంటూ ఒక పావుశేరు నూక బదులు తీసుకువెళ్లింది. మనవేపు జాగా లేదని పెరటిగోడదగ్గర మీరు తెచ్చిన కర్రలు పెడితే అప్పుడే సగం మాయం. గట్టిగా అంటే విరుచుకు పడుతుంది.

రా: మన వస్తువులన్నీ ఆవిడ కూడా వాడుతున్నదంటావు నువ్వు.

క: (కొంచెం మెల్లిగా) సామాన్లు వాడుకోవడం ఏమిటి? దొంగబుద్ధులు కూడాను. మీరు రుద్దుకున్న సబ్బు నూతిదగ్గర ఉంచి బట్ట ఆరవేయడానికి వచ్చి మళ్ళీ వెళ్ళేసరికి మాయం అయింది. కనబడలేదని అనుకుంటుంటే "మా కెందుకమ్మా! విధవవాళ్లకి సబ్బులుకూడానా?" అంది.

రా: పుచ్చకాయల దొంగ అంటే భుజాలు తడుముకుంది.

క: నామాట విని కొత్తగా మరెక్కడయినా చూద్దురూ, పోదాం.

రా: తొందరపడితే పనులవుతాయా? ఇబ్బందులున్నా మొదట్లోనే కొంచెం సర్దుకోవాలి.

క: సర్దుకుంటూనే ఉన్నాం యింట్లో దిగిన దగ్గర్నుంచీ. ఎక్కడి సామాను అక్కడే మాయం అవుతున్నది.

మొన్న లుంగీ ఆరవేస్తే మరి కనబడలేదు. కనబడలేదని అనుకుంటే అశ్రద్ధమీద అర్ధగంట ఉపన్యాసం యిచ్చింది. దొడ్లో చెంబు నూతిదగ్గర తోమడానికి పెడితే అది కనబడదు. ఇలాగ ఒక నెలరోజులు గడిస్తే మన సంసారం అంతా మాయం అవుతుంది.

(సుందరమ్మ ప్రవేశం)

సుం: చూడు నాయనా! నీపేరేమిటన్నావు? మీ ఆవిడకు మరీ అశ్రద్ధ ఇంత అశ్రద్ధ ఉంటే సంసారాలు బాగుపడతాయా? చెప్పడమే మర్చిపోయాను. ఈ వీధిలో ఈమధ్య దొంగతనాలు ఎక్కువయాయి. మీరు రాకముందే మన ప్రక్కింటిలో దొంగలు పడి సర్వం దోచుకున్నారు. అప్పటినుండీ మనవరస యిళ్లల్లో ఎవరో ఒకరియింట్లో ఏదో ఒకటిపోతూ ఉండడమే.

రా: (సుందరమ్మ చేతిలో చెంబు చూసి) ఈ చెంబు చాలా బాగుంది. ఎక్కడ

వైద్యం వృత్తిగా గల యిద్దరు మిత్రులు ఒకరోజున పొరుగూరి హోటల్లో తారసిల్లారు.

"ఈవూళ్లో అమ్మాయిలు అందరి కళ్లూ అందంగానే వుంటాయల్లే వుందే?" అన్నాడు నేత్ర వైద్యుడు.

"అదేమో! నేను ఎంతసేపూ మనుష్యుల గుండెలనే పరీక్షిస్తాను." అన్నాడు క్షయరోగ చికిత్సకు పేరు పొందిన రెండో వైద్యుడు.

కొన్నారేమిటి? లక్కవరపుకోట కంచులా ఉందే?

సు: (తడబడుతూ) అయ్యో! నా తెలివి కాలా' ఏ పనిమీద వచ్చానో అదే మర్చిపోయాను. యిది మీచెంబే. మీఆవిడ నూతిదగ్గర మర్చిపోయింది. ఎవడైనా చటుక్కున గోడగెంతి యిది కాస్తా లాక్కుపోతే నామీదికే వస్తుందని తీసుకొచ్చాను. యిందు, జాగ్రతగా ఉంచుకో కమలా!

రా: ఏయ్! చూడూ నేను బజారుకి పోయి రేపళ్లు తెస్తాను.

సుం: బజారుకి వెళుతున్నావా? నాయనా చూడూ! మా రేపనుచీటేకూడా యిస్తాను బియ్యం తెచ్చి పెడుదూ. నాకు మరో దిక్కు లేదు.

(లోనికి వెళ్ళివచ్చి రేపను కొర్దిస్తుంది) డబ్బు అద్దిలో చూసుకోవచ్చులే బాబూ.

రా: (కొంచెం చిరాకుగా) నేను వచ్చేసరికి చాలా ఆలస్యం అవుతుందండీ.

సుం: నాకుమాత్రం ఏం తొందర బాబూ? మీబియ్యం తెచ్చినపుడే నాకీ తెచ్చిపెట్టు బియ్యంతోపాటు పంచదార కూడాను. (కొంచెం ఆగి) వెధవ పెద్దకాలం అప్పుడే ముంచుకొచ్చి మతి మరుపు హెచ్చయింది. అసలు సంగతి చెప్పడం మరిచాను బజారులో మంచి సైను దొరికితే తెచ్చిపెడుదూ–ఈ చింకి పంచ చూస్తే నాకే సిగ్గవుతోంది, మీలాంటి వాళ్ళదగ్గర నిలబడడానికి. డబ్బు అద్దిలో అణాపైసలతోసహా లెఖ్ఖ చూసి తీసుకో.

రా: (చిరాకుగా) సరేలెండి. ఇంతేనా యింకేమన్నా ఉన్నాయా మామ్మగారూ?

సుం: ఎంత బుద్ధిమంతుడవు? నాకు మరేం కావాలి? కాటికి కాళ్ళు చాచుకొని కూర్చున్నా. వస్తా, పొద్దు మాడిపోతోంది. (వెళ్ళిపోతుంది)

(రామ్మూర్తి భార్యచెవిలో ఏదో చెబుతాడు. కమలమ్మ లోపలకు వెళ్ళిపోతుంది. రామ్మూర్తి వీధిలోకి వెళ్లి కాస్సేపటిలోనే తిరిగి వస్తాడు.)

రా: ఏమేవ్! బండి వచ్చింది. అంతా సర్దివేశావా?

క: అంతా సిద్ధంగానే ఉంది. ఆ బండివాణ్ని వచ్చి సామాన్లు వేయమనండి.

(కేకవిని సుందరమ్మ ప్రవేశం)

సుం: (బండిచూసి చిన్న చిరునవ్వుతో) ఈ మాత్రం బజారుసామానుకి బండి ఎందుకబ్బాయి? అబ్బబ్బ! ఈ రోజుల్లో కుర్రాళ్లు మరీ దుబారా. మా రోజుల్లో ఇలా సంసారాలు చేస్తే ఈ మాత్రం నిలవడానికి నీడైనా ఉండేదా?

రా: ఆ సామాన్లు బండిలో వెయ్యిబోయ్. ఈగదిలోవే.

సుం: (నిర్ఘాంతపోతూ) ఊరికి వెళతారేమిటి?


రా: ఆ ఊరికే. అర్జెంటుగా వెళిపోదామని (భార్య నుద్దేశించి) అయిందా. రా.

క: (ఇవతలకు తాళంతో వచ్చి) ఇందండమ్మా. మీ గదితాళం. మీకు నలభయి రూపాయలు యిచ్చే నూర్లు వుర్రాళ్ళకే అద్దెకిచ్చుకోండి. మాలాంటి సంసారులం ఉండలేం.

రా: మీకిచ్చిన ఎడ్వాన్సుకి మేం ఉన్న రోజులకి సరిపోయింది లెండి. మీరు మాకేం యివ్వనక్కరలేదు. మా స్నేహితుడి యింటిదగ్గర వేరే యిల్లు దొరికింది. పద, కమలా పోదాం.

క: పదండి. ఈ అద్దెయిల్లుకన్నా నరకమే సుఖం.

(రామ్మూర్తి. కమల వెళ్ళిపోతారు)
(సుందరమ్మ నిర్ఘాంతపోతూ చేతిలో తాళం జారవిడుస్తుంది—తెర.) ★



శోభనాచలవారి "ప్రజాసేవ"లో గిరిజ.

ఈచిత్రంలో గిరిజ, రామచంద్ర కాశ్యప, లక్ష్మీరాజ్యం ముఖ్యపాత్రలు నటిస్తున్నారు. డైరెక్టరు ప్రభాకరరావు.



బస్తీ చదువు నుంచి ఇంటికి తిరిగివచ్చిన దేవదాసు పార్వతి మెళ్లో ప్రేమహారం కేలిస్తున్నాడు
వినోదా వారి "దేవదాసు"లో నాగేశ్వరరావు సావిత్రి

పల్లెటూరు సమీక్ష

పీపుల్స్ ఆర్ట్ ప్రొడక్షన్సు వారి మొదటి చిత్రం "పల్లెటూరు" ఈ నెల 16 వ ఆంధ్రదేశంలో విడుదల అయింది 19 వ తేదీ ఆదివారం నాడు మద్రాస్, చిత్రా టాకీస్‌లో పత్రికలవారికి ఈచిత్రం చూపించారు మద్రాసులో ఏ తెలుగు చిత్రం ప్రెస్ షోకూ రానంతమంది వచ్చారు హాలు హాలంతా కిట కిట లాడి పోయింది నిర్మాణంలో ఉండగానే ఈ చిత్రం ఎంతమందిని ఉత్కంఠితులనుగా చేసిందో దీనివల్లనే తెలుస్తుంది

ఈ చిత్రంలో ఎన్నదగిన ప్రత్యేకత ఒకటున్నది తెలుగు గ్రామసీమల వాతావరణం ఇంత జయప్రదంగా మరి ఏ చిత్రంలోనూ తీసుకరాబడినట్లు కనబడదు "లొకేషన్ షాట్స్" వల్ల ఈ వాతావరణాన్ని చాలవరకు సృష్టించగలిగారు చెడుగుడు ఆటలు, కోడి పందాలు, సంక్రాంతిముగ్గులు, హరిదాసులు, ఆంధ్రరాష్ట్ర ప్రసక్తి, యువజన గ్రంథాలయం, నాట్యమండలి, మొదలైనవాటివల్ల కూడా తెలుగుదేశపు బాహిరవాతావరణం సృష్టించబడింది అయితే అంతర వాతావరణం విషయంలో "పల్లెటూరు" కథ కొత్తగా సాధించిన దానికంటే మామూలు సినిమా కథలధోరణిని అనుసరించినదే ఎక్కువగా ఉంది

గ్రామంలో పలుకుబడిగల షావుకారు, అతను చేసే దురాగతాలు, నిర్దోషులకు

"పల్లెటూరు-సమీక్ష"

కష్టపడటం, చివరికి ధర్మం జయించటం, కూతురి కిష్టంలేని పెళ్ళి తలపెట్టిన తండ్రి, గాఢంగా ప్రేమించుకొన్న ప్రేమసీ ప్రియులు, వారి విరహం ఇత్యాది కథాంశాలన్నీ మామూలు దృక్పథంలోనే ఉన్నాయి కథాకల్పన, పాత్రీకరణం మిగతా సినిమాల ఫక్కీలోనే ఉన్నాయి

పాత్రీకరణం తీసుకుందాం పాలేరు సుబ్బన్న, అతని భార్య, కొండయ్య, అతని భార్య మొదలైన అప్రధాన పాత్రలు ఉన్నంత సజీవంగా షావుకారు గణపతి గాని, నాయకుడు చంద్రం కాని కనబడరు షావుకారు గణపతి నరరూప రాక్షసుడుగా చిత్రించబడ్డాడు నాయకుడు చంద్రం అతి సజ్జనుడుగాను, సహనశీలిగాను, మొత్తానికి సద్గుణాలన్నీ మూర్తీభవించిన మనిషిగాను చిత్రించబడ్డాడు ఈమాదిరి పాత్రీకరణం మనదేశపు చిత్రాలలో పరిపాటి వెలుగునీడలు, అంటే, మంచిచెడు ఉండని పాత్రలు సజీవంగా ఉండవు ప్రతి మనిషిలోనూ మంచిచెడు ఉండి తీరుతాయనేది అతి సామాన్య సూత్రం. ఒక సందర్భంలోనో, ఒక మనిషి పట్లనో మంచిగా ప్రవర్తించినవాడు మరొక సందర్భంలో గాని, మరొక మనిషి పట్లగాని చెడుగా ప్రవర్తించవచ్చు మానవుడి భిన్నభిన్న ప్రవర్తనలకు కారణాలను అన్వేషించటం వాస్తవికత

ఈ చిత్రంలో వాస్తవికత లోపించటానికిదే కారణం నరరూప రాక్షసుడుగా చిత్రించబడిన షావుకారుమీద వ్యక్తిగతంగా మనకు క్రోధం కలుగుతుంది గాని అటువంటి షావుకార్లను దేశమంతటా సృష్టించిన సంఘపరిస్థితులమీద, ఆర్థిక విధానంమీద క్రోధం కలగదు గణపతి వంటి వ్యక్తి ఎక్కడైనా ఉంటాడనుకున్నప్పటికీ ఈ పాత్రీకరణం సమర్థనీయం కాదు ఎందుకంటే ఆ ఒక్క వ్యక్తినో, అటువంటి మరికొందరు వ్యక్తులనో సంఘం నుండి తొలగించినంత మాత్రాన సంఘం బాగుపడాలికదా! కాని సంఘంయొక్క మంచిచెడ్డలు వ్యక్తులమీద ఆధారపడి వుండవు సంఘంయొక్క జీవితవిధానం మీద ఆధారపడి ఉంటాయి ఆ జీవిత విధానానికి వ్యక్తులు చాలవరకు నిమిత్తమాత్రులుగానే ఉంటారు కనుక జీవిత విధానాన్ని సంస్కరిస్తేగాని సంఘం సంస్కృతం కాదు. వాస్తవికత అనేది సంఘపరిస్థితి ఈ విధంగా ఉండటానికి గల మూలకారణాలను అన్వేషించటంలో సాధించబడుతుంది అంటే ఒక సమస్యను తీసుకున్నప్పుడు దాన్ని సాంఘిక దృక్కోణంనుంచి చూడ గలిగినప్పుడు వాస్తవికత సిద్ధిస్తుంది, వ్యక్తుల మనస్తత్వాలలోని వైపరీత్యాలను చూపించటంవల్ల వాస్తవికత సిద్ధించదు

'పల్లెటూరు"లో షావుకారు గణపతి ఎవరో కొందరు వ్యక్తులకు అన్యాయం చేసినట్లు చూపబడిందిగాని అతనికి సంఘంలోగల స్థానం, అతనిలాంటవాళ్లు అనేకులు సాగిస్తున్న దోపిడి విధానం చూపించబడలేదు అతడు ఇద్దరు స్త్రీలకు చెయ్యబోయిన మానభంగం చూపించినంత వివరంగా అతని ఆర్థికజీవితం చూపించలేదు "ప్రజలు తిండికి కటకటలాడుతున్నా"రని మధ్యలో ఒక గ్రామస్థుడు మాట వరసకు అంటాడేగాని ఆ మాటను చిత్రించటానికి ఒక్క షాట్ కూడా తియ్యలేదు అందుచేత చివరలో గణపతిని ఎరెస్టు చెయ్యటానికి పోలీసులు వచ్చినప్పుడు గ్రామస్థులు సాముదాయకంగా వచ్చి "తీర్పు" ఇచ్చినట్లు చూపటం సమర్థనీయంగాలేదు "ఎందుకూ ఎరెస్టు చెయ్యటం" అని గణపతి అడిగ్గా ఇన్స్పెక్టరు "ఇందుకు" అని ప్రజలను చూపెస్తాడు ఏ పోలీసు ఇన్స్పెక్టరూ అలా చూపించడు

ఈ చిత్రంలో హృదయంగమమైన సన్నివేశాలు కొన్ని ఉన్నాయి చంద్రం, సుగుణల ప్రణయం అతి స్నిగ్ధంగా, ముగ్ధంగా చిత్రించబడింది చంద్రం "మన పెళ్ళి సంగతి మామయ్యని అడగనా?" అన్నప్పటి దృశ్యం ఎంతో కోమలంగా ప్రేక్షకులను తాకుతుం బస్తీలో ప్లీడరుగారింట్లో శాంతను సాంబయ్య చూసినప్పటి దృశ్యం, సీతమ్మ మరణించినప్పటి దృశ్యం కూడా ప్రేక్షకులను కదిలిస్తాయి సీతమ్మ అంతవరకూ అప్రధానమైన పాత్రగానే ఉంచబడి మరణసన్నివేశంలో మాత్రం అంత ప్రాధాన్యం పొందటం ఉచితంగా లేదు ఆమె మరణదృశ్యం అంత బరువుగా చూపదగినంత పాత్రత్వం ఆమెకు లేదు

కొన్ని పాత్రల చెడ్డతనాన్ని అతిగా చిత్రించినట్లే కొన్ని పాత్రల మంచితనంకూడా అతిగా చిత్రించబడింది బస్తీలో ప్లీడరు దంపతుల అవ్యాజానురాగం, వారి నౌకరు కుర్రాడికి శాంత మీద గల సోదరప్రేమ, సుగుణ ప్రతిరోజూ ఫొటోగతులైన దేశనాయకుల మీద దూరంనుంచే పువ్వులు విసిరేసి ప్రదర్శించే "భక్తిభావం" ఇవన్నీ అత్యుక్తులుగానే కనిపిస్తాయి

సంక్రాంతి ఉత్సవాలలో "తెలుగోడా!" అనేపాటను, "పొలాలనన్నీ హలాలదున్నీ" అనే శ్రీశ్రీ గేయం పాడించటం మెచ్చుకోదగిన ప్రయత్నం అని చెప్పాలి కాని ఈ పాటలను చిత్రీకరించటంలో ఇంకా ఎక్కువ శ్రద్ధతీసుకుంటేబావుండేదనిపిస్తుంది. "తెలుగోడా!" పాట పాడుతున్నప్పుడు పాడుతున్న వారి ముఖాలను, వింటున్న వారి ముఖాలను చూపించటంకంటే పాటలోని అర్థానికి తగిన చిన్న చిన్న షాట్లను తగిన ప్రమాణంలో ఎడిట్ చేసి చూపవలసింది ఈ ప్రయత్నం శ్రీశ్రీ పాట పాడినప్పుడు చేయబడింది అయితే ఈ పాటలో కనిపించే దృశ్యాలు స్టూడియో ఫ్లోర్‌లో సాధ్యపడే రకమే గాని పల్లెటూళ్ళ ప్రపంచరంగం మీద సాధ్యపడేవి కావు అసలు ఈ పాటను ప్రదర్శన రూపంలో కాకుండా "పల్లెటూరు" అనే కథకు సారాంశమైన నీతిసూత్రంగా గ్రహించి సినిమా ప్రారంభంలోనో, అంతంలోనో నేపథ్యగీతంగా పాడించవలసింది అప్పుడు ఆ పాటను పిక్చరైజ్ చెయ్యటంలో ఎంతైనా స్వేచ్ఛకు అవకాశం ఉండేది కృత్రిమమైన సెట్టింగులు కాకుండా ఆ పాటలోని అర్థానికి తగినట్టు నిజమైన లొకేషన్ షాట్లవంటివి తీసి ఎడిట్ చెయ్యవలసింది. "అనేకులంతా అభాగ్యులంతా, అనాధులంతా, అశాంతులంతా" అనే ముక్కల్ని పిక్చరైజ్ చెయ్యటానికి దేశంలోని అభాగ్యతయొక్క విస్తృతిని ఎన్ని గొప్ప దృశ్యాల్లోనైనా చూపించవచ్చు ఇందుకు దర్శకుడిలో *Imagination* మాత్రమే కాకుండా అతనికి తగినన్ని సౌకర్యాలు కూడా ఉండాలి

ఈ చిత్రంలో ఎన్నదగిన మరొక విషయం ఫొటోగ్రఫీ చాలచోట్ల సరియైన లైటింగ్ వల్ల మంచి ఫలితాలు చేకూరినై సుగుణను గణపతి చెరచబోతున్న దృశ్యంలో లైటింగ్ బాగున్నది రాత్రి దృశ్యాలన్నీ బాగున్నాయి చిత్రం మొదట్లో తెల్లవారుతున్నప్పటి సిల్ హౌట్ షాట్లు, వాటిని అనుసరించిన నేపథ్య వేణు

గానం గ్రామ వాతావరణాన్ని పునస్సృష్టించ గలిగాయి. సౌండు రికార్డింగుమాత్రం కొన్ని చోట్ల దెబ్బతిన్నది. గొంతుకలు బొంగురుగా వినిపించటం, మాటలు అస్పష్టంగా ఉండటం జరిగింది. "ఆపదల పాలైతివా?" అనే పాట ఊరిబయటగల బాలయోగి మందిరంలో ఒకరు పాడినదైనప్పటికీ అదే వాల్యూమ్‌లో ఊరిమధ్య ఉన్న శాంతకు కూడా వినిపించనివ్వటం బాగాలేదు. దూరంనుంచి ఆ పాట శాంతకు వినిపిస్తున్నట్టుంటే బాగుండేది.

ఘంటసాల సంగీతం సామాన్యంగా ఉంది. "వచ్చిందోయ్ సంక్రాంతి" అనే మొదటిపాట పేర్కొనదగినది. నేపథ్య సంగీతంఅంతటా బాగుంది. నృత్యాల్లో రాజా-పేదా నృత్యం వినోదకరంగానే ఉంది. రెండో సంక్రాంతికి గణపతి ఏర్పాటుచేసిన విజాతీయ నృత్యం శుద్ధ అనవసరం. దాన్ని అంత వివరంగా చూపవలసిన అగత్యంలేదు.

సుంకర, వాసిరెడ్డిగార్ల సంభాషణలు *Narrative* ధోరణిలో నడిచినప్పటికీ, తృప్తికరంగానే ఉన్నాయి.

నటీనటులందరూ ప్రశంసనీయంగా నటించారు. ఎన్. టి. రామారావు, సావిత్రి ప్రేక్షకులను తప్పక ఆకర్షించి తీరుతారు. షావుకారుగా రంగారావు, సుబ్బన్నగా శుటుంబరావు, కొండయ్యగా నాగభూషణం, శంకరంగా రమణారెడ్డి కూడా మంచి నటనచూపారు.

బాక్సాఫీస్ కోసం కొందరు నిర్మాతలనుసరించే మామూలు చవక పద్ధతులేమీ "పల్లెటూరు" నిర్మాతలు అనుసరించకపోవటం హర్షించదగినది. మోతాదు మించని హాస్యంతో కూడిన ఈ చిత్రం విజయవంతం కాగలదనే ఆశించవచ్చును. ★

ఏళై ఉళవన్ "సమీక్ష"

రాజరాజేశ్వరీ ఫిలింకంపెనీవారి తమిళ చిత్రం "ఏళై ఉళవన్" (పేదరైతు) మద్రాసులోను, తమిళనాడులోను ఇటీవల విడుదల అయింది. ఈనెల 16న ఈ చిత్రాన్ని వెలింగ్టన్ టాకీసులో పత్రికాప్రతినిధులకు చూపించారు. కన్నాంబ, అంజలి, ముత్తులక్ష్మి, తులసి, లింగమూర్తి, శ్రీరామమూర్తి, రేలంగి, దొరస్వామి మున్నగువారు నటించారు. డైరెక్టరు కె. బి. నాగభూషణం; సహకార దర్శకుడు ఇంటూరి వెంకటేశ్వరరావు.

"దున్నేవానిదే భూమి" అనే నినాదం ఈ చిత్రంలో వినిపిస్తుంది. భూమి సమస్య తీవ్రంగాఉన్న ఈ రోజుల్లో ఈ నినాదం ప్రజాకర్షకం కాగలదని ఆశించి నిర్మాతలు దాన్ని ప్రవేశ

(50-వ పేజీ చూడండి)



కృష్ణా పక్చర్సువారి "అమ్మలక్కలు"లో ఎన్. టి. రామారావు కారు ప్రమాదంలో గాయపడిన దృశ్యం
సురభి బాలసరస్వతి, అమరనాథ్, లలిత, బుష్యేంద్రమణి, మొదలైనవారు

ప్రశ్నలు - సమాధానాలు

శ్రీ జి. కృష్ణా—ఢిల్లీ.

"కధ కంచికి వెళ్లింది మనం యింటికి పోదాం" అనే సామెత ఎలా వచ్చింది?

—చాలా కథలు బౌద్ధుల తాలూకు "త్రిపిటకములు" అనే గ్రంధములో ఉండేవి. వీటిలోని కథలనే పిటిక కథలు అనేవారు. అవే "పిట్టకధ" లైనాయి. కంచిలో గొప్ప పండిత పరిషత్తుగల విద్యా పీఠం ఉండేది. అక్కడ యీ కథల గ్రంధాలు జైనులకాలంలో ఉండేవి. అక్కడనుంచి చాలా కథలు ప్రజలలో వ్యాపించాయి. అందుచేత కధంతా అయిపోయిన పిమ్మట ఆ కథ ఎక్కడినుంచి సంపాదించబడిందో ఆ కంచికి ఆ కథ పోయిందని చెప్పి ముగించడం అలవాటు, ఆచారం అయింది.

*　　*　　*

శ్రీ సి. శ్రీరామమూర్తి జి. యం. ఆఫీసు —శక్కర్ నగర్ (నైజాం).

పెండ్లి సమయమునందు పెండ్లికుమార్తె కుడికాలి బొటనవేలు నేల రాయరాదందురు? కారణమేమి? అందువల్ల నష్టము లెవ్వి?

—ఆయా అవయవములను ఏవిధంగా కదలిస్తే, ఏవిధమైన భావం అటువంటి ఆంగిక అభినయమువల్ల ప్రకటింపబడగలదో మన అభినయ శాస్త్రంలో చెప్పబడివుంది. కాలి బొటనవ్రేలును నేలమీద వ్రాయడం దీర్ఘాలోచనతో కూడిన విచారాన్ని సూచిస్తుంది. ఇట్టి అవయవచలనము శోభస్కరమైనమంచిఅలవాటు కాదు. శుభసమయంలో మరింతఅమంగళకరం. ఒకప్పుడది కామోద్రేకంతో కూడిన శృంగారభావం స్ఫురింపజేసే పోకిరీ చేష్టకూడా కావచ్చు.

*　　*　　*

శ్రీ వి. అప్పారావు—పాగోను.

నవ్వు నాలుగువిధముల చేటు అని పెద్దలు అంటారు ఆ నాలుగు విధముల చేట్లు వివరిస్తారా?

—అర్థంలేని నవ్వు ఎప్పుడూ అనర్థకమే. పదిమందిగల సభలో అటువంటి పరిహాసం (1) అసభ్యం, (2) అవివేకం, (3) అవమాన కారణం, (4) అనుమాన ప్రేరణ.

పత్రికా పరిచయం గొప్పదా? గ్రంథ పరిచయం గొప్పదా?

—పత్రికలన్నీ బైండు చేయిస్తే గ్రంథమవుతుంది, కనుక పత్రికా పఠనం గ్రంథ పఠనంతో సమానమవుతుంది.

*　　*　　*

ఎస్. సుబ్బారావు—తుమ్మపూడి.

చిత్ర నిర్మాణ సమయమున *Clapper-boy* పనియేమిటి?

—షాట్ తియ్యబోయే సమయంలో కెమేరా ఎదుట క్లాప్ బోర్డు పట్టుకుని నుంచుని క్లాప్ చేస్తాడు. ఆ బోర్డుమీద ఫలానా చిత్రం, ఫలానా సీను, ఫలానా టేక్ అని రాసిఉంటుంది.

విదేశ చిత్రాల పబ్లిసిటీలో ఎడిటరుకు కూడా ప్రచారమిస్తారు. మన దేశపు చిత్రాల పబ్లిసిటీలో ఎడిటరు పేరే కన్పించదేమండీ?

—మన దేశ చిత్రాల్లో కూడా టైటిల్స్ వేసేటప్పుడు ఎడిటరు పేరుకూడా తప్పకుండా చూపిస్తారు.

*　　*　　*

శ్రీ సి. హెచ్. సోమేశ్వరరావు— కూర్మనాథపురం.

ప్రపంచంలో చూడదగిన వస్తువులు 7 వున్నవి. అందులో ఒక జలసంధి యీవల ఒడ్డున ఒక కాలు పెట్టి ఆవలి ఒడ్డున ఒక కాలు పెటిన ఒక పోతవిగ్రహము ఉన్నది అని ప్రకటించిరి. అది ఎక్కడ ఉన్నది?

—మధ్య ధరాసముద్రంలో టర్కీ దేశపు పడమటి సముద్రతీరంవద్ద ఉన్న రోడ్సు అనే లంకవద్ద ఉన్నది.

భావి భారత భాగ్యోదయానికి కలమూ హలమూ గొప్పది? ఎందువలన?

—భావి భారత భాగ్యోదయానికి కలమూ, హలమూ రెండూ గొప్పవే. కలమూ హలమూ అనే విషయమును గూర్చిన కలహముమాత్రమే గొప్పదికాదు.

*　　*　　*

ఆర్. ఎల్. నరసింహం—పలాస.

"అమ్మలక్కలు"లో నటించుచున్న అమరనాథ్, ఇండియా క్రికెట్ ఆటగాడు అయిన అమరనాథ్ ఒక్కరేనా?

—"పేరు లోకవెగాని పూరుషుల్ వేరయా విశ్వదాభిరామ వినుర వేమ."



భరణీ స్టూడియోలో దసరా వేడుకల్లో కొడుకు భరణీతో ముచ్చటిస్తూ వున్న తార భానుమతి

(భరణీ స్టూడియోలో ఫొటోలు తీసినవారు శ్రీ పేకేటి శివరాం)

శ్రీ గాజులపల్లి సత్యం—కడప.

'కన్నెపిల్ల కనబడితే' కన్ను గీటుతారు. ఈ మగవాళ్ళకు మతి ఉన్నదా? అని ఒక పడుచు పిల్ల ప్రశ్న-"అందమైన పురుషుడు కనిపిస్తే తలుపు చాటునుంచి తొంగి తొంగి చూస్తారు. ఈ ఆడవాళ్లకు ఏమైనా మతి ఉన్నదా?" అని ఒక పురుషుని ప్రశ్న. ఇందులో ఏది తప్పిదం? మీరు పైరెండు వాదనలలో దేనిని సమర్థిస్తారు?

—అందంగా ఉన్నవాళ్ళను పదిసార్లు పదిమందీ చూడడంలో తప్పులేదు, అందాలపోటీలు జరుగుతున్న యీ రోజులలో. కాని, దృష్టిదోషం తగులుతుంది అనే భయం ఉన్నదనేమాట కూడా నిజమే. మొహం చూచినకొద్దీ మోహం కలిగేమాట కూడా నిజమే. యితరుల కళ్లను మనము మూయలేము గనుక ఎవరికళ్లు వాళ్లు జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి.

* * *

యల్లమాటి ప్రభుదాసు—వరహాపురం.

ఇతర దేశాలమీద ఆధారపడక (ఫిలిం ప్రింటింగ్ వగైరాలకు) మన దేశములోనే మొట్టమొదట తయారైన టెక్నికలర్ పిక్చర్ ఏదండి?

—ఇంతవరకూ ఏదీ లేదు.

సినిమాలు చూచుటవలన మానవాభ్యుదయానికి కలిగేది లాభమా? నష్టమా?

—ఆ సినిమాలనుబట్టి ఉంటుంది.

* * *

వి. వి. యస్. రావు—కాళహస్తి.

విజయావారు తమ చిత్రములను ప్రజల విజ్ఞానమునకై తీయుదురని కొన్ని పత్రికలలో చదివాను. ఇది ఎంతవరకు నిజం?

—ప్రజల విజ్ఞానంకోసం చిత్రాలు తీసేవారు మనదేశంలో ఇంతవరకూ లేరు.

* * *

కాలక్షేపం

(5-వ పేజీ తరువాయి)

జవహరిలాలు నెహ్రూగారు ప్రచారం చేశారు.

బ్రిటిష్‌వారిపై జర్మనీయున్ను జపానున్ను యీ మహాసంగ్రామంలో బ్రహ్మాండంగా విజృంభించినవి గనుక, యీ యుద్ధ సమయంలో జపాను పక్షమున భారతదేశం చేరి జపానుకు సహాయం చేస్తే బ్రిటిష్‌వారిని సులభంగా పారద్రోలవచ్చుననియు, బ్రిటిష్‌వారిని తిరిగి తలఎత్తుకోనివ్వకుండా అణగద్రొక్కవచ్చుననియు, ఆ విధంగా జపానువారి కరుణాకటాక్షంవల్ల భారతదేశం తప్పకుండా స్వతంత్ర రాజ్యం అవుతుందనిన్ని సుభాసు చంద్రబోసుగారు కలవరించి చాటుమాటుగా చాలా చాణక్యతంత్రం చేశారు.

బ్రిటిష్‌వారు మహాసంగ్రామసమయంలో గొప్ప యిక్కట్టుల పాలైయున్నారనిన్నీ, వారు చిక్కులపాలైయున్న సమయంలో వారిని నొక్కి వారికి ద్రోహం చేయడం గాని, వారి శత్రువులతో మనము చేరి వెనుక వైపునుంచి దొంగచాటుగా పొడుచుట గాని అధర్మమనియు, అట్టి ద్రోహమును దుర్మార్గమును సత్యనిరతులమైన మనము చేయరాదనియు గాంధిమహాత్ముడు చెవి నిల్లు కట్టుకొని యుద్ధకాలంలో మనకు జ్ఞానోపదేశం చేశాడు.

బ్రిటిష్ పరిపాలన మన భారతదేశానికి ఉండకూడని విదేశీయపరిపాలనాధికారమే. అయినప్పటికీ, ఏ యితర విదేశీయ పరిపాలనాధికారమైనను బ్రిటిష్‌ఆధిపత్యం కంటె మనకు మేలైనది కాజాలదని మహాత్ముడు దూరదృష్టితో వాదించాడు. మన బ్రిటిష్‌వారి వద్దనుండియే మనము స్వరాజ్యం సాధించవలెననియు, అందుకు సత్యము అహింసలే మనకు సాధనోపకరణములనియు మహాత్ముడు మనకు బోధించాడు. పగవానికైనా, ప్రతివాదికైనా పంచభక్ష్య పరమాన్నములతో అతిథి సత్కారం చేయవలెననే సత్యమార్గనిరతుడు మహాత్ముడు. ఆయన చేబట్టిన సత్యమే జయించింది. ధర్మము జయించింది.

కాలస్వరూపమే భగవంతుడు-"కాలుడు" అంటే యమధర్మరాజు. "ధర్మము"అనేది మూర్తిభవించినది యమధర్మరాజులో - కాలం అనేది మారి పోతున్నట్లుగా కన్పిస్తుంది. ఎందుచేతనంటే, రాజ్యాలు పోతున్నాయి. మనుష్యులు మహానగరాలు పోతున్నాయి. కొత్తవి వస్తున్నాయి ఈ కొత్తవి కూడా అంతరిస్తాయి, అస్తమిస్తాయి - సూర్యుడుదయిస్తాడు - అస్తమిస్తాడు - అందుమూలంగా మనం గంటలు రోజులు వగైరా కాలం లెక్క పెట్టుకుంటున్నాం. కాని సూర్యుడెక్కడికీ పోలేదు. మన లెక్కకోసం నిన్న, నేడు, రేపు అని లెక్కపెట్టుకుంటాం. కాని "కాలం" అనేది మారడం లేదు. కాలుడు మారడు. మారేది జగత్తు గాని కాలం కాదు. వెనుక నొకసారి కన్యాశుల్కంలోని గిరీశంగారు యమధర్మరాజునుకూడా ఎదిరిస్తానన్నారు. "నీవు కొత్త యముడివా? పాత యముడివా?" అని అడుగుతానన్నారు. యమధర్మరాజు గాని "ధర్మం" గాని శాశ్వతంగా ఉండేవి. కాలుడు మారడు. కాలం మారదు. కాలమూర్తి మారడు. అటువంటి కాలమూర్తికి నమస్కారంబు సత్కీర్తికిన్ అని అశ్రుజలముల అర్ఘ్యమొసంగినవాడే మహాత్ముడు. ★



విజయదశమికి బొమ్మల కొలువు పెట్టిన భానుమతి

దివానుయొక్క వ్యక్తిగత దుష్కృత్యాల మీద ఎక్కువ కథ కేంద్రీకరించటం మూలంగా ఈ చిత్రం చాలా మామూలుగా ఉండిపోయింది. రైతుల కష్టాలన్నిటికీ దుష్టుడైన దివానును కారణంగా చూపించి, చివరి కతని ఆత్మహత్యతో సుఖాంతంగా ముగించబడిన ఈ చిత్రం పూర్వపు "రంగూన్ రౌడీ" లాంటి నాటకాల స్థాయిని ఏమాత్రం మించనిదిగా ఉంది.

కన్నాంబ, లింగమూర్తిగార్ల నటన యథాధోరణికి భిన్నంగాలేదు. శ్రీరామమూర్తి నాయక వేషధారిగా ముందుముందు స్థిరపడే సూచనలు కనిపిస్తున్నాయి. అంజలీదేవి నటననుగూర్చి చెప్పవలసింది కనిపించదు.

కథ రాసుకోవటంలో చాలా పొరపాట్లు జరిగాయి. దర్శకత్వం పురాతన ఫక్కీలో ఉంది. "రాణీ సంయుక్త' నాటకంలో రాజపుత్ర స్త్రీచేత స్వయంవర సభలో గంతులు వేయించటం, జానపద చిత్రాల్లోలాగ నాయికా నాయకులచేత ఉద్యానవనాల్లో డ్యూయెట్లు పాడించటం వగైరాలు ఎబ్బెట్టుగా ఉన్నాయి.

దేశంలో కరువు వచ్చినట్లు కొన్ని దృశ్యాలు చిత్రంలో చేర్చబడ్డాయి. ఈ దృశ్యాల్లో, ముఖ్యంగా నెరియలుపడ్డ నేలను చూపించిన దృశ్యం చాల గొప్పగా ఉంది. కరువు భీభత్సం యావత్తూ ఆ ఒక్క దృశ్యంలో ముద్రకట్టినట్లు కనిపిస్తుంది. ఈ దృశ్యాలు కథలో అంతర్భాగాలు గనక అయితే వాటికి హృదయాలను ఊపివేయగల శక్తి వచ్చేది. జెమినీ స్టూడియోలో తీయబడిన ఈ చిత్రం టె… కల్‌గా తృప్తికరంగా ఉంది. ★

"మాప్పిళ్ళై"

నేషనల్ ప్రొడక్షన్స్‌వారు తీసిన తమిళ సాంఘిక చిత్రం "మాప్పిళ్ళై" (పెళ్ళికొడుకు) యీ 20 న కాసినొ థియేటర్ లో పత్రికలవారికి చూపించారు.

నలుగురు ఆడవాళ్ళు, ముగ్గురు మొగవాళ్ళకు సంబంధించిన యీ కథ అనేక రకాలుగా మెలికలు మెలికలు తిరిగి, చివరికి యింతమందనీ ఒకే బంధువర్గానికి చేర్చి సుఖాంతంగా ముగుస్తుంది. ఇంతమంది వ్యక్తులకు సంబంధించినకథ కాబట్టి, చిత్రం దాదాపు నాలుగుగంటలసేపు నడుస్తుంది. ముఖ్య కథా వస్తువే దీర్ఘంగా వుండటం కాక, యింకా చిత్రాన్ని పొడిగించే కొన్ని భరతనాట్య ప్రదర్శనలు



భరణీ స్టూడియో ఆవరణలో భానుమతి.

ఏశైఉళవన్ "సమీక్ష" (47-వ పే

పెట్టినట్లు తోస్తుంది. అయితే ఈ సమస్య కథారూపం దాల్చకుండా వట్టి నినాదంగానే ఉండిపోయింది ఈ సమస్య స్వరూపం ఎలాంటిదో, దాన్ని పరిష్కరించటానికి ఏ పద్ధతులు అనుసరించాలో, ప్రజల్లో ఈ సమస్య ఎలాంటి చైతన్యం కలిగించిందో అనే విషయాల జోలి వదలిపెట్టి, జమీందారు దగ్గర ఉండే ?×

నృత్యనాటికలు ఆ చిత్రంలో బలవంతంగా జొప్పించారు.

ప్రస్తుతకాలపు పరిస్థితులను విమర్శించే కొన్ని కొన్ని సునిశితమైన వ్యాఖ్యానాలు కూడా ఆయాపాత్రలచేత పలికించారు. వున్న పాత్రలలో ముగ్గురికిపైగా విడవకుండా వూతపదాలు వాడుతూ వుంటే మితిమించినట్లున్నది.

సంభాషణలు చురుకుగా వున్నాయి. కథ సంభాషణలు వ్రాసిన వారు వి. ఎన్. సంబంధగారు డైరెక్టరు టి. ఆర్. రఘునాథ్ గారు. ★

సినిమా వార్తలు

మద్రాసు ఆర్టుప్రొడక్షన్సు పేరిట మాధురీదేవి తీస్తున్న "రోహిణి" సగంవరకూ తయారయింది. ఈ చిత్రం తమిళ తెలుగు భాషల్లో ఒకేసారి తయారవుతోంది. బంకించంద్ర నవల ఆధారంగా తయారయ్యే ఈ చిత్రంలో జి. వరలక్ష్మి, మాధురి, సహస్రనామం, ఎస్. ఎ. నటరాజన్, కె. రామస్వామి, ముత్తులక్ష్మి, లంకసత్యం మున్నగువారు నటిస్తున్నారు. వై. వి. రావు జమీందారుగా నటిస్తున్నాడు. దర్శకుడు కమల్ ఘోష్. కెమేరా పి. ఎల్. రాయ్. సంగీతం జి. రామనాథన్, కె. వి. మహాదేవన్. మాటలు, పాటలు బలిజేపల్లి. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలలకు సిద్ధం కాగలదని తెలుస్తోంది.


*   *   *

రాజా ప్రొడక్షన్సువారి "పుట్టిల్లు" త్వరత్వరగా షూటింగ్ జరుగుతోంది. ఇప్పటికి 18 రీళ్లుదాకా అయిపోయింది. ఇక రెండు చిన్న చిన్న సెట్లమీద పనితో చిత్రం పూర్తి కాగలదట.

*   *   *

ఇటీవల "లైఫ్ ఆఫ్ లెనిన్" (లెనిన్ జీవితం) అనే రష్యన్ డాక్యుమెంటరీ చిత్రం మద్రాసు వచ్చింది. లెనిన్ పుట్టినప్పటినుండి చనిపోయేవరకు, చనిపోయిన తర్వాత ఆయన భావాలను అనుయాయులు వివిధంగా ఫలింపజేస్తున్నారో, అదంతా కామెంటరీ సహాయంతో చిత్రం తీశారు. కమ్యూనిజం ప్రచారం అటుంచి లెనిన్ జీవితకథను చిత్రీకరించటంలో వారనుసరించిన టెక్నిక్ ముఖ్యంగా గమనించదగి వుంది. కామెంటరీలో ఏమాట వస్తే ఆ మాటకు తగినబొమ్మ వెంటనే తెరమీద పడుతుంది. "1870 లో లెనిన్ పుట్టాడు" అనగానే అతడు పుట్టిన గది వివిధకోణాలనుంచి వేర్వేరు షాట్లలో కనిపిస్తుంది. "అతడు ఈ గదిలో మార్క్సు పుస్తకాలు చదివేవాడు" అనే మాట రాగానే అత డుపయోగించిన కుర్చీ, బల్ల, పుస్తకాలు ఇవన్నీ కనిపిస్తాయి. అదిగాక రష్యన్ చిత్రకారులు లెనిన్‌ను వివిధ పరిస్థితులలో, భంగిమాలలో గీసిన బొమ్మలు కనిపిస్తాయి. ఇటువంటి లిఖిత చిత్రాలు వందలకొలది, ఇంకా అసంఖ్యాకంగా లొకేషన్ షాట్లు చిత్రమంతటా చూపించబడ్డాయి. వీటి నన్నిటినీ ఎడిట్

(56-వ పేజీ చూడండి)



స్టార్ క్రియేటర్స వారు తీస్తున్న "పరివార్" హిందీ చిత్రంలో సులోచనా ఛటర్జీ. చిత్ర దర్శకుడు ఆదర్శ. కెమేరా పి. సి. సిన్హా.

గంపసంసారమ్

(6-వ పేజీ తరువాయి)

నా ప్రాంతం నా మీదనే ఆగ్రహించినట్లుగా అదరిపోయి సైకిలుమీద పడి అదే పరుగుతీయడము తీశాను. విచిత్రమేమంటే- వొకే స్థలం వొకేవ్యక్తిమీద యెన్ని రకాల ప్రభావం కలిగివున్నదో చూచారా!

కాని ఆనాడు అలసివున్న నాకా చెరువుగట్టుమీది ఆ ముసిడి చెట్టునీడ యెంతో హాయినిచ్చింది. చెరువులో నీరు కదలడం లేదు. చెట్టు ఆకులూ కదలడం లేదు. కాని ఎర్రని ముసిడిపళ్ళు యెంతో ముచ్చటగా కనుపించాయి. గట్టిపడిన రేగడి మంటి గట్టుమీద వెలకిలా పడుకొని ఆకాశం వైపు చూస్తున్న నాకు - ఆ సమయంలో అంతకు మించిన హాయి నీయగల చోటు వుండనే వుండదనిపించింది.

ఆ సుందర ప్రశాంతి వాతావరణం నా హృదయానికి గిలిగింతలు పెడుతూవుంటే ఆ ఉత్సాహాన్ని పదింతలు పెంచడానికో యన్నట్లుగా - ఎదురుచూడ వీలులేని పిల్లనగ్రోవిస్వనాలు వినిపించాయి. నాకు ఆశ్చర్యమే వేసింది. ఏమా అని కొంచం తలయెత్తి చూచాను. ఆ శ్రావ్యధ్వనికి తోడు గల్లుగల్లుమనే మువ్వలు కావు కాని, యించుమించు అదే శబ్దాలు చేసే - పూసలు గవ్వలు - ధ్వని వినవచ్చింది.

లేచి కూర్చున్నాను. ధ్వనివస్తున్న దెస చూచాను. క్రమేణా పదాల సవ్వడి వినవచ్చింది. లేత కంఠంకూడా మెల్లిగా విననయింది. చూచాను; ఆ పిల్లనగ్రోవి వూదుతున్నది వొక పాతిక సంవత్సరాల చెంచు. అతనివెంట నాలుగైదుయేండ్ల బాలిక. అతనివెనుక నెత్తిమీద పెద్ద గంప పెట్టుకొని ఉత్సాహంగా అడుగులు వేస్తున్న స్త్రీ. ఆమె చంక నొక పాపాయి వ్రేలాడుతున్నది.

ఆ ప్రాంతంలో వాళ్ళూ నేనూ; మరెవరూ లేరు. నేను వాళ్ళనే చూస్తున్నాను. వాళ్ళూ నాకురించే అనుకుంటూను, మాట్లాడుకుంటున్నారు.

నేనున్న ముసిడిచెట్టుప్రక్కనే వరుసగా వంగివున్న మూడు యీతచెట్లనీడను వారాశ్రయించారు.

ఆమె తలమీది గంపను అతడు దించాడు. మొలనున్న తాటాకు సంచిలోనుంచి యిన్ని పిట్టలను చేతపుచ్చుకున్నాడు. రెండో మూడో ఆమె చెంత వదలి మిగిలిన వాటిని తీసుకుని వడివడిగా వెళ్ళిపోయాడు యువకుడు.

నా కర్థమయింది ; అతడు భర్త ; ఆమె భార్య ; ఆ యిరువురూ వారి సంతానం.

భర్త వెళ్ళగానే ఆమె యిన్ని రాళ్ళను ప్రోగుచేసింది. యిన్ని చిదుకులు యేరింది. పొయ్యి రాజేసింది. నేల పడివున్న పిట్టలను శుభ్రం చేసింది ; నిప్పుసెగను కాల్చింది.

తరువాత గంపమీది గోనెబరకా తీసి క్రింద పరచింది. పాపలను పండబెట్టింది. గంపలోనుంచి చట్టెలు తీసింది. ముక్కలు కోసిన పిటలను వాటిలో వేసింది. యింత ఉప్పు యితరవస్తువులు యేవేవో వేసింది. మూత పెట్టింది. ఆమెకూడా ఆ పాపల ప్రక్క నిద్రపోయింది.

అరగంటలో పిట్టలతో విలేశ్వరం వెళ్ళిన చెంచుయువకుడు తిరిగి వచ్చాడు. భుజంమీదినుంచి చిన్న బుంగ దించాడు. వెదురుగొట్టం జాగ్రతగా భార్యకు అందించాడు. దారిలో దొరికిన పండు అంటూ వొక చలితాటిపండు భార్య కిచ్చాడు.

చెంచువాని భార్య బుంగలోని ముతక బియ్యం తీసి కడిగి కుండలోబోసి పొయ్యి మీద పెట్టింది. వెదురు బొంగులోని నూనెను పిట్టల చట్టిలో పోసి కలిపి, పొయ్యికి మరొకప్రక్కలి అమర్చి సన్నని మంట మీద పెట్టింది. అవి మెల్లిగా ఉడుకుతూ వుంటే తాటిపండు చిదుగగొట్టి ముగ్గురూ మూడు టెంకలూ చీకుతూ తమాషాగా తృప్తిగా హాయిగా కబుర్లు చెప్పుకొంటూ కూర్చున్నారు. ఆ దృశ్యం నాకెంతో ఆనందాన్ని యిచ్చింది.

ఆడపిల్ల తాటిటెంక చీకుతూ గంతులు వేస్తూ ఆడుకొంటూవుంది. స్త్రీ యెడమ చేతిలోని పుల్లతో కుండలోని కూటినీ, చట్టిలోని కూరనూ కలుపుతూవుంది. ఇంతలో ఠప్ మని శబ్దం కాగా ఆడుతూ వున్న పిల్ల నీటివైపు పరుగెత్తింది.

నాకు భయం వేసింది. చటుక్కన లేచాను.

నా ఆవేదన చూచిన ఆ చెంచు నవ్వుతూ ‘బాబుగారికి భయం అక్కర్లేదు. అది నీట్లో దిగదండి, దిగినా జల్లలా యీదగలదండి” అన్నాడు.

నేను యింకా చూస్తూవున్నాను. ఆ పిల్ల పరుగున వెళ్ళింది. ఎందుకో అనుకొంటూ

బూట్ల షాపులోకి ఒకడు వెళ్లి తనపాదం కంటె బాగా చిన్న బూట్లు ఎంచి తీశాడు. షాపు మనిషి "ఇవి మీకు సరిపోవు సార్," అన్నాడు.

"సరిపోవు కనకనే తీసుకున్నాను. నాకు జీవితంలో సుఖమనేది లేదు. ఆఫీసులో అధికారి బాధ బయట అప్పుల బాధ, ఇంట్లో పెళ్లాం బాధ, మంచం మీద నల్లుల బాధ- అన్నీ బాధలే. నాకు మిగిలినది-ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లి ఇరుకు బూట్లు విప్పుకున్నప్పుడు వచ్చే సుఖం ఒక్కటే.

వుండగానే నీటిలోనుంచి గట్టు మీదకు త్రుళ్లిపడిన మూరెడు చేప—, తిరుగా నీటిలోకి దొర్లిపోవకముందే చెంగుమని దూకి వెళ్లి పట్టుకొని తీసుకువచ్చింది ఆ పిల్ల.

ఆ చేప ప్రాణంతోనే వుంది. దానిని పిల్ల తల్లికి యిచ్చింది. "రేపు కూరకి" అంటూ ఆ చేప నామె అందుకుని కుమార్తె తెలివికి ఆమెలో ప్రేమ ఉప్పొంగగా ముద్దు పెట్టుకున్నది.

ఫలహారం అయింది. పొయిలోని చితుకులూ ఆరిపోనున్నవి. స్త్రీ వడివడిగా చేప పొట్టను చీల్చింది. ముక్కలు కోసింది. బుంగలో యింకా వున్న ఆ కొద్దిపాటి రూకతో మరొక చట్టిలో వేసి సిద్ధపరచింది.

పొయ్యిమీది పాత్రలు దించింది. చేప ముక్కలు చట్టెను దానిమీద పెట్టి సన్నని సెగ యెగదోసింది.

స్త్రీ గంప తడిమింది. గంపలోనుంచి - చిల్లులుపడిన పాతపింగాణీ చిప్పలు వాటిని యెదుట పెట్టింది. వండినదానిని వాటిలో వడ్డించింది. నేనంతా చూస్తూ వున్నాను.

ఇంతలో ఆ దంపతులు లోలోన యేమో మాట్లాడుకున్నారు. ఆ యువకుడు నన్నుద్దేశించి 'అజ్ఞ యిప్పిస్తారా' అని అర్థమయేట్లు అన్నాడు. అది మర్యాదకాబోలునని గ్రహించి కావివ్వమన్నాను

యువకుడు ఒక పిడికెడన్నము ఆ చెరువులో విసిరాడు. ఆ మెతుకులకని చెరువులోని చేపలు కొంచము శబ్దము చేశాయి.

ఆ దంపతులు, వారి అమ్మాయి - ఆ యీతచెట్లనీడలో ఆ వండుకున్నదాన్ని యెంతో తృప్తిగా తింటూవుంటే నాకేమో పరిపరి విధాల పోయింది మనసు! ఇంత తృప్తిగా తింటున్నారంటే కారణం ఆమె అంత చక్కగా వంటచేయగలిగిందా, లేక వాళ్ళకు అన్నముయొక్క రుచితో అవసరంలేనియంత ఆకలి వున్నదా - అనుకున్నాను. ఆ ముగ్గురూ తింటూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ వున్నారు. మన ఇళ్ళలో కాలి తడియారకుండా తిని లేచిపోవాలంటారేగాని, యింత తీరికగా, ఆనందంగా తినడానికి వీలేవుండదు గదా అని విచారించాను.

చట్టీ కుండా రెండూ ఖాళీయైపోయినవి. స్త్రీ ఆ రెంటినీ చెరువులో కడిగి గట్టు మీద ఆరబెట్టింది. పొయ్యిమీది చట్టి దింపి మూతపెట్టి గంపలో భద్రపరిచింది. క్రింద పరచిన గొంగళిమీద అంతా హాయిగా విశ్రమించారు.

నాకా సంసారం యెంతో ముచ్చటగా కనుపించింది; అనిపించింది. వాళ్ళు నిద్రపోతూవుంటే నేను కూర్చునే చూస్తున్నాను.

నాలుగు గంటలకు లేచారు. ఆమె గంప సర్దుకున్నది. ఇక ప్రయాణమయేలా వున్నారు. నేనా చెంచుతో ముచ్చటించాలనే అంతసేపూ వుండిపోయాను.

చెంచు నాదగ్గరకు వచ్చాడు. అతనిని అనేక ప్రశ్నలు వేశాను. వాళ్ళది సంసారం. గంప సంసారం. భార్య మోసే ఆ గంపలో వున్నదే వారి సర్వస్వమూను. పిట్టలను కొట్టడం, వాటిని అమ్మడం, అమ్మగా వచ్చినదానితో గింజలు నూనె సంబారాలు - అంతకు మించి రావట. అంతకుమించి వాళ్ళకు యేమీ అవసరం లేదట. "బతకడానికి పొట్టకు యేదో యింత కావాలి బాబూ, అదేదో దొరుకుతున్నది. ఇవ్వాళ యిక్కడ, సాయంత్రానికి పక్కవూరు చేరుకుంటాం బాబూ," అంటూ ఆ చెంచు చెప్పాడు.

వారిది గంప సంసారం. ఐనా వారికి దానిలో ఆనందం వుంది. హాయి వుంది; తృప్తి వుంది. వారి జీవితంలో పరమ వేదాంతం వుంది. సహజత వుంది.

ఆ గంప సంసారానికి కుటీరం లేదు; ఆస్తి లేదు; ఒకచోటు కాపురమని లేదు ఐనా ఆనందము, తృప్తీ వున్నాయి ఇదే గదా సుఖసంసారానికి కావలసిన వనుకుంటూ ఆ తరువాత సైకిలుమీద యిల్లు చేరాను. ★

తలరాత

(10-వ పేజీ తరువాయి)

ఆవేళ దీపావళిపండుగ. స్టూడియో లేనందుచేత, తెల్లవారి నిద్రలేచినవాణ్ణి బద్ధకంగా అలాగే పడుకొనివున్నాను. శర్మ ఈలవేస్తూ వచ్చి కూర్చొన్నాడు. నేను మంచంమీద లేచి కూర్చొని "ఎప్పుడొచ్చావ్ శర్మా?... ఇదేమిటి ఎన్నడూ లేనిది ఇవ్వాళ మా గదికి" అన్నాను. ఎగిరి గంతేసి "ముందు ఒక్క షేక్-హాండ్ ఇచ్చేసి ఆ మైకంలో పడిపో"అని అమితానందోద్రేకంలో చేయి జాపాడు శర్మ. "ఏమిటో చెప్పవోయ్" అని నేను ఓవైపున తెల్లబోయి అడుగుతూంటే - నాచేయి నాకు తెలీకుండానే అతనిచేతిలో నలిగి పోయింది. జేబీనించి ఒక కార్డు తీస్తూ "మా మామకు క్షయట. ఎలాగో నావిలాసాన్ని తెలిసికొని, ఆయనే స్వయంగా ఉత్తరం రాశాడు" అని ఆనందంలో మునిగి తేలుతున్నాడు శర్మ.

"అరె! క్షయా?... అందుకు నువ్వు సంతోషిస్తున్నావా?" అని తికమకలు పడుతూ అడిగాను.

"ఇందా...ఇది చదువుకో" అని జాబు నా మీదికి విసిరేసేశాడు. ఆ జాబులో వాళ్ళ మేనమామ తను నాలుగయిదు నెలలుగా క్షయరోగంతో బాధపడుతున్నట్లూ, తానిక బ్రతికి నన్ని రోజులు బ్రతకలేడు కనుక ఇందిరను శర్మచేతిలోపెట్టి కళ్ళు మూయాలనీ ఇంకొక ఏడెనిమిదిరోజుల్లో మంచి లగ్నాలున్నాయనీ, ఉన్న వ్యవధిలోనే అతివైభవంగా జరుపదలిచాడు కనుక, ఇదొక టెలిగ్రాంగా భావించి నిలుచున్న పళంగానే శర్మను బయలుదేరి రమ్మని పదేపదే వ్రాశాడు. జాబంతా చదువుకొని "అయితే ఇపుడు నువ్వేమి టనుకుంటున్నావ్" అని ప్రశ్నించా. "అనుకోవట మేమిటి, రాత్రే ప్రయాణం...ఊఁ... బెడ్డింగ్ గిడ్డింగ్ సర్దుకో" అని మంచం మీదనించి లేవదీశాడు నన్ను.

"అరెరె.... నే నెందుకోయ్...క్షమించాలి. ఈ పరిస్థితుల్లో నేను రాలేను... కేమరా అసిస్టెంట్‌గా కాంట్రాక్ట్ సైన్ చేసింది మొన్న నేనన్న సంగతి నీకు తెలిసిందేగా...మా స్టూడియోవాళ్ళ సొంత ప్రొడక్షన్ "వీరనారి" షూటింగ్ రేపుంది. అదీ లాంగ్‌షాట్... నేను కనక దగ్గరుండకపోతే ఛీఫ్ కేమరామేన్ పని సున్నే..." అన్నాను నేను.

"సరే రాకపోతే పోయావ్ గానీ, ఇంకో వారం రోజుల్లో ఏదో ముహూర్తాలున్నాయని రాశాడుగా...అంచేత వెళ్ళాక ఎప్పుడో తెలుసుకొని ఒక శుభలేఖ పంపిస్తా... ఇక్కడ్నించే ఆశీర్వాదాలు విసిరెసేయ్."

"దానికేం గానీ...అన్నట్లు మీ సేటు మంజూరీ చేశాడా నీకు శెలవు?"

"వాడు మంజూరు చేయకపోవడమేమిటి?" అని ఏదో చిత్రంగా నవ్వుతూ అన్నాడు. ఆ నవ్వుకు అంతరార్థమేమిటో నా కానాటికి తెలీదు. "ఆఁ...వస్తానోయ్... పెట్టే బేడా సర్దుకోవాలి. బోలెడంత పనుంది.. సాయంత్రం ఆరుకే రైలు. వెళ్లేటప్పుడు ఓమారు ఇటొచ్చిపోతాలే...స్టేషన్‌కు రాగలవా...వస్తా" అని ఒకేగుక్కలో పలికి నా జవాబుకు ఎదురు చూడకుండా నిష్క్రమించాడు. అంతే వెళ్ళినవాడు అదే పోత...మళ్ళీ నా గదితట్టు రానేలేదు. అతను వెళ్లి వుంటాడో లేదో తెలుసుకొనేందుకని మర్నాడు వుదయం అతని గదివైపు బయలుదేరా. కొద్దిదూరంలో వుండగానే, అతని గది ముందు కొందరు మూగివున్నట్లు కనపడే వరకూ ఏం కొంప మునిగిందోనని గాభరాతో దౌడు తీశా. అతని గది తలుపులు తీసున్నాయ్...లోపల ఒక్క సామానూ లేదు. ఇంతలో అక్కడున్న సేట్ హిందీలో ప్రక్కనున్న మనిషితో అంటున్నాడు.

"శర్మాజీ నూరురూపాయలు ఎక్కువగా ఎత్తుకొని పోయినందుకు నా కేమాత్రం విచారంలేదు మిస్టర్! ఇంతపనితీవ్రతలో ఎవరితోనూ చెప్పకుండా చెయ్యకుండా అదీ నేను ఊళ్లోలేని సమయాన వెళ్ళిపోవటమే నా కమిత కష్టంగా వుంది. నేను తలవని తలంపుగా ఈవేళ వచ్చేశాను గనక సరిపోయింది, లేకపోతే ఈవేళ ప్రెస్ ఎలా పని చేసేది...ఎంత నష్టం వచ్చి వుండేదీ...నిజంగా శర్మాజీ ఇలా చేస్తాడని నే నెన్నడూ అనుకోలేదు" నిన్న శెలవుగురించి ప్రశ్నించిందానికి, జవాబుగా శర్మ నవ్వినన వ్వుకు అర్థమేమిటో ఇప్పుడు నాకు తెలిసింది. బరువెక్కిన హృదయంతో మెల్లిగా కాళ్లీడ్చుకుంటూ నా లాడ్జ్ ముఖం పట్టా.

లగ్నపత్రిక పంపిస్తానని వెళ్ళాడే కానీ, వెళ్లిన మనిషి ఒక కార్డయినా రాసిన పాపానపోలేదు. బహుశః అతనికి నా సరియైన విలాసం తెలిసుండక పోవచ్చు. అతను నా అడ్రసునైనా అడిగి తెలుసుకొనుంటే బావుండేది. చివరికి ఉత్తర ప్రత్యుత్తరాలు లేకపోగా, మా ఇద్దరిమధ్యా వున్న స్నేహం అడుగంటకుండా ఉండాలని ముక్కోటి దేవతలకు మ్రొక్కుకున్నా.

శర్మ వెళ్ళిపోయాక అత నంతటి మనిషితో కానీ, కనీసం తెలుగువచ్చిన ఇంకొక మనిషితోకానీ నాకు పరిచయం కాలేదు. ఒకవేళ పరిచయమై వుండినా అది అంత ఇదిగా వుండేదికాదు. శర్మవెళ్ళిపోవటం నా అమిత ఆప్తుల్లో ఒకరు వెళ్ళిపోయినట్లుంది. ప్రతిదినమూ స్టూడియోకు వెళ్ళేటప్పుడు శర్మ వుంటూండిన గది ముందుగా వెళ్ళాలి...ఆ గది చూసినప్పుడల్లా నా మనసులో ఏదో చెప్పలేని ఆవేదన కలిగేది....క్రమేణా బొంబాయివాసం విసుగెత్తుతూ వచ్చింది నాకు.

ఎనిమిది నెలలు గిర్రున కాలప్రవాహంలో కొట్టుకుపోయాయి. నా పేరు ప్రఖ్యాతులు విని మద్రాసునించి ఛీఫ్ కామెరామేన్‌గా ఆహ్వానం వచ్చింది. ఒక శుభ దినమున, వారి ఆహ్వానాన్ని మన్నించి వెంటనే మద్రాసొచ్చిపడ్డాను. నా కింతటి ఉద్యోగం దొరికిందన్న సంతోషంకంటే, శర్మ వుండే ఊరికి దగ్గరగా వచ్చానన్న సంతోషమే ఎక్కువగా ఉండింది. ఎప్పుడైనా వీలు దొరికితే, నెల్లూరి కెళ్ళి శర్మ గురించి వాకబుచేయా లనుకున్నాను. ఆ అదృష్టం కూడా నాకు కలిసొచ్చిందనే చెప్పాలి. పెన్నానది వరదల్లో వుందని తెలియంగానే, మా చిత్రంలో వరదల సీన్ లున్నందున కొన్ని షాట్సు తీసేందుకు, మా డైరెక్టరు ఉన్నట్లుండి ఒక రోజు నెల్లూరికి పిలుచుకుని వెళ్లాడు. పెన్నా షాట్సు తీస్తున్నానే కానీ, నా మనసంతా అక్కడ లేదు—అంతా శర్మ మీదనే వుంది. ఎప్పుడు వచ్చిన పని ముగుస్తుందా, ఎప్పుడు శర్మను చూస్తామా అన్న ఆత్రంలో వున్నాను. మా కెమెరా చుట్టూ ఎంతో జనం మూగి వుంటే "అడ్డం లేవండీ...కాస్త తప్పుకోండీ" అని మా డైరెక్టర్ కేకలు పెట్టున్నాడు. ఎదురుగా పెన్న హోరున శబ్దం చేస్తూ పొంగిపొరలి ప్రవహిస్తోంది..... సూర్యునికి అడ్డంగా మబ్బు రావటంచేత ఎండ తగ్గిపోతూంది. "ఇహలాభంలేదు.. ఇప్పట్లో ఎండవచ్చేటట్లు లేదు. మళ్లీ మధ్యాహ్నంవచ్చి ట్రైచేద్దాం"అన్నాడు

మా డైరెక్టరు. చెమట తుడుచుకుంటూ మెల్లిగా ప్రక్కకు తిరిగి చూశా - అప్రయత్నంగా. ఒక వ్యక్తి ఎందుకో దొంగతనంగా జారుకుంటున్నాడు. నా కనుమానంకల్గి పెద్ద అంగలు వేస్కుంటూ వెళ్ళి ఆవ్యక్తిని పట్టుకొని తేరిపార చూశా ... "ఇదేంటి శర్మా! ఇలా ఐపోయావ్?" అని నాకు తెలియకుండానే నానోటినించి మాటలు జారిపోయాయ్... శర్మ నా మొహంకేసి చూడలేకపోతున్నాడు.

"ఊ...రా..." అని అతనినికూడా మా కారులోనే లాడ్జికి పిలుచుకొని వెళ్లా. మంచంమీద కూర్చొని ఆవైపు మొహం త్రిప్పుకొని చిన్నపిల్లాడిలా ఏడుస్తున్నాడు శర్మ!

"భోజనమైందా?" అని అడిగా. జవాబు లేదు. తర్వాత అంకుశంతో పొడిచినట్లు గుచ్చిగుచ్చి అడగగా చెప్పలేక చెప్పలేక చెప్పుకొచ్చాడు.

"పెళ్లయిపోయిన మర్నాడే మా మామ గతించాడు. ఇందిరతో, నేను బొంబాయిలో ఒక ప్రెస్‌లో మేనేజరుగా పని చేస్తున్నాననీ, శలవుమీద వచ్చాననీ చెప్పాను. 'ఎప్పుడెళ్లుతామండీ బొంబాయికి, బొంబాయి ప్రయాణం ఎప్పుడండీ' అని ప్రతిదినమూ ఇందిర నన్ను వేధించుకు తింటూండేది. 'పోదాం ఉండూ......తొందరపడితే ఎలాగ......మూడున్నర ఏడాదిగా బొంబాయివాసంతో విసుగెత్తి వచ్చానా? ఇక్కడ పాత మిత్రులందర్నీ చూసింది కానీ, తర్వాత వెళ్దాం' అని ఎలాగో అబద్ధాలు చెప్పి, కొన్నిదినాలు నెట్టుకొని వచ్చాను. చివరికి ఒకదినం నిలదీసి అడిగేసింది ఇందిర: 'ఇంకా ఇక్కడ ఎన్నాళ్లని గండగలమండీ?...ఇక్కడ వున్న కొద్దీ మనకు మర్యాద వుంటుందా? అందరూ అడుగుతున్నారు నన్ను బొంబాయికి ఎప్పుడు వెళ్లేదని...వాళ్లందరికీ ఏం జవాబు చెప్పమంటారూ?' అని వెక్కివెక్కి ఏడుస్తూ అడిగింది. ఆరోజు రాత్రి ఇందిరతో ఏదో ఒకఅబద్ధం కల్పించిచెప్పక తప్పిందికాదు. నేను పనిచేస్తూన్న ప్రెస్ దివాలా తీసిందనీ, అంచేతనే నే నీవూరు రావటమూ పెళ్ళిచేసుకోవటమూ జరిగిందనీ, లేకపోతే నిన్ను పెళ్ళిచేసుకుంటానని నే నెన్నడూ అనుకోలేదనీ, ఏదో అప్పటికి తోచింది నాలుగుకోతలు కోసేశా. దానితో దాదాపు గుండె ఆగినంత పనైంది ఇందిరకు. ఏడవడం మొదలెట్టింది. అంతటితో ఆగక, మొగుడినన్న గౌరవమైనా లేకుండా, చిటికి మాటికి నానా మాటలు అనడం మొదలెట్టింది నన్ను. అప్పట్నించి ప్రతిదినమూ జగడాలూ ఏడ్పులూతప్ప ఇంకోమాటలేదు. చిన్నప్పటి ఇందిరకూ, ఇప్పటి ఇందిరకూ ఎంతో భేదం వుందన్న సంగతికూడా నాకు అప్పుడే తెలిసింది. నేనుండేస్థితి తెలిసుండీకూడా, సానుభూతి చూపించకపోగా, ఒకరోజు ఫేస్‌పౌడర్ తెచ్చీమనీ, ఇది తెచ్చీమనీ, అది తెచ్చీమనీ చంపుకొని తినేది ఇందిర. ఎలా తెచ్చిగలను చెప్పు...ఆ మైన 'ముష్టి ఫేస్‌పౌడర్ డబ్బీ తెచ్చిచ్చేందుకు యోగ్యతలేనివాడు, అక్కడేదో బొంబాయిలో పెద్ద గవర్నర్ గిరీ చెలాయిస్తూన్నట్లు అబద్ధాలాడి నాగొంతెందుకు కోశావ్' అని మొహంమీదనే అడిగేస్తూంటుంది. పెళ్లంటే ఏదో స్వర్గసుఖాలనుభవించడానికి తగిన అవకాశమనీ, అందులో ఇందిరవంటిదానితో పెళ్లి జరగడం నిజంగా నా పూర్వజన్మఫలం అని అనుకున్నాగానీ, ఇలా నానా ఇక్కట్లకు గురి అవుతానని ఏమాత్రం తెలిసున్నా, నేనిలాంటి పిచ్చిపని చేసుకునేవాణ్ణా?" అని కళ్ళనీళ్లు కారుస్తూ అన్నాడు శర్మ.

సిగరెట్‌ను అందివ్వబోయాను. మానేశానన్నాడు. "అది సరేకానీ...మీ అత్త వుందికదా, ఆమేమంటుంది" అని అడిగాను. "చెప్పాల్నా...దీని అమ్మ అది... ఇద్దరూ ఒకరికొకరు డిటో...ఆమెకూడా నా ఎదురుగా అనదుకానీ పరోక్షంగా నానా మాటలు అంటూంటుంది. ఎలాగో అన్నిటికీ సహించి ఊరకుండక తప్పుతుందా?.. అంతా నా తలరాత తప్ప ఇంకేమిటి - నేనూ శక్తివంచన లేకుండా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూనేవున్నా. ఈ కాలంలో ఉద్యోగాలు దొరకటం ఎంత కష్టమైనపనో నీకు తెలీనిది కాదు." అని శర్మ అనగా "పోనీ బొంబాయివెళ్ళి మళ్ళీ మీ సేట్ దగ్గర ప్రయత్నించకపోయావా?" అని ప్రశ్నించాను...

"మళ్ళీనా!" అని మొహం చిన్నబుచ్చుకొని "ఎలా వెళ్ళేది వేణూ?... వెళ్ళితేమటుకూ, సేట్‌జీ ఉద్యోగమిస్తాడనుకోమంటావా?... తొందరపడక ఇంకొక నాల్గురోజులు ఆగి, తర్వాత శలవు తీసుకుని వచ్చివుంటేనన్నా అదోకవిధంగా వుండేది" అని సిగ్గుతో తల వంచేశాడు శర్మ. అవమానంతో క్రుంగిపోతున్నాడు. "పోనీ... లేవోయ్...మద్రాసు వెళ్లాక - నాకెందరితోనో పరిచయం వుంది... ఎవరితోనైనా చెప్పి నీకొక ఉద్యోగం ఇప్పించలేనా" అన్నాను. ఆ మాత్రానికే శర్మ ఏడుపు దిగమింగుకుంటూ "ఆమాత్రం సాయంచేసిపెట్టు వేణూ!...నా చర్మంతో చెప్పులుకుట్టిస్తా" అన్నాడు. శర్మ ఇంతగా దిగజారిపోయినందుకు నా కెంతో కష్టంవేసింది.

"ఇందిరా-ఇందిరా అని తల్లడిల్లిపోయి, తల క్రిందులైనావ్ కానీ, ఇపుడు ఇందిరను పెళ్లిచేసుకుని నువ్వేం సుఖపడుతున్నావంటా? ఇందిరతో తప్పితే నీకసలు పెళ్ళే కాదా అని అడుగుతా?? వృధాగా తొందరపడి ఈ స్థితికొచ్చావ్. కానీ, ఇందిరసంబంధాన్ని తలదన్నే తాతలట్లాంటి సంబంధాన్ని తెచ్చి నీకు చేసేవాణ్ని - ఏంటనుకుంటున్నావో నువ్వు?" - అని ఇంకా ఏదేదో చెప్పబోతూంటే నా అర్థంలేని ఆవేశాని కడ్డుపడి "చాలు వేణూ! చాలు, గాయపడిన నాహృదయాన్ని ఇంకా బాధించకు...తప్పంతా నాదే వొప్పుకుంటున్నాను. నేను చేసిన తప్పిదానికి తగిన ప్రాయశ్చిత్తాన్నే ఇప్పుడు నేను అనుభవిస్తున్నాను ... నే నిదివరకూ నీకేదైనా సహాయంచేసివుంటే దానికి ప్రతిఫలంగా, నీ ఇన్‌ఫ్లుయన్స్ ఉపయోగించి నాకొక ఉద్యోగం ఇప్పించి నా జీవనోపాధికి మార్గం కలిగించు...చస్తే నీ కడుపున పుట్టాను" అన్నాడు శర్మ.

"నువ్వు చావనూవద్దు నా కడుపులో పుట్టనూవద్దు. కానీ, నీ సరియైన అడ్రసు చెప్పు" అని కాగితం కలమూ తీసుకుని అతని విలాసాన్ని రాసుకుని, నా విలాసాన్నీ అతనికి రాసిచ్చి "ఇలా చూడు శర్మా! మనమనుకునే పనులు సవ్యంగా నెరవేరకపోవడం, మానవునిపట్ల జరిగే అన్యాయాలలో ఒకటి. అంతమాత్రానికే జీవితంలో దిగజారుడూ, జీవితంపై అసహ్యం రోత, ఇలాటివి కలగాల్సిన అవసరం ఏమాత్రమూ లేదు. దానికి తావిస్తే నిజంగా భవిష్యత్ అంధకారమే! అసలెప్పుడూ మన అంచనాలు అత్యున్నత శిఖరాలనంటేటట్లుండడం అంత మంచిదికాదు. ఎందుకంటే-అవి నెరవేరనప్పుడు అంత ఎక్కువగా విచారపడాల్సొస్తుంది. అందుకని జీవితాన్నెప్పుడూ మామూలుగా, సాఫీగా నడుపుకుంటూంటే, కష్టసుఖాలెప్పుడూ అంత తీవ్రంగా బాధించవు. ఐతే సాహసాలు చేసేవాళ్ళకు ఈసూత్రం పనికివస్తుందని నేననలేను. ...అంతే!... జీవితంలో ఎంతవరకూ దిగజారిపోవాలో అంతవరకూ దిగజారి పోయ్యావు నువ్వు.

నీవు ఎలాటి స్థితిలో ఎక్కడున్నా ఎప్పటి కప్పుడు నీ స్థితిగతులనూ, ప్రయత్నాలనూ, మిత్రుడైన నాకు తెల్పడంలో నీకొచ్చే అవమానమూ తప్పూ ఏమాత్రం ఉందని నేననుకోను." అని ఒక పెద్దగా

తలరాత

ఇచ్చాను. నే చెప్పిందంతా శర్మ విన్నాడో లేదో చెప్పలేను. కాని [illegible] తాగినవాడి మొహంపెట్టి ఏదో దిగాలుగా నీరు కారుతూండటం మాత్రం గమనించా. ఇంతలోగా హోటల్ కుర్రాడు కాఫీ ఫలహారాలను తెచ్చి టేబిల్ మీదపెట్టి వెళ్ళబోతూండగా ఇంకో కాఫీ తెమ్మని వాడితో చెప్పేసి “ఊఁ...తీసుకో శర్మా...నా కోస్తుందిలే” అన్నాను. తిండితిని ఎన్నో రోజులైన వాడిమల్లే గబగబా తినేశాడు. కాఫీ త్రాగుతూ “వేణూ! ఒక టూరుపీస్ వుంటే ఇవ్వు...ఉద్యోగం దొరకంగానే నీ డబ్బు నీకు పంపించేస్తా” అని సిగ్గుతో అదోలా మొహంపెట్టి అడిగేసరికి దాదాపు గుండె ఆగినంత పనైంది నాకు. నిజంగా ఎట్లాంటివాడికి ఎట్లాంటిస్థితొచ్చి పడిందిపుడు అనుకుంటూ లేచి కోటుజేబీనించి మనీపర్సు తీశా. పదిరూపాయలనోట్లు ఏడున్నవి. రెండు పదిరూపాయలనోట్లను తీసి శర్మ చివిగిన పర్సు జేబీలో దూర్చుతూ “ప్రస్తుతానికి దగ్గర ఇవి వుండనీ, మద్రాస్ వెళ్లాక కొంత పంపిస్తా” నన్నాను.

“ఇంతెందుకూ, రొండె చాలంటూండేవే? పైగా మద్రాసుకు వెళ్ళి వెగ పంపిస్తానంటున్నావా?” అని తెల్లబోతూ అడిగాడు శర్మ. “పర్వాలేదు ఉంచుకో” అని చెప్పేసి వేరే టాపిక్ లోకి దించేశా. ఇంకా ఏవేవిటో వాడు దాదాపు తొమ్మిదినెలలుగా పడుతూండిన కష్టాలన్నిటినీ చెప్పుకువచ్చాడు. “ఏమోనోయ్. నాకెంతో భయంగావుంది... ఎక్కడ చూసినా రిట్రెంచ్మెంటులు... నాకెప్పుడు ఉద్యోగం దొరుకుతుందో ఏమో...నాకు ఉద్యోగం దొరకాలీ— ఇందిర గర్వంఅణచాలీ...అది నన్నీస్థితిలో ఎంతేసి మాటలాడి ఎన్నెన్ని బాధలు పెట్టిందో, దానికి వడ్డీతోసహా అనుభవించేటట్లు చేస్తాను...నాకుఉద్యోగం దొరకాలీ ఇందిర గర్వం అణచాలీ...”

“ఉద్యోగం దొరకాలీ-ఇందిర గర్వం అణచాలీ” ఈ మాటలే మద్రాసు కొచ్చాక కూడా ప్రతి దినమూ నా చెవుల్లో గింగురుమంటూన్నవి. వచ్చిన రెండు నెలలుగా శర్మకు ఉద్యోగంకోసం నా శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నా. కానీ ఇంతవరకూ నా కృషిఫలించలేదు... శర్మకు ఎప్పుడు ఉద్యోగం దొరుకుతుందో-వాడెప్పుడు ఇందిర గర్వం అణుస్తాడో ఏమిటో-అంతా అయోమయంగా ఉంది. ఇంతకీ-వాడి తలరాత ఎలా వుంటే అలా నడిచి తీరుతుంది.

సినిమా వార్తలు

(51-వ పేజీ తరువాయి)

చేసి కేవలం డాక్యుమెంటరీ చిత్రంలో “ఇమోషన్” సృష్టించటం అద్భుతమైన ప్రజ్ఞగా తోస్తుంది. మన దేశంలోను, అమెరికా మొదలైన దేశాల్లోను చిత్రనిర్మాణంలో ప్రధానవ్యక్తి దర్శకుడు. ఎడిటింగ్ పనిని మనం అప్రధానంగా పరిగణిస్తాము. రష్యాలో అట్లా కాదు. ఫిలిం షూట్ చెయ్యటం అయిపోయిన తర్వాత కూడా దర్శకుడు చెయ్యవలసిన పని ఎంతో ఉంటుంది. అక్కడి దర్శకులు ఎడిటింగ్ పనికూడా తామే చేస్తారు. రష్యన్లు ఎడిటింగ్‌ను ఒక కళగా పెంపొందించారు. తాము చేయవలసిన అసలు పని ఎడిటింగేనని కూడా రష్యన్ డైరెక్టర్లు విశ్వసిస్తారు. “లెనిన్ జీవితం” అనే చిత్రంలో 1905 నాటి విప్లవాన్ని, 1917 నాటి విప్లవాన్ని చిత్రించిన విధానం చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. సమూహదృశ్యాలు తీయటంలో రష్యన్లను మించిన చెయ్యిలేదు. వేలకొలది సైనికులు కనిపించే లాంగ్‌షాటు, దాని వెంటనే ఒక సైనికుని చేతిలో తుపాకి క్లోజప్—ఈ విధంగా ప్రతి షాట్ భయంకరమైన శక్తితో, జలపాతంలాంటి వేగంతో ప్రేక్షకులమీద విరుచుకు పడుతుంది. ఇదంతా ఎడిటింగ్ మహత్తే. ఈరకమైన ఎడిటింగ్ విధానానికి రష్యన్లు ఉపయోగించే పేరు “మాంటేజ్.”

* * *

హిందీ సంగీతదర్శకుడు సి. రామచంద్ర న్యూశాయ్ ప్రొడక్షన్స్ అనేసంస్థ స్థాపించి “ఝంఝూర్” అనే చిత్రం తీస్తున్నాడు. ఈ చిత్రంలోని కొన్ని దృశ్యాలు ఇండోనీషియా, జపాన్, థాయిలాండులలో తీస్తారట. ఆ దేశాలకు డైరెక్టర్ కిదార్ శర్మ, నిర్మాత సి. రామచంద్ర, నటుడు భగవాన్, గాయకి లతామంగేష్కర్ మున్నగువారు [illegible]. [illegible] సంస్థ “[illegible]” అనే [illegible] చిత్రాన్ని కూడా ప్రారంభించారు.

* * *

బొంబాయి [illegible] పిక్చర్స్ స్టూడియోను సహకారపద్ధతిమీద నడుపుతున్న స్టూడియో కార్మికుల సంఘంవారు “కోహినూర్” అనే చిత్రం ప్రారంభించారు. ఇందుకుమార్ భట్ దర్శకత్వాన రంజన, నిరూపరాయ్, మంజూ, జైరాజ్, సప్రూ, ఉల్హాస్ మున్నగువారీ చిత్రంలో నటిస్తున్నారు.

* * *

శాంతారాం తీయబోతున్న ఒక చిత్రంలో ఏడుభాషలపాట ఒకటి ఉన్నదట. హిందీ, పంజాబీ, సింధీ, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, తమిళ భాషల్లో చరణాలు ఉండే ఈగీతాన్ని ఏడుగురుకవులు రాశారట; ఏడుగురు ప్లేబాక్ గాయకులు పాడతారట. శాంతారాం పూర్వం తీసిన “ఆద్మీ”లో కూడా వివిధ భాషల గీతం ఒకటి ఉన్నది. అయితే ఆగీతంలో తెలుగు చరణంకూడా ఉన్నది. ఈ కొత్తగీతంలో తెలుగు లేదు.

* * *

ఇటాలియన్‌చిత్రం “బైసికిల్ థీఫ్”ను, జపాన్‌చిత్రం “యూకీవారీసూ”ను ఇండియాలో ప్రదర్శించటానికి లక్ష రూ. లు పెట్టి హక్కులు కొనుక్కున్న కర్దార్-కపూర్ డిస్ట్రిబ్యూటర్లు ఒక్క బొంబాయిలోనే ఈ చిత్రాలపై 4 లక్షల రూ.లు సేకరించారట. ఈ లాభసాటిబేరం చూసి మిగతా డిస్ట్రిబ్యూటర్లు కూడా ఇటలీ, జపాన్ చిత్రాలు తెప్పించాలని ప్రయత్నిస్తున్నారట.

'ed, Printed & Published byS. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chet[illegible] [illegible]dras.